శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

Journal of the Telugu Academy

KAKINADA

దేశ భాషలందు తెలుగు లెస్స

సంపుటము ౫౦ ప్లవ-మార్గశిర-ఫాల్గునములు **సంచికలు ౫-౬**

Vol 50 Parts V & VI

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

స్థాపకులు:

శ్రీ జయంతి రామయ్యగారు

ప్రతిష్ఠాపకులు:

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు

ఉద్ధారకులు:

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు

(జమీందారు, ఉయ్యూరు ఎస్టేటు,)

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

Journal of the Telugu Academy
KAKINADA

సంవత్సరము చందా రు 3-0-0

సంపుటము ౫౦ ప్లవ-మార్గశిర-ఫాల్గునములు సంచికలు ౫-౬

Vol 50 1961-62 Parts V & VI

విషయసూచిక

	పుటలు
1. స్వవిషయము	
చిలుకూరి పాపయ్యశాస్త్రి (సంపాదకుడు)	
2. కుమారసోమేశ్వరుని గూడూరుశాసనము	
శ్రీ కె. హెచ్. వి. శర్మ	1-38
3. శ్రీనాథుని అద్వైతభక్తి	
శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి	39-50
4. భారతపరిశీలనము-ధర్మస్వరూపము	
శ్రీ కృష్ణభిక్షు	51-58
5. గ్రంథస్వీకారము-సమీక్ష	
శ్రీ బండారు తమ్మయ్య	59-74
6. వ్యక్తివివేకము-అనువాదము	
శ్రీ భాగవతుల కుటుంబరాయశాస్త్రి	296-320

స్వవిషయము

ఈ సంచికతో ఆంధ్రసాహిత్యపరిషత్తునకు, పరిషత్పత్త్రికకు నేఁబదియేండ్లు గడచినవి. గ్రాంథికాంధ్రభాషాభివృద్ధికై యోపిన కొలఁది సేవచేయుచు నెట్టి యాందోళనములు చెలరేగినను పడలిపోక నిలిచియున్న ఏకైక పత్త్రిక, సంస్థ యిదియొక్కటియే. గట్టి పునాదులపై ఈసంస్థ నిలిచియుండెనుగాన దీని నిలుకడ యీవిధముగనుండినది. పాఠకలోకమునకు గ్రాంథికాంధ్రభాషపై నింకను శ్రద్ధగలదనుటకు ఈ పత్త్రిక కొనసాగుచుండుటయే నిదర్శనము. ఈ పత్త్రిక తొలుతటి దినములలో చరిత్త్రమునకు మిక్కిలి తోడ్పడునట్టి శాసనములను ప్రతిబింబములతోసహా ప్రకటించుచువచ్చినది. ఈ మధ్య మరల నాపని సాగించుచుంటిమి. పరిషత్పత్త్రికమీఁదిగౌరవముచే బహువివాదగ్రస్తమైన కుమారసోమేశ్వరుని గూడూరుశాసనమును సుపరిష్కృతము గావించి ప్రతిబింబములతోసహా మాకందఁజేసి వ్యాసమును వ్రాసియిచ్చిన శ్రీ కొల్లూరు హర్షవర్ధన శర్మగారికి, దానిని ప్రకటించుట కనుమతించిన ఎపిగ్రాఫికల్ డిపార్టుమెంటు వారికిని పరిషత్పక్షమున నా కృతజ్ఞత తెలుపుకొనుచున్నాను.

ఇట్లు,
సంపాదకుఁడు.

కుమార సోమేశ్వరుని గూడూరు శాసనము.

కె. హెచ్. వి. శర్మ.

'గూడూరుశాసన'మను పేర నిదివఱకు నైదు కడుప్రాచీనమగు తెలుఁగుపద్యములు ప్రకటింపఁబడుచున్నవి. అందు కాలము దానవిషయము లేకుండుట, పద్యములకర్థము సరిగా కుదరకుండుటను బట్టియు నిదియొక విలక్షణమైన శాసనమని, కాని కాకతీయుల పూర్వులను గూర్చిన యద్భుత చరిత్రాంశము లెన్నియో గలవని తెల్పియున్నారు. ఈశాసన ప్రతిబింబమును స్వయముగఁ దీయించి పరిశీలింపవలెనను కుతూహలముతో గతసంవత్సరము వరంగల్లుప్రాంతమున నూతన శాసనాన్వేషణార్థము బర్యటించు సందర్భమునఁ ప్రస్తుతము జనగాము తాలూకా గూడూరులోని వైట్ల వెంకటాద్రి అనువాని యింటిముందఱ ఈ శాసనశిలను గాంచితిని. శాసనము, కంబమునకు పూర్తిగ నాలుగు వైపులను జెక్కఁబడియుండుటచే గూడూరు శాసనమను పేర నిదివఱకు బ్రకటింపఁబడు తెలుగుపద్యములు ఐదు మాత్రమేగాక శాసనమింకను గలదని తోఁచినది. వెంటనే వెనుక అది ప్రకటింపఁబడిన తెలంగాణా శాసనసంపుటమును జూడఁగా, ఈ శాసనగంబపు నాల్గవవైపునఁ గల తెలుగుపద్యములు కాకతీయ శాసనముల నెంబరు 55 గను, మొదటి రెండవవైపులగల కన్నడ గద్యభాగమును, చాళుక్యశాసనముల నెంబరు 35 గను, మూడవవైపునఉన్న కన్నడ పద్యభాగమును ఇతర శాసనముల నెంబరు 13 గను, మొత్తము ఒకేశిలయందు ఒకే లిపిలో చెక్కఁబడిన ఈశాసనమును మూఁడుముక్కలుగఁ బ్రకటించిరి. తదుపరి హైదరాబాదు శాసన సంపుటములలో జాగ్రత్తగా పరిశీలించి ప్రతిబింబములతోఁ బ్రకటించిన డాక్టరు పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు కూడ దీనినిపై తెలంగాణా శాసనసంపుటములలోఁ బ్రకటించినరీతిగనే మూడు ముక్కలుగఁజేసి వేర్వేఱుగ ప్రకటించియున్నారు. అందు తెలుఁగుపద్యముల భాగమునుగూర్చి వారు "*This is an unusual*

inscription judging form its from as well as its contents. There is no mention of either the date or the purpose of the grant." అని తెల్పిరి. శాసనశిల కంటితోఁ జూచినతోడనే నా కెందులకో ఆశిలకన్నివైపులఁ జెక్కఁబడిన శాసనమొక్కటియేయని తోఁచి ప్రతిబింబములుదీయించి మూలము వ్రాసికొని మొత్తమంతయు నొక్కశాసనముగనే సమన్వయము చేయుటకు ప్రయత్నింపఁగా కొన్ని నూతనచరిత్రాంశములు పొడగట్టినవి. వాని నిట నాచేతనైనంతవఱకు వివరింతును. విజ్ఞులు జాగ్రత్తగా పరిశీలించి అవి యెంతవఱకు సమంజసము కాఁగలవో తెలుపఁగోరెద.

తెలంగాణా ప్రాంతమున తదితర అనేక ప్రాచీన దేవాలయముల ముందర నిలబడినట్లేయున్న చక్కని నల్లరాతి శాసన స్తంభముపై నిది సుందరమైన అక్షరములతో స్తంభము నాలుగువైపులను చెక్కఁబడి యున్నది. శాసనశిల సుమారు 5 అడుగులయెత్తును 1½ అడుగుల వెడల్పును ఉన్నది. మొదటివైపు పైభాగమున సూర్య చంద్రులు, పానవట్టముతోఁ గూడిన శివలింగము, నంది మున్నగునవి చెక్కఁబడి యున్నవి. హనుమకొండ, కొలనుపాక, అలంపురము మున్నగు పెక్కు తావులఁగల పశ్చిమచాళుక్యులు లేక కల్యాణి చాళుక్యుల నాఁటిశాసన లిపినే సరిగా నిది పోలియున్నది. అనుస్వారము సర్వత్ర అక్షరముల తలపై నుంచుట, తృభువన, ప్రిథివీశ్వర, విప్ర, గ్రిధ్రా, మున్నగునవి ఇందు గమనింపఁదగినవి. నాల్గవవైపున తెలుఁగు పద్యములుగల భాగమున 'చేతె', 'తనెయురు' మున్నగుపదముల కన్నడ భాషాప్రభావము గలదు. దీనికి కారణము శాసనమంతయుఁ జెక్కిన కన్నడలేఖకుఁడు కొమ్మోజనియే తలంపవలెను. మఱియు 'ఉదయించె', 'ఉదియించె'నని రెండు రూపములును గలవు.

శాసనము, మొదటి మూఁడువైపులను కన్నడ గద్య పద్యము

లలోను నాల్గవవైపున మాత్రము తెలుఁగు పద్యములలోను ఉన్నది. శాసనకాలము రెండవవైపునగల కన్నడగద్యభాగమున చాళుక్యవిక్రమ శకవర్షములు ४९ యగు క్రోధి సంవత్సర పుష్యబహుళ పాడ్యమి ఉత్తరాయణ సంక్రాన్తి బుధవారమని యున్నది. తిథిమాత్రము విదియ యగుచో నివియన్నియు సరిగా క్రీస్తుశకము 1124 డిసెంబరు 24 నకు సరిపోవుచున్నవి.

మొదటివైపు స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వరుఁడు, పరమ భట్టారక, సత్యాశ్రయకుల తిలక, చాళుక్యాభరణుఁడగు శ్రీమత్త్రిభువన మల్లదేవుఁడు విజయ రాజ్యముత్తరోత్తరాభివృద్ధి ప్రవర్ధమాన మాచంద్రార్కతారము జయన్తిపురము రాజధానిగా సుఖసంకథావినోదంబున రాజ్యము సేయుచుండఁగా నతని యాత్మజుఁడు సమధిగత పంచమహాశబ్ద మహా మండలేశ్వరుఁడు, వీరమహేశ్వర, విజయలక్ష్మీనివాస, రణరంగ దక్షిణ దోర్దండుఁడు, ద్వాదశమండలీకర మార్తాండ, ప్రతాపాక్రాన్త నవఖండ భూమండల, రాజలీలా చమత్కృతాఖండల, కోదండచతుర్భుజ, శృంగార మకరధ్వజ, త్రిభువనరంగ ప్రవర్తితకీర్తి నర్తకీన ర్తన సూత్రధార, శరణా గతవజ్రపాకార, మూఱురాయ కవికువర బిరుదహృదయాకంప, త్యాగ జగఝంప, అర్థిజనచిన్తితార్థ చింతామణి, సుభటమండలికమకుట చూడామణి, కుంతలరాజ్యాభ్యుదయకారణ, బప్పనగంధవారణ బిరు దాంచితుఁడగు శ్రీమచ్చాళుక్య గంగపెర్మాడి కుమార సోమేశ్వర దేవుఁడు పేర్కొనఁబడినాఁడు. తదుపరి రెండు కన్నడపద్యములలో ఆ కుమారసోమేశ్వరుని పరాక్రమ విజయము లభివర్ణింపఁబడినవి. అతని పరాక్రమము అమిత్రాంగనాకుల బాష్పప్రవాహము మున్నగువానితో రిపుసేనాచక్ర రక్తాంబుధిని మఱింత వృద్ధినొందించినదట. ప్రకటాటో పమున నాతఁడు చోడగంగదనుజాధీశుని తరిమి కోపాగ్నిచే తినియు

నుఁడు పురత్రయమును దహించినట్లు కళింగత్రయమును కాల్చివేసెనట.

రెండవవైపు ఆసోమేశ్వరుని పాదపద్మోపజీవి సమధిగతపంచ మహాశబ్ద, మహాసామన్తాధిపతి, మహాప్రచండ దండనాయకుఁడగు స్వామిదండాధినాథుఁడు మూఁడు కన్నడపద్యములలో వర్ణింపఁబడెను. మదించిన శత్రుసైన్యమనెడి బలిష్ఠవనమునకు దావానలము, వారయోషిద్వదనాంభోజాత రాగోదయమునకు భాస్కరుఁడు, ఆత్మీయదానాంబుధారా ముదితాశేషార్థికేకి వ్రజుఁడు, అమలయశోమూర్తికాలంకృత శారదాచంద్రుఁడు, శిష్టచింతామణియని స్వామిదండాధిపుఁడు వినుతికెక్కెను. అతులభుజబలుఁడు, రిపుభయంకర, ఆత్మదాన,ఆశ్రిత జనతుష్టి, అమేయవిశుద్ధచరిత్ర సంపద, కామినీవ్రత జితకారకుఁడని స్వామిదేవుఁడు భువిలో పొగడ్తలు పొందెను. మఱియు సముద్రునిబోలి భీరుమహీభృత్ప్రక రాధారత,ఉగ్రసత్యములు, అనుపమితాకారుఁడైయుండెను.తదుపరి కన్నడగద్యలో ఈశాసనకాలము, దానవిషయము వివరింపఁబడినది. చాళుక్య విక్రమ శకవర్షములు ౪౯ యగు క్రోధి సంవత్సర పుష్యబహుళ పాడ్యమి బుధవారమునాండు శ్రీ మన్మహామండలేశ్వర చాళుక్య గంగపెర్మాడి కుమారసోమేశ్వరదేవుఁడు తన మహాప్రధాని, మనెపెర్గడె కొలనుపాక ఏడువేలకు దండనాయకుఁడగు సావిపయ్య (స్వామిదండాధినాథుని)విన్నపమునఉత్తరాయణసంక్రాన్తి నిమిత్తమున కుముదూరమల్లేశ్వరుని అంగరంగభోగములకు సర్వబాధా పరిహారముగ సర్వనమస్యముగ వేల్పుగొండ ఇరువది నాలుగులోని బమ్మరిగను ధారాపూర్వకముచేసెను. పిదప 'స్వదత్తం పరదత్తం వా' అనువ్యాసగీతము, తదుపరి శ్రీ మత్త్రైలోకనాథుఁడు, దివిజదనుజ నాగేంద్రుల ప్రకాశించుచున్న కిరీటముల సముదాయముచే వ్యాప్తమైన నానామణి కిరణములతో కూడుకొనిన పాదారవిందుఁడు, కామప్రధ్వంసి, గంగాజలవిలసిత జటాజూటుఁడు, చంద్రచూడారాముఁడగు

మల్లేశ్వరుఁడు మీ అభిమతఫలసంసిద్ధినెల్లపుడు సేయుగాకయని మల్లేశ్వరుని స్తోత్రముతో రెండవవైపు ముగింపఁబడినది.

మూఁడవవైపు విరియాలవంశజులప్రశస్తి కన్నడ పద్యములలో నున్నది. విరియాలాన్వయ నీరజాకరదినేశుఁడు, నిర్మలక్షీరసాగర సంకాశ విశుద్ధకీర్తియుతుఁడు, కనకాద్రినిబోలియున్నతుఁడు వందిపాత్రరశిష్టేష్టకపీంద్రకీర సహకారము, వైరిమదగజములకు కేసరి, ఉన్నతగుణోదారుఁడని విభుసూరుఁడు భువిలో ప్రసిద్ధినొందెను. వినయవినీతుఁడు, భువనప్రసిద్ధకీర్తిలతా విఖ్యాతుఁడు, సజ్జనుల ప్రీతినొందినవాఁడు, కల్పవృక్షమునుబోలి ఉదారుఁడగు బేతఁడాతని పుత్రుఁడు. వాని మనోనయన ప్రియ, భువనజనస్తుతచరిత్ర, సద్గుణగణ సంభవజన్మభూమి, సజ్జన యువతీరత్నమని బెజ్జమాంబిక పేరెన్నికగనెను. అరమణీమణి వల్లభుఁడు, వారవధూనిధియైన (బేతనకు)సమస్త సద్గుణనిలయుఁడు, వీరారిదర్పదలనుఁడు. వీరాగ్రణియని ప్రసిద్ధినొందిన మఁల్ల డుద్భవించెను. భాస్వత్సుధాసుందర విశదయశస్సుగల ఆమల్లఁడు అత్యున్నతి మహిమచే హేమాద్రియనియు, విస్తృతవితరణ సామర్థ్యమున కల్పవృక్షమని అతిశయించిన గాంభీర్యమున దుగ్ధాంభోధియనియు ప్రశంసింపఁబడెను. శాశ్వత పుణ్యమూర్తి, అఖిలార్థిసురానకజాత, ఘనకీర్తిసద్గుణగణాభరణుఁడు, ఘనబాహువిక్రముఁడైనమల్లఁడుగుముడూరులో విశ్వధరాతలమంతయు పొగడునట్లు మల్లేశ్వరమను తటాకమును, గొప్ప నూతులను త్రవ్వించెను. అధికపుణ్యాగణ్యుఁడు కటకమున్నతివ బిరుదాంచితుఁడగు అతఁడు అనుపమమైన శివాలయమునుగూడ గుముడూరులోఁగట్టించెను. ఈధరయు, సురాద్రిసాగరము, సూర్యచంద్రులు, మహేశ్వరుఁడు, దిగ్గజము లుండునంత కాలము కవీంద్రబృందమును పోషించుచు నోమల్ల సుఖముగ నుండుమా! తదుపరి నాలుగు వ్యాసగీతములతో నీవైపు అంతమైనది.

ఇఁక నాల్గవ వైపున గాకతీయుల పుట్టుపూర్వాది యద్భుతాంశ ములను దెలుపు గూడూరుశాసనమని ప్రకటింపఁబడు తెలుగుపద్య ములు ఐదును గలవు. అనుపమ దుర్జయాన్వయసుధాబ్ధి ననేకులు రాజ నందనులు గతించినవెనుక విరోధిమండలికి విష్ణువవలె, పోరంటి వెన్నఁ డుద్భవించెను. వానికి జగద్వినుతుండు, ఘనుఁడగు ఎఱ్ఱభూపతి పుట్టెను. ఆతనికి పాండవమధ్యము భీముఁడోయన నృపసుస్మరుఁడైన విరియాల భీముఁడు, వానికి భూవినుతుండు, మండలిక భూషణుఁడు, ఉత్తమ శ్రీవినుతుండు, బంధుజనసేవ్యుఁడగు ఎఱ్ఱనరేంద్రుఁడును జన్మించిరి. అప్రతిముఁడు ఆయెఱ్ఱనరేంద్రుఁడు బొట్టుబేతవసుధాధిపుని జేకొని వాని వైరినుద్ధృతముగఁజంపి ఆకోలవిదేశమునందుఁ బ్రతిష్ఠించి, వానిచే మొగ డుపల్లి పండ్రెండు నేలుటకుఁ బొందెను. ఆయెఱ్ఱనృపుని భార్య కామ సాని కాకతివల్లభుఁడగు ఆచిన్నబేతరాజును చేఁబట్టి ఘనుఁడగు పల్లవ రాయనితో బ్రతిజ్ఞచేసి, భాస్కర విభుచక్రవర్తిని(సూరఁడనువానిని) గని కాకతినిల్పుట కోటిసేయుదా ? ఆసూరఁడు (పై యెఱ్ఱనృపకామ సానుల పుత్త్రుఁడు) కారకాలుఁడై కాటయనాయకుఁజంపి, వేలుపుగొండ రవ్వనృపుని వేలుపుగొండనె నిల్పి వానిచే బోదిపాడు, ఉకుమామిడి, రెండయరాజు సంగడి మున్నగువానిని బడసెను. తదుపరి సూత్రధారి కొమ్మోజు వ్రాసినది, అడపగట్టుదేవరకు జనునని శాసనము పూర్తి యైనది.

దీనినిబట్టి మొదటి రెండువైపులనుగల కన్నడభాగమున నీశా సనము వేయించుటకుఁగాను ప్రధానోద్దేశ్యము, కాలము దెలుపఁబడి నవి. పశ్చిమచాళుక్య చక్రవర్తియగు శ్రీమత్త్రిభువనమల్లుని పుత్త్రుఁడు కుమారసోమేశ్వరదేవుఁడు తన మహాప్రధానియు, కొలనుపాక ఏడు వేలకు దండనాయకుఁడగు స్వామి దండాధినాథుని విన్నపమున పైన వివరించిన కాలమున గూడూరు మల్లేశ్వరదేవునకు బమ్మరగ్రామ-

మును ధారాపూర్వకముగ నిచ్చెను. ఇదియే ఈశాసనము పుట్టుటకుఁ గల ప్రధాన కారణము. తదుపరి మూఁడవవైపు విరియాల మల్లనవంశ వర్ణన, ప్రశస్తి, ఆతఁడు గూడూరులో గట్టించిన స్వనామాంకితమైన శివాలయము,మల్లేశ్వరనామాదివాపీ,తటాకములు పేర్కొనఁబడినవి. ఇందాతఁడు గావించిన వాపీతటాక, శివాలయముల ప్రస్తావనయేగాని దానవిషయమేమియుఁ గానరాదు.మఱియు రెండవవైపు 'వృత్తి'యని శాసనభాగము ముగింపఁబడి సరిగా మూఁడవవైపు కన్నడపద్యములో 'విరియాలాన్వయ నీరజాకర'అనిప్రారంభించుటనుబట్టి మూఁడవవైపునఁ గల శాసనభాగమును మొదటి రెండవవైపులఁగల దానితోఁ జేర్పవలెనని సూచించుచున్నది. ఇట్లీ మూడువైపులఁగల శాసనమొక్కటియే యని నిర్ధారణచేసిన, మొదటి రెండువైపులఁ బేర్కొనఁబడి బమ్మెర గ్రామమును దానమిప్పించిన స్వామిదండాధినాథుఁడు,మూఁడవవైపున దనపేరుతో గూడూరులో మల్లేశ్వరస్వామిని బ్రతిష్ఠించిన విరియాల మల్లనయొక్కరా లేక భిన్నపురుషులా యని సందేహము కలుగును. స్వామి దండాధినాథుని శాసనములు కొన్ని కొలనుపాకలోఁ గలవు. వానిలో నెచ్చట నాతఁడు విరియాలవంశజుఁడని కాని,అతనిపేరు మల్లన యని గానిలేదు. అట్లే విరియాలవంశజుల శాసనములందు నెచ్చటను ఈ మల్లన పశ్చిమచాళుక్యుల దండనాథుఁడని గాని,కొలనిపాక పరిపాలకుఁడనిగాని తెలియుటలేదు. ఇక వారిరువురను భిన్నపురుషులుగనే తలంచి గూడూరులో వెనుక విరియాల మల్లనప్రతిష్ఠించిన మల్లేశ్వరునకు కొలనుపాక పాలకుఁడగు స్వామి దండాధినాథుఁడు దానమిప్పించెనని చెప్పవలెను. అంతకంటె స్వామి దండనాయకుని పూర్తిపేరు మల్లేశ్వర స్వామియనియు, నాతఁడే విరియాల మల్లన,వానివంశ వర్ణన ప్రశస్తులే మూఁడవవైపున నుగ్గడింపఁబడినవనియుఁ దనపేరుతో బ్రతిష్ఠింపఁబడిన మల్లేశ్వరునకు తనవేలిక యనుమతిన బమ్మెరగ్రామమును

దానమిచ్చెనని తలంచుటగూడ సమంజసముగాకపోదు. మూడవవైపునఁగల ఆఖరి కన్నడపద్యమునుబట్టి ఆవిషయము కొంతవఱకు స్పష్టపడుచున్నది. మఱియు స్వామిదండాధినాథుఁడు విరియాల వంశజుఁడు కాదని లేదా మల్లన పశ్చిమచాళుక్యుల సామంతుఁడు కాఁడని గాని స్థిరమైన శాసనాధారము లభించువఱకు స్వామి దండాధినాథుఁడే విరియాల మల్లన యని నా యభిప్రాయము.

మూఁడవవైపున మొట్టమొదటి కన్నడ పద్యములోఁ బ్రశంసింపఁబడిన విరియాల సూరఁడు, వాని పూర్వులు వారి ఘనకార్యములు నాల్గవవైపునఁగల తెలుగు పద్యములలో వర్ణింపఁబడినవి. అందు నాలుగైదు పద్యములను బట్టి ఆతని తల్లిదండ్రులు విరియాల కామసాని, ఎఱ్ఱనరేండ్లనియు, వారిరువురును పసివాఁడగు కాకతిబేతరాజు పక్షమునఁ బోరి వానిశత్రువులను వినిర్జించి మరల వానిని సింహాసనమునఁ బ్రతిష్ఠించినట్లు తెలియుచున్నది. కాకతిబేతరాజు శత్రువులను జంపి యాతనిని రాజ్యమునందు స్థిరముగ నెలకొల్పుటకు విరియాల సూరఁడుకూడ మిక్కిలిసహాయపడినట్లు ఆపద్యములనుబట్టియే స్పష్టము.

ఈనాలుగవవైపునఁగల తెలుగు పద్యములకర్థము సరిగా లేదని పండితులు, విమర్శకులు నెవరికిఁ దోచినట్లు వారందలి పదములను కూర్చి, మార్చియు సమన్వయము చేయుటకుఁ బ్రయత్నించియున్నారు. హైదరాబాదు శాసనసంపుటములలో దీనిని ప్రకటించిన డాక్టరు. పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు ఈ పద్యములను విరియాల వారెవరో కల్పించి ఆపత్కాలమునఁ గాకతీయులకు సహాయము చేసినట్లు

1. ప్రస్తుతము హైదరాబాదుజిల్లా పటంచేరు గ్రామమునగల భూలోకమల్లబిరుదాంచితుఁడగు సోమేశ్వరుని శాసన మొకదానిలో మహామండలేశ్వరుఁడు కరితురగపట్టసాహిణీ మల్లియణ్ణ పేర్కొనఁబడినాడు. ఈతఁడు విరియాలవంశజుఁడగు నేమో తెలియదు.

వ్రాయించిన ప్రాచీన కృత్రిమ శాసనమనుటకుఁ గూడ సాహసించిరి. *"while the Gudur incription seems to be an early forgery of an ambitious Viriyala chieftain who schemed to foster and perpetuate a tradition that his ancestors have saved the ruling Kakatiya dynasty in a critical moment."* ముందుగా ఆ పద్యములయందలి పాఠభేదములను దెల్పి తదుపరి యథార్థ చరిత్రాంశములను వివరింతును. మొదటి పద్యములోని "బోఱంటి వెన్నడను సంభవుడయ్యె" ననుటకు బదులు "బిఱింద, లేక బిఱుంద వెన్న" దని చదివి యందలి పోరంటివెన్నని గుర్తింప లేకపోయిరి. కాకతి గణపతి దేవుని కోలవెన్ను తామ్రశాసనములోని పోరంటివెన్నభూపాలుఁడు, సిద్ధేశ్వర చరిత్రి, ప్రతాపచరిత్రి,సోమదేవ రాజీయ గ్రంథములలోఁ బేర్కొనఁ బడిన పోరికి వెన్నమరాజు ఈ తఁడే. మూఁడవ పద్యములోని "అప్రతిముఁడు వానిచే మొగడు పల్లియు పంద్రడునేలు నప్పుడే" యనుటకు బదులు "అప్రితిముఁడు వాని చా మొగుడు పర్సియు పంద్రడు నెట్టఁ డాప్తుడై" యని చదివి అర్థము సరిగాలేదని తెల్పిరి. ఇక నాల్గవ పద్యములోని "ఘనుబల్లవ రాయ నిమోగి జొచ్చి భాస్కరవిభు చక్రవర్తిగని కాకతి నిల్పుట గోటిసేయచే" యను దానిని గూర్చి అనేక విధములఁ దలంచిరి. కవితరంగిణి కర్తలగు శ్రీ చాగంటి శేషయ్యగా రీపద్యమును గూర్చియిట్లు తెల్పిరి.పల్లవరాయఁడొకఁడు కాకతిపై కిదండెత్తిరాఁగాఁ గామమ్మ వానిని నిరోధించుట (ఆక=నిరోధించుట) మంచి బుద్ధియని (మేల్కరదని, కఱద=బుద్ధి) తలంచి, తాను స్త్రీ కావున తనభర్త చేఁ గొఱవి దేశమునఁ బ్రతిష్ఠింపఁబడిన బేతరాజును గాకతికిఁ బ్రభువునుగాఁ జేసి, యాతని సాహాయ్యమున నా పల్లవరాయనిని గాకతిపై రాకుండ నడ్డగించి (అఁగి=అడ్డగించి) పిమ్మటఁ జక్రవర్తియైన భాస్కరవిభుని దర్శించి యాతని నాశ్రయించెను. (చొచ్చె=ఆశ్రయించె) ఈ విధ

ముగాఁ జేసి కాకతి రాజ్యమును నిలుపుట వలన నామెచేసిన కార్యము కోటిగుణిత మైనదికదా! ఇది నాల్గవ పద్యార్థమని నా యభిప్రాయము. అయినచో నిందలి పల్లవరాయఁడెవఁడు? భాస్కర విభుఁడెవ్వఁడు? అని ఆలోచింపవలసియున్నది."

ఈ శాసనము క్రీ. శ. ౧౦౦౦ సంవత్సర ప్రాంతము నాఁటిదని పై నవ్రాసియుంటిని. ఆకాలమునఁ బశ్చిమ చాళుక్యుఁడగు మొదటి త్రిభువన మల్లుఁడు చక్రవర్తిగానున్నాఁడు. అతని పేరు విక్రమాదిత్యుఁడు. అతనికి విభు విక్రముఁడను బిరుదము కలదు. ఇందలి ఆదిత్య విభు శబ్దములను దీసికొని, భాస్కర విభుఁడని పై పద్యములో నప యోగించినాఁడని నా యభిప్రాయము. ఈ మొదటి త్రిభువనమల్లుని రాజ్యగాలము క్రీ. శ. ౧౦౭౬ మొదలు ౧౧౨౬ వఱకునై యున్నది. పశ్చిమ చాళుక్యులకుఁ బల్లవరాజులు సామంతులుగా నుండిరనుట సుప్రసిద్ధ చారిత్రక విషయము. పల్లవ సామంతుఁ డొకఁడప్పుడు కాకతిపై దండెత్తి వచ్చెననియు, కామమ్మ, బేతరాజు సాహాయ్యమున నాతనిని నిరోధించి, విక్రమాదిత్యుని శరణుజొచ్చి కాకతిరాజ్యమునకు వారివలన బాధలేకుండఁ జేసియుండుననియు, దలంపవలసి యున్నది. అప్పటినుండియు బేతరాజు విక్రమాదిత్యునితో మైత్రిఁ గలిగి యుండును". శ్రీ శేషయ్యగారు వ్రాసినదానినే కొద్దిగా మార్చి ఇటీవల సిద్ధేశ్వర చరిత్రమును పరిష్కరించి ప్రకటించిన ఆచార్య శ్రీ. ఖండవల్లి లక్ష్మీరంజనముగారు ఈ పద్యములోని "భాస్కరవిభు చక్రవర్తి" యనుటకు బదులు "భాస్కరనిభ చక్రవర్తి" యని సవరించిన చాలబాగుండుననియు నప్పుడు సూర్యునితో సమానమగు చక్రవర్తి యనఁగా పశ్చిమచాళుక్య ప్రభువగు రెండవ తైలపుఁడని, మఱియు నప్పుడే ఉదయించిన పశ్చిమచాళుక్య సామ్రాజ్యమున కీవి శేషణమెంతయు సమంజసమనియుఁ దెల్పిరి. ఇఁక డాక్టరు

పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు "నిజాబ్జ భాస్కర విభు చక్రవర్తి" అని చదివి సాహిత్యపరముగనేమేమో వ్రాసిరి. ఐదవ పద్యమునఁ బ్రధానముగ వర్ణింపఁబడిన విరియాల సూరని వారు గుర్తింపనేలేదు.

నాల్గవ పద్యములోని కామసాని "భాస్కరవిభు చక్రవర్తి గని కాకతి నిల్పుట గోటి సేయదే" యనుదానికి పై పండితులందఱు ఆమె కాకతిబేతరాజు నుద్ధరించుటకుఁ గాను తమ ఏలికయైన పశ్చిమ చాళుక్య ప్రభువును దర్శించినదనియే అని చెప్పిరి. అది సరిగాదని నాయభిప్రాయము. ఆమె భాస్కరుఁడు లేక సూరఁడను పేరు గల వానిని కనుటచేతనే కాకతి వంశమును నిల్పఁగల్గినదనియే దానిభావము. ఈ భాస్కరవిభుఁడే తర్వాత పద్యమున సూరఁడనియు, మూఁడవవైపు కన్నడపద్యములలో విభు సూరఁడనియుఁ బ్రశంసింపఁబడినాఁడు. ఇతఁడే కటుకూరు మున్నగు విరియాల వంశజుల శాసనము లన్నిట వారి మూలపురుషుఁడుగ నుగ్గడింపఁబడినాఁడు. కాకతీయులలో మొదటిసారి స్వాతంత్ర్యమును బ్రకటించిన రెండవ ప్రోలరాజును, రెడ్డిరాజులలో ప్రోలయవేముని, విజయనగర తుళువంశజుల శాసనములలో నరసింహరాయులను, గజపతుల శాసనములన్నిట కపిలేశ్వరుని వారి వారి వంశకర్తలుగ వర్ణించుట పరిపాటియేగదా! అట్లే విరియాలవంశజుల శాసవములన్నిట. ఈ సూరఁడు కాకతి సామ్రాజ్యము నాపదనుండి రక్షించుటచేఁ గాబోలు తఱుచు వారి వంశకర్తగా ప్రశంసింపఁబడినాఁడు. ఈ సూరని తాతముత్తాతలు మఱి నాలుగు తరముల వారిందు మొట్టమొదటిసారి తెలియవచ్చిరి.

ఇట్టులీ శిలయందు నాలుగువైపుల చెక్కఁబడిన శాసన మొక్కటియే యనియు, నది యప్పటి పశ్చిమ చాళుక్య ప్రభువగు త్రిభువనమల్లుని పుత్రుఁడు కుమారసోమేశ్వరుని మహాప్రధానిగా కొలనుపాక నుండి పాలించు స్వామి దండాధినాథునిచే గూడూరులో

బహుళః తనచే నిర్మింపఁబడి ప్రతిష్ఠింపఁబడిన మల్లేశ్వరస్వామికి, వేలుపుఁగొండలోని బమ్మరనుధారాపూర్వకముగ రాజకుమారునిచే నిప్పించినట్లు, తదుపరి తన విరియాలవంశజులలో పూర్వుల ప్రశస్తి, ప్రసక్తానుప్రసక్తముగ వారు చేసిన ఘనకార్యములలో నొక్కటి యగు కాకతి బేతరాజును రాజ్యమునందుఁ బ్రతిష్ఠించుట వర్ణింపఁబడినవి. ఈ నామసమన్వయమున కాధారముగ కూడూరునకుఁ దగ్గరనే గల కొలనుపాకలో నీ స్వామి దండాధినాథునివే మఱికొన్ని శిలాశాసనము లిదేపద్ధతిలో చెక్కఁబడియున్నవి. అందొక దాని నిచ్చట తడవుట యప్రస్తుతముకాఁజాలదు. ఈ శాసనము నకిగా కూడూరు శాసన లిపిలో కన్నడ సంస్కృత భాషలలో స్తంభము నాలుగు వైపులను చెక్కఁబడియున్నది.

మొదటివైపు మొదటి పద్యమున స్వామి దండాధినాథుని కీర్తి ప్రశంసయున్నది. అంబరతిలకస్థానమందలి అంబర తిలకమని, ఉర్వీలల నారత్న స్తంభమనియు స్వామిదేవుని ఈ కీర్తి స్తంభము గలదు. తదుపరికాలము, దానవిషయము పేర్కొనఁబడినవి. చాళుక్య విక్రమ వర్షము ౫౦యగు విశ్వావసు సంవత్సర చైత్ర బహుళ తదియ సోమవారమునాఁడు, ఉత్తరాయణ సంక్రాన్తి నిమిత్తమున శ్రీమన్మహామండలేశ్వర చాళుక్య గంగ పెర్మాడికుమార సోమేశ్వర దేవుఁడు మహాప్రధాని మనెవెర్గడె కొలనుపాక ఏడువేలకు దండనాయకుఁడగు సాయిమయ్య(స్వామిదేవ) విన్నపమున నిజరాజధాని కొలనుపాకలోని చాళుక్యకులతిలకమనిమెడి అంబర తిలకస్థ అంబికాదేవి యంగరంగ భోగములకు పోళలలోని పానుపురమను గ్రామమును సర్వనమస్యము, సర్వబాధాపరిహారముగ ధారాపూర్వకముచేసి యిచ్చెను. ఆ దేవి పెర్గడెయగు కేశిరాజు ఈధర్మమును సక్రమముగ జరుపువాఁడు. తరువాత రెండు వ్యాసగీతములు. మరల కన్నడ వచనములో దీని

నా చంద్రార్కముగా చువాఁడు పరమ సుఖాస్పదుఁడగు; పాపబుద్ధిచే నాశ మొనరించువాఁడు నరకమును బొందునని యున్నది. శ్రీమదక్క బసదికి బూర్వము నడచే దేవభోగస్వామ్యము విడచి యిచ్చినదని ఈ వైపు అంతమైనది.

మూలము

అంబరతిళక స్థాన దొ
ళం బరతళ తిళకమనెను దుర్వీలలనా
ళం బసరత్న స్తంభమి
దెంబినెగం స్వామిదేవ కీర్తి స్తంభం

స్వస్తిశ్రీ మచ్చాళుక్య విక్రమ వర్షద ౨౦ం అయ్యుత్తనెఁయ విశ్వావసు సంవత్సరద చైత్ర బహుళ తదిగె సోమవారదం దుత్త్రాయణ సంక్రాంతి నిమిత్తం శ్రీమన్మహామణ్ణళేశ్వరం చాళుక్య గంగ పెర్మాడి కుమార సోమేశ్వర దేవర్మహా ప్రధానం మనెవెర్గడె కొళ్ళి పాకె మెళ్ళాసిరద దండనాయకం సాయిమయ్యగ బిన్నపదిం నిజ రాజధాని కొళ్ళిపాకెయ చాళుక్య కుళతిళక మెనిసి దంబర తిళకదం బికాదేవిగంగభోగరంగభోగం గళిగె పొళల బళియపాను పుతా మెం బూరం సర్వనమస్యం సర్వబాధాపరిహార మాగెధారా పూర్వకం మాడి కొట్టర్॥ దేవియ పెర్గడె యాగికేసిరాజ ని ధర్మ మనూర్జిత మాగె నడసువం॥

బహుభిర్వసుధా దత్తా రాజభి స్సగరాదిభిః
యస్య యస్య యదా భూమి స్తస్య తస్య తదాఫలమ్
మద్వంశజాః పరమహీపతి వంశజావా
పాపాదపేత మనసో భువి భావి భూపాః
యే పాలయంతి మమధర్మమిదం సమస్తం
తేషాం మయా విరచితోంజలి రేషమూర్ధ్ని

ఇదనా చంద్రార్కం బర
ముదితోదిత మాగె కాదవం పరమసుఖా
స్పదనక్కుం పొపందింద
ఇద దురాత్మం నరకగతిగె గళగళ నిళిగుం॥

శ్రీమదక్క-బసదిగెపూర్వదలునడవదేవభోగస్వామ్యంపొఅగాగిబిట్టర్-

రెండవవైపు మొదటి ప్రక్కన పేర్కొనఁబడిన ఆ స్వామి దండాధినాథుని ప్రశస్తి నాలుగు కన్నడ పద్యముల, ఆతని ఏలికయు, రాజకుమారుఁడగు సోమేశ్వరుని పరాక్రమము ఐదవ పద్యమున నుగ్గడింపఁబడినవి. సాటిలేని ప్రతాపము, అనవద్య గుణములు, నిజదానముచే తృప్తిని బొందించిన దేవప్రకరము, సమస్త జగతీ తల వర్తికీర్తి, జనానురాగము గలవాఁడు; మఱియు నిజప్రభు మంత్రోత్సాహశక్తిత్రయముచే అతులైశ్వర్య, తత్ప్రాజ్య రాజ్యాభ్యుదయ, ఉత్సాహములను నిజపతికిఁ గూర్చి నట్టివాఁడు; శరనిధివలె అశేష మహిమాస్పదుఁడు, అంబరమువలె మిత్ర. సద్గురు కవిరాజవైభవ కరుఁడు, బ్రహ్మవలె చతుర్ముఖుఁడు, ఇంద్ర నరేంద్రులవంటివాఁడని సావిచమూపతిని జగజ్జనులు వేయివిధములఁ బ్రశంసించెదరు. హరి హర, జిన, బుద్ధ పదాంబురుహ సమభ్యర్చకుఁడు, సకల వసుంధరా చతుస్సమయ సముద్ధరణ యోగ్యుఁడనియుఁ బొగడఁబడెను. ఆఖరి పద్యమున ఆతని ఏలిక కుమారసోమేశ్వరుని పరాక్రమవర్ణనతో నీ వైపు ముగిసినది. త్రికళింగావనీ పాలుని యుద్ధమున వెన్నాడి, యాతని దేశమును ప్రకటాటోపమున చూఱగొని, యాతని యుగ్రేభములను ముట్టడించి గెల్చి రాజపుత్రుఁడగు సోమేశ్వర దేవుఁడు సకల శ్రీయుతమైన శ్రీమజ్జయ స్తంభమును నిల్పెను.

మూలము

అప్రతిమప్రతాప మనవద్యగుణం నిజదానతృప్తదే
వప్రకరం సమస్త జగతీ తళ వర్తిత కీర్తి సావి దే

వప్రభుదండనాథ తిళకం నెగళ్దం జగదొళ్ జనానురా
గ ప్రభవాహి సంపదమెనిర్ప జనోక్తి సదుక్తి యప్పినం
ప్రభుశక్తి ఖ్యాతియించం నిజపతిగతుళైశ్వర్యమం మంత్రశక్తి
ప్రభయింత ప్రాజ్యరాజ్యాభ్యుదయ పదవియం స్వీకృతోత్సాహశక్తి
ప్రభవశ్రీయింత దుత్సాహ మనొదవిపనే దండెసామాన్యసంప
త్ప్రభుమంత్రోత్సాహ శక్తిత్రయనయనియతం స్వామిదణ్డాధినాథం
శరనిధియంత శేషమహిమాస్పద నెంబరదంతె మిత్రస
ద్గురుకవిరాజ వైభవకరం రవియెంతెనె దానభోగవం
బురుహ తనూజనంతెచతురాన (న) నింద్రనగేంద్రదంతెసు
స్థిరతరనెందు బణ్ణిపుదు సామిచమూపతియం జగజ్జనం.

హరి హర జిన బుద్ధపదాం
బురుహ సమద్భ్రమర నొప్పిదం సకళవసు
ధ్ధరెగె చతుస్సమయ సము
ద్ధరణం శ్రీస్వామిదేవ దండాధీశం

త్రికళింగావని పాళనం సమరదొళ్ చెంకొణ్డు తద్దేశమం
ప్రకటాటోపదె నూఱగొణ్డుం తదుదగ్రోభం గళం ముత్తికొ
ణ్డకుమారాగ్రణి గల్దు చక్రితనయం సోమేశ్వరోర్వీశ్వరం
సకళ(శ్రీ)వరనింతిదం నిఱిసిదం శ్రృంఖజ్జయ స్తంభమం.

మూఁడవవైపు యక్షిణీప్రార్థనతో నారంభింపఁబడి కుమార సోమేశ్వరుఁడు, ఆతని దండనాథుఁడగు స్వామిచమూపతి వరుసగ మరల ప్రశంసింపఁబడిరి. సంతోషప్రదమైనది, అభిమత లక్ష్మీభవ్య కోటిని బొందించునది, నిరుపమగుణ రత్నానంతకాంతిని వెదఁజల్లునది, సకలసమయధర్మాచార రహస్యార్థ మూలప్రకృతి, అమృతమయ మూర్తియైన యక్షిణి మిమ్ము రక్షించుఁగాక. ఈమె మొదటివైపు

పేర్కొనఁబడిన అంబరతిలకస్థయగు జైన దేవత,అంబికాదేవి. పానుపుర గ్రామము నీమె యంగరంగభోగములకు దానమిచ్చినందుల కే ఈశాసనము లిఖింపఁబడినది. తదుపరి "స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ" ఇత్యాది ప్రశస్తితో కుమారసోమేశ్వరుఁడు పేర్కొనఁబడెను. ఈప్రశస్తిగూడూరు శాసనమునందలియీతనిప్రశస్తిసరిగానొక్కటిగనున్నవి. సంస్కృతశ్లోకమున పూర్వాద్రిమొదలు సేతుపర్యంతము పశ్చిమ సముద్రముమొదలు మేరుపర్వతమువఱకు వసుధాధిపత్య పదవి నధిరోహించి అప్రతిమప్రతాప విభవములుగల సోమేశ్వరుఁడు ప్రకాశించుగాకయని గలదు. పిదప కన్నడపద్యము. విశ్వధరాధురంధర భుజాపరిఘుయు, ద్రవిడాధినాథహస్త్యశ్వ పదాతిసాధన వనషుయ కోపాగ్నియని చళుక్యగంగ సోమేశ్వర దేవుఁడు ఇలావలయాధిపరాజ పుత్రులందఱిలో శాశ్వతకీర్తితో నొప్పెను. ఇఁక స్వామిదండాధినాథుఁడాతని సామంతుఁడుగఁ బేర్కొనఁబడి, సంస్కృతశ్లోకమున నాతని ప్రశస్తితో మూఁడవవైపు ముగిసినది. భువన భూషాభూతవిఖ్యాత మూర్తి, దిగిభదశనలీలాశ్లిష్ట విస్పష్టకీర్తి, వివిధనృపమదేభభ్రాంతయూథాధినాథుఁడు, ప్రథిత వితరణశ్రీకుఁడగు స్వామిదండాధినాథుఁడు ప్రకాశించుఁగాక !

మూలము

"ముదమభిమత లక్ష్మ్యై భవ్యకోటీం నయంతీ
నిరుపమ గుణరత్నానంతకాంతిః స్ఫురంతీ
సకల సమయధర్మాచార గమ్యార్హమూల
ప్రకృతి రమృతమూర్తి ర్యక్షిణీ రక్షతాద్వః"

స్వస్తి సమస్తభువనాశ్రయ శ్రీపృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయకులతిలక చాళుక్యాభరణ శ్రీమత్త్రిభువన మల్ల దేవరసుఖసంకథా వినోదదిం రాజ్యంగెయ్యుత్తి

ఋరె తదాత్మజం సమస్తభువన మహనీయ మహిమోత్తుంగ చాళుక్య గంగమహారాజాధిరాజ పరమేశ్వరం వీరమహేశ్వరంవిజయలక్ష్మీనివాస దక్షిణ దోర్దండం ద్వాదశమణ్డలికమణ్డలిమార్తాణ్డం ప్రతాపాక్రాంత నవఖణ్డ భూమణ్డళ రాజలీలా చమత్కృతాఖణ్డళం కోదణ్డ చతుర్భుజం శృంగార మకరధ్వజం త్రిభువనరంగ ప్రవర్తిత కీర్తి నర్తకీ నర్తన సూత్రధారం శరణాగత వజ్రప్రాకారం మూరురాయకలికువర బిరుద హృదయాకంపం త్యాగజగఝంప నర్థిజన చింతితార్థ చింతామణి సుభట మండళిక మకుట చూడామణి కుంతళరాజ్యాభ్యుదయ కారణం బప్పన గన్ధవారణం శ్రీమన్మహామండలేశ్వరం చాళుక్య గంగ పెర్మాడి కుమారం సోమేశ్వర దేవం॥

ఆ పూర్వాద్రి శిలాశిఖండకటకాదాసేతు సీమావనే
రాపాశ్చాత్యపయోనిధే రుపవనాదారమ్య హేమాచలా
దాకల్పం వసుధాధిపత్య పదవీమారుహ్య మాణశ్చిరం
జీయాదప్రతిమ ప్రతాప విభవ స్సోమేశ్వరోర్వీశ్వరః.
విశ్వధరాధురన్ధర భుజాపరిఘం ద్రవిళాధినాథహ
స్త్యశ్వ పదాతి సాధనవనక్షయ కారణ కోపపావకం
శాశ్వత కీర్తి యిందెధరె బణ్ణిసె బాప్పు చళుక్యగంగ సో
మేశ్వరదేవ నొప్పిద నిళావళి యాధిపరాజపుత్రిరోళ్.

తత్పాద పద్మోపజీవి సమధిగత పంచమహాశబ్ద మహాసామంతాధిపతి మహాప్రచణ్డ దణ్డనాయకం.

జయతి భువన భూషా భూత విఖ్యాత మూర్తిః
దిగిభ దశన లీలాశ్లిష్ట విస్పష్ట కీర్తిః
వివిధ నృపమదేభ వ్రాత యూథాధి నాథః
ప్రథిత వితరణ శ్రీ స్వామిదండాధినాథః
నాల్గవ వైపు భద్రమస్తు జిన శాసనాయ అని ప్రారంభిపః

బడి కన్నడపద్యములు సంస్కృత శ్లోకములలో కాణూరగణము, మేష పాషాణ గచ్ఛమునకుఁ జెందిన జైనాచార్యులు శ్రీమేఘచంద్ర మళధారి వ్రతీంద్రోత్తముఁడు, మళనందిసూరి, పద్మప్రభ శ్రీ మేఘ చంద్రుఁడు మాధవేందువు మున్నగు వారు పేర్కొనఁబడి బహుశః వారి సంతతిలోనివాఁడుగ ఈ శాసనము మొదటివైపున పేర్కొనఁ బడిన దేవి పెర్గడయగు కేశిరాజు వర్ణింపఁబడెను. తదుపరి కేశిరాజుచే ఆయంబర తిలకస్థ అంబికాదేవికి నిర్మింపఁబడిన మాన స్తంభ మకర తోరణములు దెలుపఁబడినవి. పిదప కన్నడములో శ్రీమతు కాణూర్గ ణపు మేషపాషాణ గచ్ఛపు అంబరతిలకము మంగళ మహాశ్రీశ్రీ యని శాసనమంతమైనది. శాసనపాఠము ప్రతిబింబములు చూడనిదే సరి యైన మూలమును బ్రకటించుటకు సాధ్యపడలేదు.

ఇట్టి కొలనుపాక శాసనమును పరికించినచో నొక్కొక్కవైపు నున్నది యొక్కొక్క స్వతంత్ర శాసనముగఁ గాన్పించును. కాని కొంచెము నిదానముగఁ జూచిన శాసన లేఖకుఁడు చక్కగ విషయ విభాగముఁ జేసి దేని నావైపుననే పూర్తి చేసినట్లు తెలియును. ఈ శాసనమున కాంగ్లములో పీఠిక రచియించిన (శ్రీ). పి. బి. దేశాయి గారిట్లు వచించిరి. "*This is a unique record. It is engraved on the four faces of a pillar which is described in one place as Manastambha (pillar of eminence) according to Jaina terminology, Kirtistambha (pillar of fame) of the general Svamideva in another and Jayastambha (pillar of Victory) of prince Somesvara elsewhere. It is not likely that originally it was set up as a Jaina monument and subsequently, thoagh not much removed from point of time it was utilised for commemorating out standing achievements of the two renouned. dignitaries The entire record appears to belong to the reign of the western*

chalukya King Tribhuvanamalla Vikramaditya VI. It extols prince Somesvara who shortly after became the Chalukya Sovereign known as Bhulokamalla Somesvara III. A mighty general of Somesvara was Svamideva or Sayimayya Dandanayaka."

శ్రీ దేశాయిగారు తలంచినట్లు తొలుత నిది జైన స్మారక చిహ్నముగ నిలబెట్టఁబడి తర్వాత కొద్దికాలముననే రాజకుమార, దండనాయకుల అసాధారణ పరాక్రమ దిగ్విజయముల నుల్లేఖించుట కుపయోగింపఁబడిన విజయ స్తంభముగాదని నామనవి. ఈ శాసనోద్దేశ్యము, కాలముగూడ మొదటి ప్రక్కనె స్పష్టముగ నున్నవి. చాళుక్య విక్రమ వర్షములు ५० విశ్వావసు సంవత్సర చైత్ర బహుళ తదియ సోమవారము, అనఁగా క్రీ। శ. 1125 మార్చి 24వ తేది (మంగళవారము) నాడు పశ్చిమ చాళుక్య ప్రభువగు త్రిభువనమల్ల విక్రమాదిత్యుని కాలమున, నాతని పుత్రుఁడగు కుమారసోమేశ్వరుఁడు తన సామంతుఁడు కొలనుపాక పురపాలకుఁడగు స్వామిదండనాయకుని విజ్ఞాపనమున పానుపురగ్రామమును జైన దేవతయగు అంబర తిలకస్థ అంబికాదేవి యంగరంగ భోగార్థము సమర్పించెను. తదుపరి రెండు మూఁడు వైపుల ఆ దండనాయక, రాజకుమారుల ప్రతాప పరాక్రమము లుగ్గడింపఁబడినవి. మరల నాలుగవ వైపు ఈ దానమును బడసినట్టి ఆయంబికాలయ స్థానాపతి, జైనమత పవిత్రకుఁడగు కేశిరాజు, ఆతని గురుపరంపర వర్ణింపఁబడినది. ఇట్టులీ నాలుగు వైపులఁ గల శాసనమంతయు నొక్కటిగనే పరిగణింపవలెను.

ప్రస్తుతమైన గూడూరు శాసనము గూడ నిదేపద్ధతిలో చెక్కఁబడినదని నాయభిప్రాయము. ఇవి రెండును స్వామిదేవదండనాయకునిచే గూడూరులోని మల్లేశ్వరునకు బమ్మెరను, అట్లే కొలనుపాకలోని జైనదేవతయగు అంబికకు పానుపుర గ్రామమును దానమిచ్చు

టకుద్దేశింపఁబడినవి. రెండిటి కాలవ్యవధి కూడ నొక్క సంవత్సరము మాత్రమే. కొలనుపాక శాసనమున మొదటివైపు శాసనోద్దేశ్యము, కాలము పేర్కొనఁబడి, పిదప రెండు మూఁడు వైపుల కుమారసోమేశ్వర, స్వామిదండనాయకుల ప్రశస్తి యెట్లున్నదో, అట్లే గూడూరు శాసనమునఁ గూడ మొదటి రెండువైపుల శాసనోద్దేశ్యము కాలము వివరింపఁబడి, తమపరి మూఁడు, నాలుగు వైపుల ఆస్వామి దండనాథుని వంశవర్ణన మని తలంచుట కవకాశమున్నది.

విరియాలవంశజుల చరిత్రమునకే గూడూరు శాసనము కడు ముఖ్యమైనది. వీరి పూర్వుల పుట్టుపూర్వోత్తరము లిందుమూలమున మొట్టమొదటి సారిగ తెలియవచ్చినవి. ప్రస్తుతము కరీంనగరము జిల్లా హుజూరాబాదు తాలుకా కటుకూరులోని శాసనమొకదానిలో వీరి ప్రశస్తిగలదు.

కటుకూరు శాసనము

భూమిలో శ్రేష్ఠము, ప్రశస్తము, స్వచ్ఛమైన విరియాల రాజుల వంశమొకటి గలదు. అందు సూర్యునివంటి ప్రభావముగల వారు. శరత్కాల చంద్రునివంటి వారి యశస్సులతో దిక్కులను బూరించి నట్టియు గొప్ప శివభక్తులు, గర్వము లేనట్టివారు, వితరణ జిత కర్ణులు, విశ్వకల్యాణ పూర్ణులు, సమరజిత సపత్నులు, సాధుసిద్ధి ప్రియత్నులైన మహారాజులు గల్గిరి. అట్టి వారివంశమందు భూరజను లకు సీమయనఁబడు సూరఁడను వాఁడు జన్మించెను. వాని ప్రతా పముచే తపింపఁబడిన గాత్రములు గల శత్రురాజులు, గుహా వారి, వనముల నాశ్రయించిరి. వీరన రేంద్రులను దహించెడి, శరములచే త్రుంపఁబడిన శిరస్సులతో వ్యాప్తమైన యెవ్వని యుద్ధమందు పలా యనమున భీమరాజు క్షణకాలము మాత్రము ఆత్మను రక్షించుకొనఁ గల్గెను. ఆతనికి ముల్లోకములకు తిలకాయమానులు, త్రివర్గపు అవ

తారములవలె ప్రోలి, మల్ల, బేత యను మువ్వురు పుత్రులు జన్మించిరి. అందు బేతభూపతికి సూర, మల్ల, ప్రోలి, కొమ్మ నృపాలురను నల్వురు సుతులు గల్గిరి. వారిలో మహాబలుఁడగు సూరమహీపతి అయ్యన పురమందు సహరి భాస్కరయుతమైన శివాలయమును నీటితో నిండిన పెద్ద తటాకమును నిర్మించెను. వారిలో ద్వితీయుఁడు గాని గుణములచే నద్వితీయుఁడు, రూపలావణ్య సంపదననంగుని జయించిన మల్లభూపతికి ఆచారవంతుఁడు, చారు గుణాకరుఁడు, శూరుఁడు మహాబాహుఁడుఅగు అన్నమహీపతి గల్గెను. మనోభవునకు రతీదేవి, సాగరునకు జాహ్నవివలె నాతనికి ఐతమాంబ భార్యయయ్యెను. వారిరువురకు కులభూషణురాలగు మైలమాంబ జన్మించెను.

వరగుణ విరియాలత్మభుజా మస్తి శస్తం
కుల మమల మిలాయాం యత్ర మిత్ర ప్రభావాః
అజనిషత మహీశాః శారదేందు ప్రకాశైః
ప్రచురతర యశోభిః పూరితాశాంతరాళాః
ప్రణతి ముదిత శర్వాః ప్రశ్రియత్కుణ్ణ గర్వాః
పరహితకృత దీక్షాః ప్రాజ్ఞలోకాత్తశిక్షాః
వితరణ జితకర్ణా విశ్వకల్యాణపూర్ణాః
సమరజిత సపత్నా స్సాధు సిద్ధి ప్రయత్నాః.
తదన్వయే జాయత సూరనామా
మహీపతిః శూరజనస్య సీమా
యస్యప్రతాపాతప తప్త గాత్రా
భేజు ర్గుహా వారి వనా న్యమిత్రాః
యదాహవే వీరనరేంద్ర ఘస్మరే
శరప్రలూనారిశిరస్సమావృతే
పలాయనాద్భీమనృపేణ రక్షితః
కథంచిదాత్మా క్షణజీవితాశయా.

తత్ర స్త్రీలోకే తిలకాస్తనూజా
స్త్రయ స్త్రివర్గ ప్రతిమావతారాః
ప్రజజ్ఞిరే పోలినృపాల మల్ల
భూవల్లభా బేతమహీపతిశ్చ.
తత్ర బేతావనీ శస్య సూరమల్ల క్షమాపతీ
పోలికొమ్మ మహీనాథా చత్వారః సూనవోఽభవన్.

తత్ర సూర నృపతి ర్మహాబల
స్పష్టమయ్యన పురేమృడాలయం
నిర్మమే సహరి భాస్కరాలయం
భూరివారి చ తడాగ ముత్తమమ్
తేషుద్వితీయోపి గుణై ర్నృపాలః
సమల్ల నామా భవ దద్వితీయః
యస్యాంగ లావణ్యబలా దనంగః
కృత్యం జహౌ పంచశర ప్రపంచం

◆ ◆ ◆ ◆

తస్యాభవనన్మహా బాహు రన్నయ క్ష్మాభృతాంవరః
తనయస్సనయాచారః శూర శ్చారుగుణాకరః
తస్యాపి దైతమానామ మానినీ నిజగేహినీ
రతిర్మనోభవస్యేవ సాగరస్యేవ జాహ్నవీ.
విద్యేవ కీర్తిం గురు సంప్రదాయా
దుద్యోగతో నీతి రివార్థ సిద్ధిమ్
సాలబ్ధ పత్యు స్తనయాం కులస్య
భూషాయమాణా మథమైలమాఖ్యామ్. ६

ఈ కటుకూరు శాసనమున వర్ణింపఁబడిన విరియాల వంశములోని వారే మన గూడూరు శాసనమున మూఁడవవైపున పేర్కొనఁబడిన సూర, బేత, మల్లనృపతులు. సూరనియొద్ద నుండి వారి వంశము

మరింత విపులముగ నీకటుకూరు శాసనమున వర్ణింపఁబడినది. ఈ రెండు శాసనములను సమన్వయించి మొత్తము విరియాల వంశము నీ క్రింది విధముగ జూపవచ్చును.

దుర్జయ కులము
|
పోరంటి వెన్నడు
|
ఎఱ్ఱడు
|
విరియాల భీముడు
|
ఎఱ్ఱడు=కామసాని
|
సూరడు (భాస్కరవిభుడు)
|
పోలి | మల్ల | బేత=బెజ్జమాంబ

బేత=బెజ్జమాంబ
|
సూర | మల్ల | పోలి | కొమ్మ

మల్ల
|
అన్నయ=ఐతమాంబ
|
మైలమాంబ=(మల్యాలవంశజుఁడగు చౌండచమూపతిని వివాహమాడెను.)

కాకతి రుద్రాంబ కోటగిరి తామ్రశాసనములో మరల నీవిరియాల వంశజుల ప్రశంస గలదు. కాకతి రుద్రాంబకాలమున శాలి

వాహన శకవర్షములు ౧౧౭౫గు శ్రీముఖ సంవత్సర పుష్యమాస కృష్ణపక్ష షష్ఠీ భానువారమున నామె సామంతుఁడు సుప్రసిద్ధ విరియాల వంశమున జన్మించిన రుద్రదేవుని పౌత్రుఁడు, గణపతి బెజ్జమాంబల పుత్రుఁడగు సూరఁడు, బెజ్జలపురమును వైనాయకపురమను పేరుతో వింశతి బ్రాహ్మణులకు దానమిచ్చెను. అందు వారి వంశవర్ణన మిట్లున్నది.

శ్రీమాన్విర్యాల వంశోస్తి లక్ష్మీర్యత్ర కుమారకాన్
సంశిక్ష యతి మాతేవ విద్యా వినయ భూతిభిః

♦ ♦ ♦

తత్రాభూద్రుద్ర భూపః ప్రథిత పృథుతర క్ష్మాభృదుత్తుంగరంగ
చ్ఛృంగాగ్రోద్గార రింఖన్మణికిరణ సటా పాటలోపాంతభూమిః
ప్రోత్సద్యద్దంత దంతావల కరటతటీ విక్షరద్దానధారా
పూరాపాతక్రమా పంకిల గలిత రజోబీజ రాష్ట్రాంత భూమిః

♦ ♦ ♦

తస్మాద్రుద్ర మహీపతే రుదభవ చ్చంద్రః సుధాబ్ధేరివ
శ్రీమానామ గుణవ్రజ స్సగణప త్యుర్వీశచూడామణిః
గాఢాధర్మిత మోనభోమణిరపి ప్రాప్తార్థిచింతామణిః
స్వామి శ్రీపదరేణు శేఖరమణి ర్గాంభీర్య పాథోనిధిః.

♦ ♦ ♦

ధీరోదాత్త తరస్య తస్యమహిషీ ప్రాణాధిక ప్రేయసీ
బెజ్జాంబేతి సతీ సు తేవ జలధేర్నారాయణస్య స్వయం
తస్యాం తేన శమే నిశాపతిరివ ప్రోథ ప్రతాపే స్వయం
సూర్యః సూరకుమారవీరతిలకో లోకైకవీరోఽజని

ఇందు పేర్కొనఁబడిన విరియాల వంశజరుద్ర గణపతి, సూరలకు పై వంశవృక్షము వారితో నేమి సంబంధమో ప్రస్తుతము స్పష్టముగ తెలియరాదు.

ప్రస్తుతము ఖమ్మము జిల్లా పమ్మిగ్రామమునఁగల కాకతి గణపతి దేవుని శాసనమొకటి దానిలో శ్రీమన్ మహాసామంత విర్యాల నాగాసానమ్మంగారు, మలాన్రిజు, ముమ్మడి రాజులు పేర్కొనఁబడిరి. వీరికిని పై వంశ వృక్షములోని వారికిని గల బంధుత్వము గూడ స్పష్టముగాదు.

త్యాగి, మల్యాల, కాకతీయ, నతవాటి, వెలనాటి మున్నగు ననేక రాజవంశీయులవలె నీ విరియాల వంశజులు గూడ తమ శాసనములయందు దుర్జయుని సంతతివార మని తెల్పుకొనిరి. విశేషమేమన ఈవిరియాల వంశజులు కాకతీయు లిరువురును గూడ దుర్జయవంశజుఁడైన పోరంటి వెన్నమరాజును తమమూలపురుషునిగఁ జేర్కొనుటచేఁ గాకతీయ, విరియాలుర నికటబంధుత్వము స్పష్టపడుచున్నది. కాకతి గణపతిదేవుని కోలవెన్ను తామ్రశాసనమున ఈ పోరంటి వెన్న భూపాలుఁడు వారి మూలపురుషుఁడుగఁ జెప్పఁబడినాఁడు.

గణపక్ష్మాపతి జనకో భువి
విలసతి పోరంటి వెన్న భూపాలః
అవతంసయన్తి కీర్తి ప్రవిమల
కుసుమాని యస్య దిక్కాన్తాః

మన గూడూరు శాసనములోని పోరంటి వెన్నఁడు ఈతఁడు నొక్కరే. ఈ పోరంటి వెన్నుని పేరనే గణపతి దేవుఁడు కృష్ణాజిల్లాలోని కోలవెన్నును దానమిచ్చినది. కోలవెన్నులోని శిలాశాసనము గూడ ఈ విషయమునే దెల్పుచున్నది. సిద్ధేశ్వర చరిత్ర, ప్రతాప చరిత్ర, సోమదేవ రాజీయములం దీతఁడే పొరికి వెన్నమ రాజని పేర్కొనఁబడినవాఁడు.

గూడూరు శాసనమునందలి చరిత్రాంశములను దెలిసికొనుటకిటీవలఁ బ్రకటించఁబడిన సిద్ధేశ్వర చరిత్ర కొంతయుపకరించును. ముఖ్య

ముగ నిందు కాకతి మహారాజుల చరిత్ర వర్ణింపఁబడిన దని యున్నది. కాని ఈ గ్రంథము కాకతీయ సామ్రాజ్యమంత మొందిన మఱిమూఁడు శతాబ్దములనాఁడు కాసెసర్వప్పయను వానిచే రచియింపఁబడినది. అతఁడు తనకాలమున వాడుకలోనుండిన కాకతీయులను గూర్చిన కట్టు కథలు, పుక్కిటి పురాణముల నన్నింటిని చరిత్ర పౌర్వాపర్యము గూడ లేక కూర్చి పెట్టినాఁడు. వానినుండి యథార్థ చరిత్రాంశములను దెలిసికొనుటయే చాలకష్టము.

కాకతి సామ్రాజ్య స్థాపకుఁడుగ వర్ణింపఁబడిన మాధవవర్మ ప్రపౌత్రుఁడుగ నిందొక పోరికి వెన్నమరాజు గలఁడు. అతని తండ్రి తాతలు వెన్నమరాజు, పద్మసేనులట. ఈ పోరంకి వెన్నమరాజుని గూర్చి సిద్ధేశ్వర చరిత్రమున నిట్లున్నవి.

వెనుకొనిపోరంకి వెన్నమరాజు
పట్టాభిషిక్తుఁడై పరఁగ రాజ్యంబు
మట్టుగాఁ జేయుచు మరలఁ బడ్డట్టి
కటక బల్లహుఁ దుర్మించి గాడిలి వాని
కటకంబునకు రాజుఁగాఁ జేసి సుతుని
చేత సువర్ణంబు చేకొని కోట
లాతత బహుకీర్తు లంది దిగ్విజయ
మానలి రాజుల నందఱ గెలిచి
మతిమీఱఁ బురమునకు మగిడి తావచ్చి

గూడూరు శాసనమున దుర్జయాన్వయమున ననేక రాజకుమారుల పిదప జన్మించి విరోధిమండలికి విష్ణువనఁబడు పోరంటి వెన్నఁడీతఁడే. కోలవెన్ను తామ్రశాసనమున నీతని ప్రశస్తి ఇట్లున్నది.

దానే సూర్యసుతం ప్రతాపవిభవే శ్రీరామచంద్రం నృపం
ధైర్యే మేరుమహీధరం హిమకరం కాన్త్యాం రవిం తేజసి

ఐశ్వర్యే ప్రమథాధిపం యమసుతం ధర్మే బలే వాయుజం
రూపే పంచశరం విదుః పోరంటి వెన్నక్ష్మాపతిం పండితాః

ఈ పోరంటి వెన్నమరాజు పుత్రుఁడుగ పెండ్లి గుండమరాజు, అతని పుత్రుఁడుగ యెఱుక దేవరాజును బేర్కొనఁబడిరి. ఎఱుక దేవరాజు మిక్కిలి చిన్నవాఁడగుటచే కడుసమర్థురాలును, వాని మేనత్త యగు కుంతలదేవి తాను సామ్రాజ్యము నేలుచుండి గుజరాష్ట్ర, మహారాష్ట్ర, ఘూర్జర, యవనరాజులపై దండెత్తి వారి నందఱిని యోడించి, జయస్తంభములెత్తించి యపారమైన ధనములను గైకొని అనుమకొండకు మరలి వచ్చునంతలో కటకబల్లహుఁడు పైఁబడుట కరిహయభటులతో గంగిదేవుని నాయకత్వమున వానిని ద్రుంచి, వాని పుత్రునట నిల్పి యెప్పటివలె కానుకలుపొంది ఆమె ౧౫ ఏండ్లు రాజ్యభారము వహించి పిదప యెఱుక దేవరాజునకు పట్టముగట్టి తాను శివలోకమున కేఁగినట్లు వర్ణింపఁబడినది.

ఎరుక దేవరాజు డెంతయుఁ జిన్న
వర బాలకుఁడు గాఁగ వానిమేనత్త
కుంతలాదేవి సంతత ధర్మ
వంతన చతురంత వారయానాది
కాంత దిగంత విశ్రాంత యొంతయును
నంత సామ్రాజ్యంబు దానేలుచుండి
గుజరాష్ట్ర మహారాష్ట్ర ఘూర్జర యవన
రాజులపై దోర్దరయమున వెడలి
వారినోడించి యవారిత ధనము
లప్పనంబులు గొని యా జయస్తంభ
మొప్పఁగ వేయించి యొగి నన్మకొండ
విప్పగు వీథుల వేంచేసి మగిడి

చను దెంచునంతలో సరసత నపుడు
ఘన బలాధికుఁడైన కటకబల్లహుఁడు
మరలంగఁ బడ్డ నామను జేసినపుడు
కరిహయ భటులతో ఘనబలముఁ గూర్చి
రాణి గంగిదేవు రాఁబువునకును
నాణెంబుగా దళనాయకుఁ జేసి
పంపుటయును వాఁడు బల్లహుతోడ
చంపి దావుదు చేసి ? జగడంబులపుడు
ఆరు నెలలు చేసి యాతని ద్రుంచి
పోరున నటవాని పుత్త్రుని నిలిపి
యెప్పటివలెఁ దమయప్పనంబులును
కుప్పలుగాఁ దెచ్చి కుంతలదేవి
కిచ్చినంతట మెచ్చి హెచ్చెంబు లేక
పందొమ్మి దేండ్లు దాభరమూని రాజ్య
మందు నెఱుకు దేవుకపుడు పట్టంబు
గట్టి తానును శివుఁ గల యంగఁజనియె

గూడూరు శాసనములోని కామసానికి నిందలి కుంతల దేవికిని కొన్ని పోలికలు గలవు. సూక్ష్మముగ నాలోచించిన వారిరువు రొక్కరే యని తోఁపకమానదు. గూడూరు శాసనమున కాకతి బేతరాజు చాల చిన్నవాఁడగుటచే విరియాల యెఱ్ఱ నృపుని భార్య కామసాని వాని పక్షమున దనపుత్త్రుఁడగు సూరుని సహాయమున ఘను బల్లవరాయని జంపి వానిని గాకతి సింహాసనమున బ్రతిష్ఠించిన దని యున్నది. సిద్ధేశ్వర చరిత్రమున ముఖ్య విషయమిదియే గాని వారి పేర్లు మాత్రము పూర్తిగ మాఱియున్నవి. ఎఱుక దేవరాజు చాల చిన్నవాఁడగుటచే వాని మేనత్త కుంతలదేవి గంగి దేవుని నాయ

కళ్యాణమున బలాధికుఁడైన కటకబల్లహుని జంపి మెఱుక దేవుని రాజ్యమునందు నిల్పెనదట. సిద్ధేశ్వర చరిత్రకారుఁడు చారిత్రక విషయమున శ్రద్ధవహింపనట్లే వారి పేరులలో గూడ నేమైన మార్పులు చేసియుండును. కాకతీయుల శాసనముల నుండి మనకుఁ బ్రస్తుతము దెలియవచ్చు కాకతి మొదటి బేతరాజు, మొదటి ప్రోలరాజు, రెండవ బేతరాజు, త్రిభువన మల్ల దుర్గరాజులకు బదులు మెఱుక దేవరాజు, భువనైక మల్లుఁడు, త్రిభువన మల్లుఁడని పేర్కొనఁబడియున్నవి. మఱియు వారి వంశక్రమము గూడ సరిగాఁ దెల్పలేదు. కావున సిద్ధేశ్వర చరిత్రమునందు వర్ణింపఁబడిన పై విషయమును బట్టి గూడూరు శాసనమునందలి విరియాల కామసానియే అందలి కుంతలదేవియని, మెఱుక దేవరాజు కాకతి మొదటి బేతరాజుగను భావింపవలసియున్నది. గంగి దేవుఁడు ఆమె పుత్త్రుఁడగు విరియాల సూరఁడగునేమో తెలియదు. కుంతలదేవియే కామసానియైన ఆమె కాకతి బేతరాజు మేనత్తయగుట, ఆమె పుత్రుఁడగు విరియాల సూరఁడు దనమేన మఱఁది పక్షమున శత్రువులను వినిర్జించి వానిని సింహాసనమునందుఁ బ్రతిష్ఠింపఁ జేయుటయు మిక్కిలి సమంజసము. ఈ సన్నివేశమే గూడూరు శాసనమున, సిద్ధేశ్వర చరిత్రములయందట్లు వర్ణింపఁబడియుండును. కనుకనే విరియాల, కాకతీయులిరువురును బోరంటి వెన్నని దమతమ మూలపురుషునిగ గణించుట కవకాశము గల్గినది. కొండపీటి రెడ్డి రాజ్యమును శత్రువుల బారినుండి కాపాడి కుమారగిరి రెడ్డిని సింహాసనము నందుంచి ఆతని మేనబావయగు కాటయవేముఁడెట్లు పరిపాలించెనో అట్లే కాకతి సామ్రాజ్యము నాపదనుండి గాపాడి మొదటి బేతరాజును సింహాసనమున బ్రతిష్ఠించి విరియాల సూరఁడాతని క్రింద మంత్రిత్వమును నెఱపియుండును. కాటయవేముఁడు తన సుతునకు కుమారగిరి పేరిడినట్లే సూరఁడును దన పుత్త్రునకు బేతయను నామ

ముంచెను. తదుపరి కాకతి వంశజులవలె విరియాలురు గూడ పశ్చిమ చాళుక్య చక్రవర్తుల సామంతులై వారి ప్రాముఖ్యమును తాత్కాలికముగఁ గోల్పోయిరి. మరల కాకతి రెండవ ప్రోలరాజు తైలపును త్రోసిపుచ్చి స్వతంత్ర ఆంధ్రసామ్రాజ్యమును స్థాపించువఱకు వీరందఱు కేవలము మాండలికులుగనే కాలము గడపవలసి వచ్చినది.

ఈశాసనమునందు పేర్కొనఁబడిన పశ్చిమ చాళుక్య రాజ పుత్రుఁడగు కుమార సోమేశ్వర దేవుఁడు తన తండ్రి త్రిభువనమల్ల విక్రమాదిత్యుని యనంతరము భూలోకమల్ల బిరుదాంచితుఁడై క్రీ. శ. 1126 నుండి 1139 వఱకును పాలించెను. గూడూరు, కొలనుపాక శాసనముల రెండింటను నీతఁడు యువరాజుగ నుండినపుడు త్రికళింగా వన్య భీకుఁడగు చోడగంగ భూపాలుని యుద్ధమునుండి పలాయితునిగా జేసి వాని దేశమును దహించివేసినట్లు వర్ణింపఁబడెను. ఈ చోడగంగ దేవుఁడు క్రీ. శ. 1078 నుండి 1152 వఱకును కళింగదేశమును పాలించిన తూర్పు గాంగవంశజుఁడగుఅనంతవర్మ చోడగంగ దేవుఁడు. కావలెను. కుమారసోమేశ్వరుఁడు తాను యువరాజుగ నుండియే చోళులను, తూర్పు గాంగులను జయించి వేంగి, కళింగ రాజ్యములను రెంటిని పశ్చిమచాళుక్యుల యధికారము క్రిందకుఁ దెచ్చెను. కాని మరల నీతని రాజ్యకాలముననే కళింగమేగాక వేంగిరాజ్యము గూడ వీరి చేతినుండి జారిపోయినది. ఈతఁడు మంచిపండితుఁడు కవియు నయి సర్వజ్ఞచక్రవర్తి బిరుదమువహించి 'మానసోల్లాస' మను నామాంతరము గల 'అభిలషితార్థ చింతామణి' యను సకల భారత విజ్ఞాన పేటిక యగు చక్కని గ్రంథమును రచియించెను.

గూడూరు శాసనమున తెలుగు పద్యములలోఁ బేర్కొనఁబడిన ఘనుఁడగు బల్లవరాయుఁడు, కాటయనాయకుఁడు నొక్కరే యని నా తలంపు. ఈతఁడేబలాధికుఁడగు కటకబల్లహుఁడని సిద్ధేశ్వర చరిత్రమున

వర్ణింపఁబడెను. ఏఁడెవ్వఁడు? యెచ్చటివాఁడను విషయము స్పష్టముగఁ దెలియదు.

ఇందు జయన్తీపురము, త్రికళింగము, కొల్లిపాక ఏడువేలు, బమ్మెరిగ, వేల్పుగొండ, గుమ్మడూరు, కొఱవి దేశము, మొగుడుపల్లి బోదిపాడు, ఒకుమామిడి, రెండయరాజుసంగడి మున్నగునవి ముఖ్యముగఁ బేర్కొనఁబడినవి. జయన్తీపుర మానాటి పశ్చిమ చాళుక్యుల రాజధాని నగరమగుకల్యాణీపురము. త్రికళింగము తూర్పు గాంగవంశజులు పాలించిన కళింగదేశము. కొల్లిపాక నేటి నల్గొండ జిల్లా భువనగిరి తాలూకాలోని కొలనుపాక. అనాఁడది యువరాజగు కుమార సోమేశ్వరుని రాజధాని పట్టణము. వేంగి చాళుక్య సింహాసనమునకై జరిగిన పోరాటములలో చోళులీపట్టణము నొకసారి కాల్చివేసిరఁట. మల్లేశ్వరునకు దానమిచ్చిన బమ్మెరిగ గ్రామము గూడూరునకు మూఁడు మైళ్ళ దూరమునఁ గల బమ్మెరయే. ఇదియే సుప్రసిద్ధాంధ్ర భాగవత కర్తయగు పోతనామాత్యుని నివాసస్థలము. వేలుపుగొండ వరంగల్లు తాలూకాలోనిది. గూడూరునకు సుమారు పదిమైళ్ళ దూరమునఁ గల నేటి జఫర్ ఘడ్. దీనినే సార్ గుట్టయనియు వ్యవహరించెదరు. సహజమైన యెత్తైన కొండలచే చుట్టును ఆవరింపఁబడి శత్రువులు తేలికగ ఛేదించుట కలవిగాని చక్కని బలిష్ఠమగు గిరి దుర్గమిది. కొండపై శ్రీలక్ష్మీ నృసింహస్వామి గుహాలయమున్నది. అచ్చటి గల రాష్ట్రకూటులనాటి బ్రహ్మాండమైన శాసనమును బట్టి ఆ యాలయము క్రీస్తు శకము యెనిమిదవ శతాబ్దమునకు పూర్వమే మిక్కిలి ప్రసిద్ధమైనట్లు తెలియుచున్నది. గూడూరు శాసనములోని "వేలుపుగొండ రవ్వన్నృపు వేలుపు గొండన నిల్పి" యను దానిని బట్టి కాకతి బేత రాజు కాలమున కది రాజధాని నగరమని సుస్పష్టము. మొదటి బేత రాజే యిఁదలి రవ్వన్నృపుఁడ యున కొఱవి దేశములోనిదే యగు ఈ

వేలుపుగొండ కాకతి మహారాజుల మొట్టమొదటి రాజధాని కావచ్చును. తదుపరి యనుమకొండకు, ఓరుగల్లునకు వరుసగా వారి రాజధాని మార్పఁబడియుండును. నవీన చరిత్రమున గూడ జఫరుద్దౌలా యను మాండలిక డొంకఁడు ఈ గిరిదుర్గము నాధారముగఁ జేసికొని నిజాము ప్రభుత్వము నెదిరించెనఁట. వాని ఫిరంగు లిప్పటికిని ఆగిరి దుర్గము చుట్టును గలవు. వాని పేరనే నేఁడవి జిఫర్ ఘడని పిలువఁబడుచున్నది. గుముడూరు ఈ శాసనమున గల నేటి గూడూరు ఆ ప్రాచీన శివాలయపు శిథిలము లిప్పటికి నచ్చట గాంచఁగలము కొంఅవి దేశము నేటి వరంగలు జిల్లాలోని కొంఅవి ప్రాంతమైయుండును. మొగడు పల్లి, బోదిపాడు, ఏకమావిడి, రెండయరాజు నంగడి మున్నగున వేమియు తెలియరావు.

ఈ శాసనమును ప్రతిబింబములతో బ్రకటించుటకు దయతో నంగీకరించిన శ్రీ భారత ప్రభుత్వశాసన శాఖాధికారులకు నాకృతజ్ఞతా పూర్వక వందనములు కన్నడ భాషాభాగముల ననువదించుటలో తోడ్పడిన మా మిత్రులు శ్రీ శ్రీ నివాసరిత్తిగారికి నేనెంతయు కృతజ్ఞుఁడను.

శాసన మూలము

మొదటి వైపు

1. @ స్వస్తి సమస్త భువనాశ్రయ
2. శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరా
3. జపరమేశ్వరం పరమభట్టారకం
4. సత్యాశ్రయ కుళతిళకం చాళుక్యా
5. భరణం శ్రీమత్త్రిభువన మల్ల దేవర
6. విజయరాజ్య ము త్తరోత్తరాభి వృద్ధి ప్రవర్ధమానా
7. నమాచంద్రార్కతా తారంబరం సలుత్తం జయ స్తి

8. పురద నెలెవీడి నోళు సుఖ సంకథావి
9. నోదదిం రాజ్యంగెయ్యుత్తమిరె॥ తదాత్మజం
10. ॥ స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహా
11. మణ్డళేస్వరం వీరమహేశ్వరం విజయలక్ష్మీ వినివా
12. సం రక్షాదక్ష దక్షిణ దోర్ద్దణ్డాం ద్వాదశమణ్డ
13. ళిక (మణ్డళి) మార్త్తణ్డాం ప్రతాపాక్రాన్త నవఖండ భూమణ్డళం
14. రాజలీలా చమత్కృతాఖండళం కోదణ్డ చతుర్భు
15. జం శృంగార మకరధ్వజం త్రిభువనరంగ ప్రవర్త్తిత
16. కీర్త్తి నర్త్తకీ నర్త్తన సూత్రధారం శరణాగత వజ్ర
17. ప్రాకారం మూఱురాయ కలికువర బిరుద వ్యా
18. దయాకంపం త్యాగ జగఝంప నర్త్థి జనచిన్తితార్త్థ చిం
19. తామణి సుభట మండళిక మకుట చూడా
20. మణి కున్తళ రాజ్యాభ్యుదయ మెక్క కారణం బప్ప
21. నగంధవారణం శ్రీమచ్చాళుక్య గంగ పెర్మ్మాడి
22. కుమారం సోమేశ్వరదేవ ॥వృత్తం॥ మొళెవెత్తెత్తి
23. దతోళబాళ జళధిం మెయ్గొండ మిత్రింగనా
24. కుళబాష్పద్రవదిం తళితృణ రిపుసేనా చక్ర
25. రక్తాంబుధిం బళద త్తీగళు పాహితాహితగళ
26. త్కాళింగ మాతంగ సంకుళదాన ప్లవదిం పరాక్రమవ
27. సం సోమేశ్వరోర్వ్వీశన[2] ప్రకటాటోపద చోళగంగ
28. దనుజాధీశం తెరల్దోడె సైనిక వీరామర కోటి
29. కోటివిధదిం కొండాడె కోపాగ్నియింద కళింగ త్రి
30. య[మం] పురత్ర్యతెయమం సుట్టంతె సుట్టిట్టుదం త్రి
31. కళింగ త్రిపురం త్ర్యణేత్ర నెనిపం సోమేశ్వరోర్వ్వీశ్వర॥

2. ఇదే పద్యము పై నుదాహరించిన పటంచేరు శాసనమున గూడగలదు.

రెండవ వైపు

32. [త] త్పాద పద్మోపజీవి సమధిగత
33. [పంచమహా] శబ్ద మహాసామన్తాధి
34. [ప] తిమహాప్రచండ దండనాయకం॥ వృ॥
35. మదవ (ద్వి) ద్విష్టసైన్య ప్రబల విపినదా
36. వానళం వారయోషిద్వద నాంభోజాతరాగో
37. దయదినకర నాత్మీయ దానాంబు ధారా
38. ముదితాశేషార్థి కేకి వ్రజనమళెయ
39. శ్రీ మార్తికాళంకృతా శారద సింద్రం శిష్టచిం
40. తామణి యెనెగళ్దం స్వామిదండాధినాథ॥
41. @అతుళ భుజాబళం రిపుభయంకర కార
42. ణావాత్మదాన మాశ్రిత జనతుష్టికా
43. రణమమేయ విశుద్ధ చరిత్ర సం
44. పదం క్షితినుత కారణం నిజమనోహ
45. ర మన్మథ మూర్తి కామినీ బ్రజతికార
46. ణం దలె నుతిప్పుర్ దు ధారిణి సావిదే
47. వన॥ కందం॥ భీరు మహీ భృత్ప్రకరాధా
48. రతె యిందుగ్ర సత్వదిం దను పమమి
49. తాకారదినెనిప్ర వారిధి వారియె
50. [త]ర వారి సావి దండాధిపన॥ స్వస్తి
51. శ్రీ మచ్చాళుక్య విక్రమ శకవర్ష ద ర్ న
52. యక్రోధి సంవత్సరద పుష్యబహు
53. ళ ౧ బుధవారదందు శ్రీమన్మహా
54. మండళేశ్వరం చాళుక్య గంగపె మ్మా డియ
55. మారం సోమేశ్వరదేవర॥ మహాప్ర

56. ధానం మనపెగ్గ౯డె కొళ్ళిపాకె యెచ్చాభ౯సి
57. రద దండనాయకం సావిపయ్యంగళ బిన్న
58. పది నుత్తరాయణ సంక్రాంతి నిమిత్తం
59. గుముడూర మల్లేశ్వర దేవరంగభో
60. గరంగభోగం గగ్గె సవ౯ బాధాపరిహారం
61. సవ౯ నమశ్యవాగి వేల్పు గొండె అర అ
62. ళియు బమ్మరిగెయు ధారాపూ
63. వ౯కం మాడిదరు॥ స్వదత్తం పరదత్తాం
64. వా రాజభి స్సగరాదిభిః యస్యయ
65. స్య యదా భూమి స్తస్య తస్యత
66. దాఫళం॥ శ్రీమత్త్రైలోక్యనాథం ది
67. విజదనుజ నాగేంద్ర భాస్వత్కిరీటస్తో
68. మవ్యాకీణ్ణ౯ నానామణికిరణ సమూ
69. పేష్ట్య పాదారవిందం కామప్రధ్వంసి గంగా
70. జళవిళసిత జూటస్థళం చంద్ర చూ
71. డారామం మల్లేశ్వరం నిమ్మభిమత ఫ
72. లసంసిధియుం మాళ్కె౯ నిచ్చ ॥వృత్త॥

మూఁడవ వైపు

73. విరియూలాన్వయ నీరజాకరదినేశం నిమ్మళ౯ క్షీర
74. సాగర సంకాశ విశుద్ధ కీతి౯ కనకా ద్రీంద్రోన్నతం
75. వంది పాఠకర సిష్టేష్ట కవీంద్ర కీర సహకా
76. రం వైరి గంధేభ కేసరి మిక్కుం విభుసూరనుంన్నతగు
77. ణోదారం ధరాచక్రదొళ్ఘు ॥కంద॥ ఆతన తనెయం
78. వినెయ వినూతం భువన ప్రసిద్ధ కీత్తి౯ లతా విఖ్యా

3. ఈవ్యాస గీతములలోని కొన్ని పాదములు విడిచిపెట్టఁబడినవి.

79. తం సజ్జన జనతా ప్రీతం బేతణ నుదారసురభూ
80. జాత అవన మనోనయనప్రియె భువనజన
81. స్తుత చరిత్రె సద్గుణ గణ సంభవజన్మ భూమి సజ్జ
82. న యువతీ రత్నమెనె బెజ్జమాంబికె నెగర్ద్దళు॥
83. ఆరమ [శ్రీ] నిధానగం వారవధూనిధిగ నుఖళ
84. సద్గుణ నిళయల వీరారి దర్ప్ప దళనం వీరాగ్రణి
85. యెనిసి మల్ల నుద్భవమాద ॥వృత్త॥ ఇదెపేనూ
86. ద్రీంద్ర మత్యున్నతియ మహిమె యుం దెంచినం
87. తొర్క్కె వెత్తిం తిదె కల్ప్వబ్బె రుహం వి సిలె విశరణాప
88. మర్త్యె దిందెంచిన [ం] తానిదె దుగ్ధాంబోధి గంభీర తె యతి
89. సయిదిం దెంచినం మిక్కు కణ్గొప్పిదపం భాన్వత్సు
90. ధాసుందర విశదయశం మల్లనిధాత్రిగల్ల॥ సాశ్వత
91. పుణ్య పుంజనఖిలార్థి సురావనిజాత నుంన్న తానశ్వరకీర్తి
92. సద్గుణ గణాభరణం ఘన బాహు విక్రమం విశ్వధ
93. రాతళం పొగళె నూడిసిదం గుముదూరొళ్దియ మ
94. ల్లేశ్వరమం తటాక ఘన వాపిగళం విభు మల్లనూర్జి
95. త॥ వసుధాతళ దొళుపసరిస జనవనదళమె
96 సెయె కటక ముంన్నిఅీవం నూడిసిద శివాల
97. యమనుపమ మెనెచు దు గుముదూరొ
98. ళధిక పుణ్య గణ్య॥ ధరెయుం సురాద్రి
99. యుం సాగరముం చంద్రార్క్కరుం మహేశ్వరరుం
100. దిక్కరి చయము ముల్లిగం సుఖమిరు మల్ల
101. కవీంద్ర బృందమం పొరయుత్త॥ శ్లోక॥
102. స్వదత్తం పరదత్తం వా యో హరేతి వసుంధరాం
103. షష్టి వర్ష సహస్రాణి విష్ఠాయాం జాయతే

104. క్ష్మమి॥ వనే వనతరో౯ వహ్నిదగ్ధ హాన్ మూలా
105. ని రక్షతి కులం సహామూలం దహతి దేవస్వం
106. ప్రహతి పాతక॥ దేవస్వం బ్రాహ్మణస్వం చ యోలో
107. భే నోపభుంజతి। స్వపాపాత్మా పరేలోకే గృధ్రోచ్ఛిష్టే
108. న జీవతి॥ దేవద్రవ్యం తిలార్ధార్ధం అర్ధార్ధం భక్షంతి యే
109. నరః సప్తగోత్రాణి నామాని పశ్చాత్ పతతి రౌరవం॥ దేవ
110. ద్రవ్యవినాశే చ బ్రహ్మస్వ హరణేన చ। కులాన్యకులతాం
111 యాంతి బ్రాహ్మణాతి క్రమేణ చ॥ నమఃశ్శివాయః॥

నాలుగవవైపు.


112. అనుపమ నుజ్జ్వ యాన్వయను
113. ధాబ్ధి న నేకులు రాజనందనలు నని
114. నఖోఅంటి వెన్నడనుసంభ (వు) డయ్యెనతి
115. ప్రసిద్ధుడై వినుత విరోధిమణ్డలిక
116. వెన్నడు వెన్నుడై వెలె వానికిని ఘను
117. డగు నెఱభూపతి జగద్వినుతుండు [ద]
118. యించెగీర్తి స్తోను॥ భావితకీర్తినాథ (త) ని (కి)
119. పాండవ మధ్యమ భీముడో యనంగా [వి]
120. రియాల భీమనిపు ఘస్మరుడై [యు]
121. ది యించె వానికిను భూవిను తుంణ్డు
122. మండలిక భూమను దెఱ నరేంద్రుడు [త్రి]
123. మ (శ్రీ)వినుతుండు బంధుజన సేవ్యుండు
124. డా నుదయించె నున్నతిని॥ ఆతణ్డని బో
125. ట్టుబేతె వసుధాధిపు జేకొని వానివై [రి]
126. నుద్ధ్రితమున జంపి (యా) కొరవిదేశ
127. మున (౦)దు ప్రతిష్ట జేసి తత్తనె యురు


128 పేరు పోతగల రాయుని బి
129. ట్టిఅ గద్యనంబు నప్రితిముకు వాని
130 (చే) మొగడు పల్లియు పండ్రిను నేలు
131. నప్పుడే॥ అరుదగుపట్టి ఎఱవిగ్రపు
132. [న]ంగన గామవసాని రయిక మే
133. [ల్ల] రుండని[4] జేత భూవిభుని గాక
134. తి వల్లభు బిన్న వాని దా బరగంగ జేత
135. బట్టె ఘను బల్లవ రాయని రో
136. గి జొచ్చి[5] భాస్కర విభు చక్రవర్తి
137. గని కాకతి నిల్పుట గోటి సేయదే॥
138. కారక కాలుడై పడసె గాడయ
139. నాయకు జంపి సూర దవ్వేలుపు
140. గొండ రవ్వ నిల్పు వేలుపు గొండ
141. న నిల్పి వానిచే మేలుగ మూడ
142. ముప్పయిని మేలుగ నేరెకు
143. బోటిపాడు నుం మేలుగ టె
144. కుమూవిడ్లు మేలుగ రెండెయు
145. రాజు సంగడ్లు॥ సూత్రధారి
146. శ్రీ బెమ్మోజన బరహా శ్రీ శ్రీ శ్రీ
147. అడపగట్టు దేవరకు జేను

4. మేల్లనుండని కావచ్చును.


5. ఎ.కి.గి జొచ్చి=పరిశీక్ష చేసి?. చూడుడు: దక్షిణ హిందూదేశ శాసన సంపుటము 4. నంబరు 1273. పుట 442.

By the curticy of the Epigrophical department, Ooty





దాక్షారం సోమేశ్వరుని గూడూరు శాసనము.



చాళుక్య సోమేశ్వరుని గూడూరు శాసనము.

శ్రీనాథుని అద్వైత బక్తి

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

శ్రీనాథుని హృదయము పరమశివునియం దద్వైత భక్తిభావము కలదని తెలిసికొనుట కాతని రచనలలో పెక్కు నిదర్శనములు గానవచ్చును. ఆతఁడు పరమేశ్వర మూర్తులను వేనిని చిత్రింపవలసి వచ్చినను సమాన ప్రతిపత్తితో చిత్రించును. బాదరాయణునివలె నాతఁడును హరిహరధ్యానపరాయణుఁడై శివకేశవుల నిరువురను తుల్యప్రతిపత్తితో భావించి, తనకా యుభయమూర్తులయెడలఁ గల సద్భావమును తెల్లముచేయును. ఏమూర్తి విభవమును వర్ణింప సమకట్టినను, ఆమూర్తికిఁ గల ప్రత్యేకతను మన కన్నులయెదుటఁ గాన్పింపఁజేయుచు, తనకుఁ గల భక్తిభావమును వ్యక్తముచేయును. పరమశివభక్తి నివేదనమునకై సంతరించిపెట్టిన భీమేశ్వర పురాణమునందుఁ గానవచ్చెడి శ్రీనాథుని విష్ణుభక్తిని కొంత పరికింతము.

వ్యాసుఁడు విశ్వేశ్వరుని ఆగ్రహమునకు అన్నపూర్ణాదేవి అనుగ్రహమునకు పాత్రుఁడై, కాశి వదలి దక్షిణకాశికి పయనమై వచ్చునపుడు, మార్గమధ్యమునం దాతనికి కాశీవియోగ తాపశాంతికి శిశిరోపచారములుగా సమకూడిన వస్తువులన్నియు విష్ణుమూర్తులకు సంబంధించినవియే. వానివాని విభవము నెట్లు చిత్రించెనో కనుఁగొందము.

గంగానదీప్రవాహకణము మాధవదేవు
దోరంతరంబు శ్రీతులసిచిగురుఁ
బురుషోత్తమమునందుఁ బుండరీకాక్షుని
దివ్యపాదాంభోజ తీర్థజలము
శ్రీకూర్మమునయందు శేషాహిపర్యంకు
కంఠంబు క్రొత్తచెంగల్వదండ
సింహాద్రియందు లక్ష్మీనృకంఠీరవ
సార్వభౌము ప్రసాదచందనంబు

కాశికావిప్రయోగోరు గాఢతాప
శాంతి కొదవెను శిశిరోపచారములుచుఁ
జాయతెనవ్వున శ్రీ బాదరాయణునకు
హరిహర ధ్యానపరాయణునకు. —భీమ. 2-51

ఈ పద్యమునందు బ్రయోజించిన శైత్యోపచార యోగ్యమైన వస్తువులన్నియు విష్ణుసంబద్ధములే. గంగానది విష్ణుపాదోద్భవ. అది హిమవత్పర్వత ప్రసృతముగాన శైత్యోపచారమున కనువైన హిమ జలము కలది. కాశి విశ్వేశ్వరావాస మగుటయేగాక పంచమాధవులలో నొకఁడైన బిందుమాధవస్వామి నెలకొనియున్న క్షేత్రము. కావుననే కాశీక్షేత్రము శివభక్తులకు విష్ణుభక్తులకుఁ గూడ పరమోపాస్యము. అట్టి మాధవదేవుని వక్షస్థలము నంటి ప్రసాదముగా లభించిన తులసిదళమగుటచే నదియు వైష్ణవమే. పురుషోత్తమ క్షేత్రమయిన "పురి"యందు జగన్నాథస్వామి పాదతీర్థము. శ్రీకూర్మక్షేత్రమునందలి కూర్మనాథస్వామి ప్రసాదముగా లభించిన చెంగల్వదండ సింహాచలమునందు నృసింహస్వామి కలఁదిన చందనము-ఇవన్నియు ఆయాక్షేత్రములందు ప్రధానముగ నాయా మూర్తుల కర్పించు ప్రధానోపచార వస్తువులు శిశిరోపచారమున కనువైన వస్తువులును. ఇవియన్నియుఁగూడి, హరిహరుల నిరువురను సమాన ప్రతిపత్తితో ధ్యానించు భావనగల వ్యాసునకు కాశీవియోగ తాపము చల్లారుట కనువైన శిశిరోపచారము లైన వనుటలో, వ్యాసునకువలె శ్రీనాథునకును హరిహరధ్యాన పరాయణత్వము గలదని వ్యక్తమగుచున్నది. వియోగతాపము గలవారి తాపశాంతికై హిమాంబువు పల్లవములు పూలదండలు చందనము మున్నగునవి యుపయుక్తములగుట కావ్యత్వమున కనువుగ నిచట జతఁగూడినవి.

అటనుండి వ్యాసుఁడు శిష్యసహితుఁడై పీఠాపురమునకుఁ జేరును. ఇదికూడ శివకేశవ మూర్తులు రెంటింటికి సమప్రాధాన్యము గల దివ్యక్షేత్రము. హుంకారిణీ దుర్గకు కుక్కుటేశ్వరునకు నెలవు. పీఠాంబికకు కుంతీమాధవునకు ఆవాసము. పిఠాపురమునకు పాదగయాక్షేత్రమను ప్రసిద్ధి గలదు. గయాసురుని శిరస్సు గంగాతీరమందలి గయయం దుండుటచే దానికి గయాశీర్షమనియు, పాదములే పిఠాపురమున కుక్కుటేశ్వరస్వామి సన్నిధి నుండుటచే దీనికి పాదగయయనియు వ్యవహారము. అష్టాదశశక్తి పీఠములలో నొక్కటియైన హుంకారిణీశక్తి పీఠస్థానము. పంచమాధవులలో నొక్కఁడైన కుంతీమాధవుఁ డీపీట విడిసియున్నాఁడు. ఈ పురక్షేత్రాధిదేవత పీఠాంబిక, కైటభదైత్యవైరిప్రియకాంత, పీఠాంబికా సాన్నిధ్యముచే నీపురమునకుపీఠాపురమను నామమేర్పడినది. అది క్రమముగా పిఠాపురమైనది. ఈపట్టణ విభవమును నుభయవిధదేవతా సమన్వయముతో శ్రీనాథుఁ డిట్లు వాకొనియున్నాఁడు:

ఏపట్టణము ప్రోల నేలేరు ప్రవహించుఁ
పృథివికి ముత్యాలపేరువోలె
మున్నూటయఱువది మూర్తిభేదములతో
విహరించు నేపీట వేల్పుఱింఘ
పీఠాంబచెలి యోగపీఠహుంకృతి దుర్గ
వసిచి కాపుండు నే నగరికెలనఁ
గుంతీమహాదేవి కూర్మిమేనల్లుఁడు
మాధవుం డే వీట మరగినాఁడు
పెద్దగవఁకుల నే పుటభేదనమున
నెలమి నిలుచుండు వ్రీడావిహీనజఘనుఁ
డట్టి పీఠాపురముఁ జేర నరుగుదెంచెఁ
బరమశైవుండు శ్రీపరాశరసుతుండు. భీమ. 2-52

పిఠాపురము ఏలానది (ఏలేరు) సముద్రములోఁ గలియుచోటునకు ఒక ఆమడ వెనుకనున్నది. ఈరేవులేటికాల్వలు కలఁక దేఱి ప్రవహించునపుడు ముత్యాలహారపు పేటలవలె కడుమనోహరముగా నుండును. ఈ నదీతీరమందలి పవిత్రక్షేత్రములలో పిఠాపుర మొకదివ్యక్షేత్రము. ఇది భీమమండలమునకు (దక్షారామ భీమేశ్వరుఁడు నెలకొని యున్న ప్రదేశమునకు) ఉత్తరపు టెల్లలో నుండినది. కుంతీమాధవ కుక్కుటేశ్వరులు, పీఠాంబికా హుంకారిణీశక్తులు ఇచట ప్రధాన దేవతలు. వారి నందఱను వ్యాసుఁడు సేవించెనని యీక్రింది విధముగ వివరించియున్నాఁడు:

అంతర్వాణి భజించెఁ గుక్కుటపతిన్ హాలాహలగ్రీవునిన్
శాంతస్వాంతుఁడు గొల్చె దానవచమూసంహారిణిన్ హుంకృతిన్
చింతించెన్ మునిసార్వభౌముఁడు పురక్షేత్రాధిదైవంబులన్
గుంతీమాధవుపూజచేసె ఋషి వాక్పుష్పోపహారంబులన్.

భీమ. 2-58

కుక్కుటేశ్వరుని శ్రీనాథుఁడు గరళకంఠునిగా పేర్కొనినాఁడు. ఆనాఁడా పరమేశ్వరుని కంఠమున కాళిమ చూపట్టుచుండెడిది కాఁబోలు. లింగాగ్రము కుక్కుటాకారమును తలఁపింపఁజేయును. కొంతకాలము నుండి లింగాగ్రము అభిషేకధారాపాతమున శిథిలము కాఁజొచ్చినది. హుంకారిణీశక్తి భూస్థాపితమైయున్నదని యచటివారు వాకొనెదరు. కాలభైరవవిగ్రహము విలక్షణము. పీఠాంబిక యచటి కుమారస్వామి యాలయమున నెట్టులో నిలిచియున్నది. కుంతీమాధవదేవుఁడు ప్రాచీన కాలమునుండి మహావిభవముతో విరాజిల్లుచున్నాఁడు. ఆ యాలయమునం దొక శిలాస్తంభముమీఁద, వెనుకటి వెనుకటి శతాబ్దులలో ఆంధ్రదేశమును పాలించిన ప్రభువులందఱు ఆ మాధవదేవు నర్చించి, భక్తిపురస్సరముగఁ జేసినదానము లన్నియు నచట శాసనములుగ

లిఖింపఁబడియున్నవి. దీనిని నిదానముగఁ బరికించిన ప్రాచీనకాలమున పిఠాపురము వైష్ణవక్షేత్రములలో ప్రధానముగ గణింపఁబడినట్లు లూహింపవచ్చును. మఱియు నీ యేలానదీసాగర సంగమస్థలమున పొన్నవాడ యను గ్రామమునకు సమీపమున జగన్నాథక్షేత్రము నందువలె జగన్నాథస్వామి సుభద్రాదేవి బలరామస్వామియు నెల కొనియున్నారు. కావున నేలేటితీరము వైష్ణవక్షేత్రముగనే ప్రసిద్ధమై యుండెనని మనమూహింపవచ్చును.

మఱియు శ్రీకృష్ణ మధురభక్తి మతస్థాపకుఁడైన వల్లభాచార్యుఁడు కుంతీమాధవదేవున కర్పితమై, పిఠాపురమునకు సమీపము నందుండిన నవఖండవాడ గ్రామమున జన్మించి, కాశ్యాదిక్షేత్రము లలో విద్య నార్జించి, గుజరాతు దేశమున వల్లభాచార్య మతమును వ్యాపింపఁజేసి ప్రత్యేక మతప్రవర్తకుఁడైనాఁడు. ఈ యేలానదీతర మున కుంతీమాధవ కుక్కుటేశ్వరుల సాన్నిధ్యము చేతనేగావచ్చును, రాజరాజనరేంద్రుని తరువాత వేంగీదేశ పాలకుఁడుగా వచ్చిన వీర చోళమహారాజు, పిఠాపురమునకు ఒక యోజనము మేరలోనుండిన "ఆలవెల్లి-పొన్నతొఱ్ఱి-ఆలమి"యను మూఁడుగ్రామముల నేకము చేసి 'చతుర్వేది మంగళాగ్రహా'రమని నామకరణముచేసి, శా. శ. ౧౦౦౧ క్రీ.శ. 1079 ప్రాంతమున చతుర్వేదపారగులై షట్కర్మనిర తులైన 536 విప్రులకు 544 భాగములుగాచేసి దానముచేసినట్టు లానాఁటి శాసనము తెలుపుచున్నది.[1] వీనిలో ఆలవెల్లి యనఁగా ఆల మందలున్నచోటు. ఆస్థానమం దిప్పటికిని గోపాలకజాతివారు పెక్కురు నిలిచియున్నారు. ఈ యాలమందలు కుంతీమాధవదేవున కర్పించినవి గావచ్చుననియే యూహింపవచ్చును. దక్షారామ భీమేశ్వరునకు భక్తు లర్పించిన గోవులు నిలిచినచోటు పసుంపూఁడియైనట్టులే,కుంతీ

1. See. Epi. Ind. Vol V Pithapuram plates of Virachoda.

మాధవ కుక్కుటేశ్వరుల కర్పించిన గోవులున్న కారణముననే, సమీపమునందున్న ఈ గ్రామము ఆలవెల్లియై యుండును. పైవిషయమును పర్యాలోచనము సేయఁగా హరిహర ధ్యానపరాయణుఁడైన వ్యాసునకు, త్రిలింగోత్కళసంధిని, భీమమండలము పొరువున, పీఠాపురమునందు కుంతీమాధవ కుక్కుటేశ్వరుల సాన్నిధ్యమును గూర్చుటలో శ్రీనాథుఁడు తనకుఁగల శివకేశవాభేదభావమును తలపింపఁజేసినాఁడు.

ఇటులనే పీఠాపురము వీడి ముందునకు సాగునప్పటికిఁ గానవచ్చిన ప్రధాన శివక్షేత్రములలో నొక్కటి కుమారారామ భీమేశ్వరస్వామి యావాసము. ఇచటి భీమేశ్వరునకు చాళుక్య భీమేశ్వరుఁడని ప్రసిద్ధి. చాళుక్యభీమ నిర్మితమైన గోపుర ప్రాసాదాది విభవముతోఁ గూడి అచటి ఈశ్వరుఁడు చాళుక్య భీమేశ్వరుఁడైనాఁడు. ఇచట వ్యాసుని మార్గాయాసము తరుగుటకై కుమారారామ వాయువు వీచెనని తెలుపుచు, ఆవాయువు నచటి శివకేశవ మూర్తులతో సంబద్ధము చేసినాఁడు. ఆచోట వీచిన కుమారవనానిలము, భీమనాయక దేవు పేరురంబునఁ గ్రాలు భుజగహారములకు భుక్తి వెట్టి, రాజనారాయణస్వామి రమ్యభవనతార్క్ష్యకేతనపటికి నర్తనముగఱపి, అధ్వపరిశ్రాంతి పోడవడఁగుటకై మానివరుపై వీచె' ననినాఁడు. కుమారారామమనునది, నేఁటి సామర్లకోట. అచట భీమేశ్వరుఁడు గలఁడనుట చాలమందికి తెలియును. అచట రాజనారాయణుఁడను విష్ణుమూర్తి యుండినట్లు విష్ణుభక్తులకేగాని యెఱుఁగరాని విషయము. ఆవిషయమును, రాజనారాయణస్వామి దేవళముమీఁద నున్న గరుత్మంతునకు వాయువు నాట్యము నేర్పె' నను వాక్యముచే వక్రోక్తి భంగిని తెలుపుచు, శ్రీనాథుఁడు తనకుఁగల విష్ణుభక్తి తత్పరతను తెల్లముచేసినాఁడు. అతఁడు కేవలము శైవుఁడేయైనచో నిచట రాజనారాయణస్వామిని తడవకుండినను పద్యము నడువకపోదు. ఇదియు నాతని యద్వయ భావనకుఁ దార్కాణము.

ఇఁక కుమారారామమునకు పిఠాపురమునకు కొంచెము తూర్పుగ రెండుక్రోసులమేరలో నుండిన సర్పవరమునకు వ్యాసుఁడు వచ్చి, యచటి తీర్థక్షేత్రములను దర్శించెనని తెలుపునపుడు శ్రీనాథుఁడు పరమవైష్ణవుఁడైనాఁడు. సర్పవరక్షేత్రమును జూచునప్పటికి శ్రీనాథుని హృదయము విష్ణుభక్తిచే తన్మయత్వమునంది ఆపురమును త్రిలింగక్షోణి వైకుంఠముగ భావించినది. మఱియు నచటి వైష్ణవోత్తముల భక్తిప్రపత్తులను ఆతఁడు యథాతథముగఁ జిత్రించి, తనకుఁగల విష్ణుభక్తిని వ్యక్తముచేసినాఁడు. ఆపురమును నూటయెనిమిది తిరుపతులకు పరమపదమైన దివ్యధామముగాఁ జిత్రించినాఁడు. విష్ణుభక్తితత్పరులుగూడ దానికంతటి మహత్త్వము నాపాదింపఁజాలరనునంతటి యుదాత్తముగఁ జిత్రించినాఁడు. ఆతీరు పరికింతము.

కాంచెన్సర్పవరాధివాసము త్రిలింగక్షోణివైకుంఠమున్
ముంచెన్నారదకుండికాజలమున న్మోదంబుతో దేహమున్
డించెం గాశివియోగదుఃఖము మహాక్షేత్రంబు వీక్షించి, ద
ర్శించె న్సన్మునిలోచనోత్సవముగా శ్రీభావనారాయణున్.

భీమ. 2-65

సర్పవరము కేవలము విష్ణుక్షేత్రము. అచటి దేవత భావనారాయణస్వామి. ఆస్వామి సన్నిధినున్న జలాశయము నారదకుండము. వైష్ణవమాయవలన లభించిన స్త్రీభావము నారదునకా తీర్థమునందు మునుఁగుటచే దూరమయ్యెనని యైతిహ్యము. ఇట్టి సర్పవరమును త్రిలింగ (తెలుఁగు) భూమికి వైకుంఠమునుగా నిరూపించినాఁడు. వ్యాసునకు నారదకుండికా జలస్నానము కాశీవిప్రయోగ దుఃఖమును బోఁగొట్టినదఁట. ఆతీర్థస్నానమునం దెంతటి సద్భావము నాపాదించి పెట్టినాఁడో? మునివర్యుఁడు భావనారాయణస్వామిని లోచనోత్సవముగా దర్శించెననుటలో నొకవిశేషము నిక్షిప్తమైనది. ఆ యాలయ

మునందు భావనారాయణస్వామి విగ్రహములు రెండుగలవు. వానిలో పాతాళ భావనారాయణస్వామిలో నేత్రాకర్షకమైన ఓజస్సుగలదు. సద్భావముతో పరికించువారికా మూర్తిలో చనోత్సవముగనే యుండును. శ్రీనాథుఁడీ రహస్యము నిచట నిక్షేపించిపెట్టినాఁడు. శ్రీనాథుని నిశితమూర్తి పర్యవేక్షణమేయట్టిది. ఏయే తావునం దేవిషయము విలక్షణమో, దానినాతఁడు గుర్తించి చూపింపకమానఁడు.

ఇంతియ గాదు. ఈ సర్పవరము చాల పురాతనమైన వైష్ణవ క్షేత్రము. చాల ప్రాచీనకాలము నుండియు నిందులో యీస్వామి నారాధించుచు వచ్చినట్లు వెనుకటి శతాబ్దులకుఁ జెందిన శాసనములు తార్కాణించుచున్నవి. శ్రీ శంకరభగవత్పాదుల పూర్వులు ఈసర్పవరక్షేత్రమునుండియే కాలటికి వలసపోయినట్లు చరిత్రమువలనఁ దెలియవచ్చుచున్నది. ఆలయప్రాకారాదులు చాల పురాతనములు. కుంతీమాధవ రాజనారాయణుల పొరుగున కేవల వైష్ణవక్షేత్రమైన సర్పవరమునకుఁ గల వైకుంఠవిభవము నీక్రిందివిధముగ రూపొందిచినాఁడు.

శ్రీసుదర్శన శంఖ చిహ్నాంకితముగాక
        యెపుడు భిన్నకయున్న యిల్లు లేదు
బహుళోర్ధ్వపుండ్ర సంపద లేక వృథయైన
        ఫాలరేఖలతోడి ప్రజయు లేదు
వైష్ణవోత్తమ భాగవతసాత్వికులగోష్ఠి
        వెలియైన వాటికావేది లేదు
నలినేక్షణుఁడు భావనారాయణస్వామిఁ
        దప్పించి పరదైవతంబు లేదు
పరమగీర్వాణ యాగవైభవము నెలవు
నిఖిలకల్యాణగుణకేళి నిలయమనఁగ
దివ్యములు నూటయెనిమిది తిరుపతులకుఁ
బరమపదమైన శ్రీసర్పవరమునందు. 2-66

శ్రీనాథుని నాఁడేకాదు; ఈనాఁటను అంత సమృద్ధిలేకున్నను మిగిలియున్న వైష్ణవగృహములు శంఖచక్రాంకితములై యున్నవియే. అచటి వైష్ణవోత్తము లూర్ధ్వపుండ్రాంకిత ఫాలభాగములు గలవారే. అతని నాఁడు వైష్ణవోత్తములు పరమభాగవతులై భవనవేదికలందు భక్తిగోష్ఠి నెఱపుచుండెడివారని విదితమగుచున్నది. అచటివారందఱకు భావనారాయణస్వామియే పరదైవతమగుటయు సహజవిషయమే. ఆనాఁడు తత్పురవైభవము నూటయెనిమిది తిరుపతులకంటెను మహత్తరమైయుండెనని తెలిపి, తనకుఁగల వైష్ణవప్రపత్తిని శ్రీనాథుఁడు హృద్యోదాత్తముగా పై పద్యమున వెలార్చినాఁడు.

అంతటితో తనివిసనక, ఆనాఁడా దివ్యక్షేత్రమున స్వామికి నెఱపెడి శనివారోత్సవక్రమమును, భగవంతునకు భక్తితో నివేదించు పదార్థజాతమును సైతము మనయెదుటఁ బెట్టినాఁడు.

శనివారోత్సవమాచరించె మునిశిష్యవ్రాతముం దాను గ
మ్మనిపణ్యాగముతోడఁ బూరగముతో మండెంగతండంబుతో
ననుకుంబాసెముతోడఁ బాండుకలమాహారంబుతో నేతితో
ఘనరంభాఫలఖండశర్కరలతోఁ గారుణ్యపాథోధికిన్. 2-67

ఈపద్యమున రెండవపాదములో 'పూరగముతో' అనునది తాటియాకు ప్రతిపాఠము 'బూరెగమితో' అనునది ముద్రితపాఠము. 'పూరగము' క్రమముగా 'పులగము' గామాఱినదేమో? కాశీఖండమున అన్నపూర్ణాదేవివలన వ్యాసునకు శిష్యునకు లభించిన భోజనపదార్థములలో పులగముకూడ గలదు. శ్రీనాథుఁడే దేవతకైనను, ఏభోజనావసరమునందైనను తననాఁటి పిండివంటలను మఱవక మానఁడు. అందును వైష్ణవక్షేత్రములం దాస్వామికి సంప్రదాయానుగతముగ సర్పింపఁబడు ఖాద్యముల నాతఁడర్పింపఁజేయక యెట్లుండును? సర్వవరమును నూటయెనిమిది తిరుపతులకుఁ బరమపదమునుగ భావించినాఁడు గావున

వ్యాసమునిచేతను, ఆతని శిష్యవ్రాతముచేతను శనివారోత్సవమును వైష్ణవసంప్రదాయానుసారముగ దివ్యోపహారములతోఁ గావింపఁ జేసినాఁడు.

ఏ దేవత కేవిధముగ అర్చనాదికము జరుపవలెనో, ఆ సంప్రదాయమును బాగుగ నెఱిఁగినవాఁడు శ్రీనాథుఁడు. ఆతనికి శివకేశవు లిరువురు సమానభావనోపాస్యులే. కావుననే సర్వవర భావనారాయణస్వామికి ద్వాదశాక్షర దివ్యమంత్రముతో చెంగల్వపూదండ నర్పింపఁ జేసి, అష్టాక్షరీ మంత్రముతో పసిఁడిపూవుల నర్పింపఁజేసినాఁడు.

ద్వాదశాక్షర దివ్యమంత్రమునఁ బూన్చి
జెంగలువపువ్వుదండ లక్ష్మీధవునకు
శ్రీమదష్టాక్షరమున నర్చించె దపసి
భావనారాయణస్వామిఁ బసిఁడివిరుల. —భీమ 2-68

బహుశః ఈపసిఁడివిరులు శరదృతువాడిగా నికుంజముల విరియు బంగారురంగుగల గొబ్బిపూవులగునేమో? ద్వాదశాక్షర మంత్రముతో నభిమంత్రించి స్వామికి పూలమాలిక నర్పించుట, అష్టాక్షర మంత్రముతో పుష్పార్చనముగావించుటయు వైష్ణవసంప్రదాయానుగతమైన విషయము. ఇది విష్ణుప్రీతికరము అనువిషయమును వ్యక్తము చేసినాఁడు. ఈవిధముగ శ్రీనాథుఁడు భావనారాయణస్వామియెడల తనకుఁ గల భక్తితత్పరతను వ్యక్తముచేయుచు శ్రీనాథనామమును సార్థకముచేసికొనినాఁడు.

ఇట్లే క్షీరాబ్ధి మథనముగావించి, అమృతోత్పాదనము సేయుటకై దేవేంద్రుఁడు శ్రీమహావిష్ణువుతో మంతనము సేయఁబోయినప్పుడు క్షీరాబ్ధిశయనుని విభవము నతిమహితముగఁ జిత్రించియున్నాఁడు. ఆతీరు పరికింతము.

దివ్యాయుధములైదు ధృతచేతనంబులై
శత్రుసంహారంబు సంస్తుతింపఁ
బులుఁగుఱేఁడు కరాబ్జములు రెండు మొగిడించి
భ్రూలతా దేశంబుపొలుపు నరయ
సౌఖశాయనికులై సనకాదియోగీంద్రు
లనురాగవీక్షణం బభిలషింప
నూరురంభాస్తంభ యుగళంబుపైనుంచి
లక్ష్మి శ్రీపాదపల్లవము లొత్తఁ
బన్నగాధీశ భోగతల్పంబుమీఁదఁ
దత్ఫణారత్నదీప్తిమైఁ దళుకుఁజూపఁ
బాల మున్నీటిలో నిద్రమేలుకొన్న
హరికిఁబొడసూప నేతెంచె హరిహయుండు.

భీమ. 4-49.

శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధిలో శేషశయనమునుండి నిద్రమేల్కాంచినప్పటివిభవ మీపద్యమునందు నిరూపితమైనది. ఆసమయమున విష్ణువు నాయుధములు చైతన్యముతోఁ గూడి అతని శత్రుసంహారకృత్యముల నుగ్గడించుచు స్తుతించినవి. గరుత్మంతుఁడు చేతులుజోడించి, క్రీఁగంటి చూపునకై వేచియుండెను. సనకాదిమునులు సుఖనిద్రను పృచ్ఛించుచు అనురాగవీక్షణము నభిలషించుచుండిరి. లక్ష్మీదేవి రంభాస్తంభములవంటి తనతొడలపై నిడుకొని శ్రీహరిపాదముల నొత్తుచుండెను. శేషశయ్యపైనుండి, శేషుని పడగలమీఁది రత్నముల కాంతి తన శరీరమున సోఁక క్రొత్తతళుకును గూర్పఁగా, క్షీరసాగరమధ్యమున శ్రీహరి నిద్రమేలుకొని యున్నసమయమున దేవేంద్రుఁడు దర్శింపవచ్చెనని యీపద్యభావము.

ఈ సీసగీతములు రెండిటియందుఁ గూర్చిపెట్టిన విషయము, కాళిదాస విరచితమైన రఘువంశ కావ్యమునందలి దశమసర్గములోని శ్లోకముల భావములను సంతరించుకొని యవతరించినది. కాళిదాసు, వాల్మీకి రామాయణమునందలి వాక్యముల నూఁతగాఁగొని, తన భావనాప్రాభవముచే నేవిషయమునైనను మధురోదాత్తముగా సంతరించును. కాళిదాస వాక్యముల నుపష్టంభకముచేసికొని శ్రీనాథుఁడాభావములనే కొంత విపులీకరించును. ఈపద్యమునకు మూలమయిన కాళిదాస వచనము లీక్రిందివి, విష్ణుస్తవ ప్రస్తావములోనివి.

శ్లో॥ హేతిభిశ్చేతనావద్భి రుదీరితజయస్వనమ్
ఉపస్థితం ప్రాంజలినా వినీతేన గరుత్మతా
భృగ్వాదీననుగృహ్ణాంతం సౌఖశాయనికా న్మునీన్
శ్రియః పద్మనిషణ్ణాయాః క్షౌమాంతరితమేఖలే
అంకే నిక్షిప్తచరణ మాస్తీర్ణ కరపల్లవే
భోగిభోగాసనాసీనం దదృశు స్తం దివౌకసః
తత్ఫణామండలోదర్చిర్మణి ద్యోతితవిగ్రహమ్॥

ఈ శ్లోకములలోని విషయము ప్రస్తరింపఁబడినదై పై సీసగీతములుగా రూపొందినది. కాళిదాసునకు పార్వతీ పరమేశ్వరులయెడ ప్రత్యేక భక్తిభావ మేర్పడియున్నను, విష్ణువునందును పరమశివునందును అద్వయభావసమన్వితమైన ప్రతిపత్తి యెట్లేర్పడియుండెనో, అతనియడుగు జాడలలో మెలఁగుచు వచ్చిన శ్రీనాథునకుఁగూడ, శివకేశవులయెడ అద్వయభావ సమన్వితమైన విశిష్టభక్తి యేర్పడియుండె ననుటకు పై యుదాహరణములే నిదర్శనములు.

భారతపరిశీలనము—'ధర్మ' స్వరూపము

శ్రీకృష్ణభిక్షు.

ఈ నడుమ భారతేతిహాసము గాఢపరిశీలనమునకు లోనగుచున్నది.

ఇది తత్కావ్యమునందును నందుక్తము లైన ధర్మాదికము లందును కేవలాదరాభినివేశములచేత నైనచో సంతోషింపవలసి యుండెడిదే గాని విపరీతభావాభినివిష్టులు కొందఱు తమయిచ్ఛయే ప్రమాణముగా తెలుఁగు భారత మొక్కటియే ప్రమాణముగా, అనఁగా సంస్కృతమూలమును జూడక, భారతకథాంశముల నిర్ణయించుకొని ధర్మాదిక నిర్ణయములు స్వాభిమతానుకూలముగ నున్నట్లు రాద్ధాంతములు చేయుచున్నారు. సంస్కృతమూలమును జూతమా పాఠబాహుళ్యము చేత సందేహముల కవకాశ మొసంగుచున్నది. ఇందుకుఁ దోడు చరిత్రకారులు విప్లవవాదులు విశృంఖలముగా విమర్శించుటచేత చదువరుల దృష్టియే చెడి మూలగ్రంథకారుని యాశయమే చెడుచున్నది. మచ్చునకు.

భారతగాధ భరతవీరులగాథ మాత్రమే యని పలువురు విద్వాంసు లనుచున్నను, చూడుఁడు శౌనకాదులు సూతుని తమకు భరతవీరులగాథ చెప్పుమని యడుగను లేదు. వారి గాథను జెప్పుదు నని యతఁడు నుడువను లేదు. "వక్ష్యామి నారాయణకథా మిమాం" 1-1-27 అని, నారాయణుని కథను దీనిని జెప్పుదు నని యతఁ డనును. అంగి నారాయణకథ. అంగములలో నొకటి కురువరులగాథ. ఇది నారాయణకథ యె ట్లయినదో సంభవపర్వము (1-64) వివరించుచున్నది.

దేవాసురయుద్ధమున నసురు లోడి సత్త్వప్రధానములగు లోకము లందు నారాయణసహాయులగు దేవతల నోడింపలే మనియు, భూలోకములో రజస్సు తమస్సు హెచ్చుగా నుండును గావున నాలోకమున రాజవంశముల జన్మించి యజ్ఞయాగాదుల మట్టుపెట్టిన హవిర్భాగ

ములు లేక దేవతల శక్తి యమగంటి వారు తమకు సులభసాధ్యులగుదు రనియుఁ దలఁచి యట్లే చేసిరి. ఈ సాధుబాధకుల నోర్వఁజాలని భూదేవి బ్రహ్మను శరణు చొచ్చెను. అసురాంశజులగు నీ భూలోకరాజవంశ్యుల నోర్వ మీరు గూడ రాజవంశముల జన్మింపుఁడని దేవతలకు నానతిచ్చి బ్రహ్మ నారాయణుని గూడ నవతరింపుమని వేడెను. అట్లే "తే అమరాదివినాశాయ సర్వలోకహితాయ చ అవతేరుః క్రమేణైవ మహీం స్వర్గా ద్దివౌకసాః" 1-65-3. స్వర్గము నుండి తద్వాసులు క్రమముగా భూమికి దేవశత్రువులఁ జంపుటకును సర్వలోకముల హితముకొఱకు నవతరించిరి. భారతకథ సంభవపర్వములో దేవావతారమును జెప్పి స్వర్గారోహణపర్వములో వారు శత్రుసంహారము చేసి యనంతరము తమ స్వస్థానమును జేరుటను వర్ణించి సమాప్తిఁ బొందుచున్నది.

సారాంశము :- భారతవీరులు సురాసురాంశములఁ బిత్రుధర్మములతో శక్తులతో భూమి నుదయించిన వారు. ఈ సురాసురసంఘట్టనమున నారాయణుఁడు నేత. ఈ భూభారాపహరణ మాయన లీల. భారతకథాపురుషులు ఆయన కుపకరణములు. వారి చరిత్ర నర్థము చేసికొనవలె నన్న వా రేయంశమున జన్మించినది తమ భూలోకజీవితాంత్యమున నే దేవుని జేరుకొన్నది తెలిసికొనుట యవసరము.

ఈ యవతరణములో ధర్ముని యంశము ఇరువురు పురుషులుగా నీ భూమిపై నభివ్యక్తమైనది. ఒకఁడు విదురుఁడు, రెండవవాఁడు ధర్మరాజు. ఇద్దరి తత్త్వము నొక్కటియే. దీనికి ప్రమాణము.

1. శ్లో॥ త్వంహి మత్ప్రభవో రాజన్ విదురోఽపిమమాంశజః

అరణ్యపర్వము.

యక్షరూపమున ధర్ముఁడు ప్రత్యక్షుమై ధర్మరాజుతో నిట్లు మాటలని నాఁడు. రాజా! నీవు నావలనఁ గలిగినవాఁడవు విదురుఁడును నా యంశము వలనఁ బుట్టిన వాఁడే.

2. ఆశ్రమవాస పర్వమున విదురనిర్యాణానంతరమున ధృతరాష్ట్రునకు వ్యాసుఁడు విదురుని గూర్చి చెప్పును.

యోహిధర్మః సవిదురః విదురోయః సపాండవః

ఆశ్ర. 2 8 అ. 21. శ్లో.

ధర్ముఁడే విదురుఁడు విదురుఁడే ధర్మరాజు. ఈ యంశమును సంస్కృతాంధ్ర భారతములు రెండు నొప్పుకొన్నవి గాని, ఈ ధర్ముఁ డెవఁడు? అను విషయమున భిన్నముగాఁ దెలిపినవి. తెనుఁగు భారతమున,

యము నంశమునఁ బుట్టె ధర్మజుండు.

ఆది. 3 అ. 84 ప.

అఁగా ధర్మరాజు, ధర్మజుఁడు-అనఁగా ధర్మునకుఁ బుట్టినవాఁడు అతఁడు యముని యంశమున బుట్టెనని దీనియర్థము. తెనుఁగు కవికి ధర్ముఁడన్నను యముఁడన్నను నొక్కటియే. విదురుని విషయమునను తెనుఁగు కవి. "ధర్ముండు మాండవ్యశాపంబున శూద్రయోనియందు విదురుండై పుట్టుటయును" ఆది. 1 అ. 35. ప. అనియును,

చండకోపుఁడైన మాండవ్యమునివరు
శాపమున యముండు సంభవిల్లె
విదురుఁడనఁగ ...

ఆది. 4-259 ప.

అనియు చెప్పినాఁడు అనఁగా ధర్ముఁడు యముఁడు నొక్కఁడే యని నిర్ణయించి పెట్టినాఁడు. ఇందులకు భిన్నముగా, ఆ తెనుఁగు భారతమే ధర్ముఁడు యముఁడు వేఱుపురుషులని, స్వవచోవ్యాఘాత ముగఁ జాటుచున్నది.

"బ్రహ్మ దక్షిణ స్తనంబున ధర్ముఁడను మనువుపుట్టె"

ఆ. 3. 69

"వివస్వంతునకు (సూర్యునకు) వైవస్వతుండను మనువును, యముండును శనైశ్చరుండును ... ... పుట్టి.

ఆ. 3. 39.

కనుక, ధర్ముఁడు బ్రహ్మతనయుఁడు. యముఁడు సూర్యతనయుఁడు. ఇట్లు వీరిరువురు భిన్నవ్యక్తులని పై రెండు వాక్యముల వలనఁ దెలియవచ్చుచున్నది. ఈ తెనుఁగు కవి తీర్పరాని సంశయమును కల్పించును. మూలమును జూచిన ఈ బాధ రానేరాదు.

నేను పరికించినంత వఱకు, ధర్మరాజుగాని విదురుఁడు గాని పుట్టినది యమునివలననునది, సంస్కృతమూలములలో లేదు. అందా యిరువురి పుట్టుక, ధర్ముని వలననే యని చెప్పుచున్నది. వీరిరువురి జనకునినిర్దేశించునపుడు యమశబ్దప్రయోగము లేనేలేదు. మూలగ్రంథమునఁ జూడుఁడు. ధర్ముఁడునరనారాయణుల తండ్రి, బ్రహ్మకొడుకు, దక్షప్రజాపతి యల్లుఁడు. ఇఁక యముఁడో, సూర్యతనయుఁడు, నరలోకమున కధిపతి. ధర్ముఁడు ధర్మనిర్ణేత. ధర్మచోదకుఁడు, నిర్వాహకుఁడును. యముఁడు, ధర్మాతిక్రమణమును మరణానన్తరమున దండించువాఁడు.

అధునాతన నిఘంటువులు, ధర్మశబ్దమునకు 'యమధర్మరాజు' అనియును అర్థమును చెప్పుచున్నవి గాని, ప్రాచీనతమ నిఘంటువు అమరము 'ధర్మరాజః పితృపతిః, అనుచున్నది గాని, కేవల ధర్మశబ్దమునకు యముఁడను నర్థమును చెప్పుటలేదు. కావున సంస్కృతమున రాముఁడన్న ఝుటితి స్ఫూర్తిలో దశరథతనయుఁడే స్ఫురించునట్లుఁ ధర్ముఁడన్న ప్రజాపతియే యనునర్థసిద్ధి కలుగుచున్నది గాని, యముఁడని కాదు. యముని నిర్దేశించు నితర పర్యాయపదముల చేత, ధర్ముని నిర్దేశించిన వారు సంస్కృతమునం దొక్కరును గానరారు.

ధర్ముఁడు యక్షప్రశ్నఘట్టమున, తనకు చెప్పుకొన్న విశేష

ములు యమున కన్వయింపవు. "అహంతే జనకస్తాత ధర్మో మృదు పరాక్రమః" అర-313 అ 6 శ్లో.

నాయనా! నేను నీతండ్రిని, ధర్ముఁడను, మృదుపరాక్రముఁడను. సర్వప్రాణులను సమయించు శమనుని. మృదుపరాక్రముఁడనఁజెల్లునా? కాలస్వరూపమున అతఁడు 'దురతిక్రమః' అనిగదా చెప్పఁబడుచున్నాఁడు.

యశస్సత్యం దమః శౌచ మార్జ వహ్రీరచాపలమ్
దానం తపో బ్రహ్మచర్య మిత్యేతా స్తనవో మమ.

అర. 313. అ 7. శ్లో.

యశస్సు మొదలయినవి నాశరీరములు. యముని కివి శరీరములు అనువర్ణనము ఎందేనిఁ గలదా? 'సత్యం తపః' 'ధర్మ స్తపః,' ఇత్యాదులలో ధర్మశబ్దము గలదుగాని యమశబ్దము లేదుగదా!

అహింసాసమతా శాన్తిః తపశ్శౌచ మమత్సరమ్
ద్వారాణ్యేతాని మే విద్ధి ప్రియోహ్యసి సదా మమ.

అర. 313 అ. 8 శ్లో.

అహింసాదులు తన్నుపొందు ద్వారములు, అనఁగా నుపాయములు. అహింసాదులు లేకున్న ధర్మలబ్ధి దుర్లభముగాని, ఎట్లు మరణించినను యమదర్శనము తప్పదుగదా! ధర్ముఁడు చేసికొన్న యీస్వరూపవర్ణనమును, ఆయరణ్యపర్వమునం దేయున్నట్టి సావిత్రీకృతయమ వర్ణనమును పోల్చిచూడుఁడు, ఈవిశేషణము లేమైనవచటఁ గనపడు నేమో?

ఈయతఁడే 'విదురో౽పిను మాంశజః' అనినవాఁడు. వ్యాసుఁడును ఆశ్రమవాసపర్వమున విదురప్రకృతి ధర్ముఁడని. అతని కుపయోగించిన విశేషణములు యమునకుఁ జెల్లవు.

ఖ్యాతా తవ మహారాజ దేవ దేవస్సనాతనః
ధారణాన్మ నసాధ్యానా ద్యం ధర్మం కవయోవిదుః.

ఆశ్ర. 28 అ. 16 శ్లో.

ఏదేవదేవుని సనాతనుని ధర్ముని విద్వాంసులు, మనస్సుచేత ధారణచేసి ధ్యానముచే నెఱిఁగికొను చున్నారో, ఆతఁడునీసోదరుఁడు. మహారాజా! విద్వాంసులు ధ్యానధారణములు యముని గూర్చియేనా చేయుచున్నారు ? నారాయణపరరూపమైన ధర్మునా ?

యథావహ్నిర్య థావాయు ర్యథాపఃపృథివీయథా
యథాకాశం తథాధర్మ ఇహచాముత్రచ స్థితః.

ఆశ్ర. 28 అ. 19 శ్లో.

పంచభూతములవలె ధర్ముఁడు ఇహలోకమునను ఆముష్మికలోకములందును ఉన్నాఁడు. దేవతలందొక్కఁడైనయముని 'అముత్రచ స్థితః' అనఁజెల్లునా ? ధర్మము నారాయణుని అంగమని వేదాంతశాస్త్రము బోధించుచున్నది. యముఁడు కాలధర్మమునకు లోఁగువాఁడే కాని, తదతీవనారాయణాంగ రూపధర్మఁడు శాశ్వతుఁడు. అందుకే ధర్మని భారతము 'దేవదేవః సనాతనః' అనివర్ణించియున్నది. యమదేవుని సనాతనుఁడనుట యెంతసొంపు ?

సత్యేన సంవర్ధయతియో ద మేన శమేనచ
అహింసయాచ దానేన తప్యమాన స్సనాతనః.

ఆశ్ర. 28 అ17. శ్లో.

ఇదియు అఘట్టమే. సత్యదమశమా హింసాదానములచే నెవఁడు పెరుగుచున్నాఁడో, తపస్సునకు లక్ష్యమగుచున్నాఁడో, ఆసనాతనుఁడు ధర్మదేవుఁడందమా ?యముఁడందమా ?

సర్వగశ్చైవరాజేంద్ర సర్వం వ్యాప్యచరాచరమ్
దృశ్యతే దేవదేవైః స సిద్ధైర్నిర్ముక్త కిల్బిషైః

ఆశ్ర. 28. అ. 20 శ్లో.

పాపము పోయిన సిద్ధులు దేవదేవులు, సర్వత్ర చరాచరమును సర్వమును వ్యాపించియున్న ధర్ముని చూచుచున్నారు. ఈ ధర్మశబ్దమునకు యముఁడని యర్థము చెప్పుట ఆ పాపరహితులను ఆ సిద్ధులను ఆ దేవదేవులను అన్యాయము చేయుట. శకుంతలోపాఖ్యానమున ఆ నన్నయ్యయే చెప్పుచున్నాఁడు.

విమలయశోనిధీ ! పురుషవృత్తి మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును పంచ భూతములు ధర్మువు సంధ్యయు నంతరాత్మయున్
యముఁడును చంద్రసూర్యులును ... ... అని యమధర్ములకు భిన్నత్వమునే చెప్పుచున్నది గాని యైక్యమును ప్రతిపాదించుటలేదు.

మాండవ్య శాపకథయును, విదురుఁడుగాఁ బుట్టిన ధర్మువు యమేతరుఁడనియే స్థిరీకరించును. బాల్యమున మాండవ్యుఁడు తూనీఁగల బాధించెను. దానికి ఫలము అతని జీవితకాలమందే యాతఁడనుభవించెను. యమునధికారము మరణానంతరముగాని రాదుగదా! జీవితకాల ఫల నిర్ణీత ధర్ముఁడుగాని యముఁడు కాఁడు గదా!

మాండవ్యుఁడు శిక్షానుభవానంతరము 'స గత్వా సదనం విప్రో, ధర్మస్య' అతఁడు ధర్ము నింటికి పోయినాఁడు. ఆ మాండవ్యుఁడు.

అతితపసా విజిగ్యే లోకాన్ పరై ర్దుర్లభాన్'

ఇతరులకు దుర్లభమైన లోకములను గెలుచుకొన్నవాఁడు ధర్ముని సదనమూర్ధ్వ లోకమున నుండునది. అచటికిఁ బోయినవాఁడు గాని, అధోలోకస్థితమగు యముని సదనమునకుఁ బోయియుండఁడు గదా!

శునకరూపమున మహాప్రస్థాన కాలమున యుధిష్ఠిరాదుల ననుసరించినది యముఁడని యెవరును చెప్పుటలేదు. ఆయన ధర్ముఁడు. తానే యక్షరూపమున మున్ను పరీక్షించినాననును.

స్వర్గారోహణ పర్వమున ధర్మరాజు నరకమును దర్శించుట

కలదు. అక్కడ యముని దర్శించినట్టు లేభారతమును జెప్పదు. వారిలో ధర్ముఁడొకఁడు. ధర్మరాజు,

'జగామ సహధర్మేణ సర్వైశ్చ త్రిదివాలయైః'

దేవతలతోఁ గూడిపోయినది, త్రిదివమునకుఁ గాని, యమస్థానమైన నరకమునకుఁ గాదు కదా! మఱినరకమునుండియేకదా తరలుచున్నాఁడు. మహాభారతవీరులు నిర్యాణానంతరము, తముఁగన్న దేవతల చెంతకేఁ లీనమైనారని, భారతమే చెప్పుచున్నది. విదురుఁడు ధర్మజునియందు లీనమైనాఁడు సరియే. ఏకాంశజులు కావున ధర్మజుఁడు కడపట శరీరముతో పోయినది స్వర్గమునకుఁ గాని నరకమునకుఁగాదు కదా! నరకమును చూచుటయు మాయామాత్రమే యని ధర్ముఁడే చెప్పియున్నాఁడు. ధర్మరాజు తండ్రి యముఁడయ్యెనేని, ధర్మజుఁడు యమునికడకేపోయి, ఆతనిలోనే లీనమైయుండవలెను. ఇదియును ధర్మజుని తండ్రి ధర్మదేవత యనియే వెల్లడిచేయుచున్నది. కావుననే యాతఁడు ధర్మునితోఁ గూడి స్వర్గమునకుఁ బోయినాఁడు గాని, యమునితోఁ గూడి నరకాలయుఁడు కాలేదు.

పితృగుణములు సంతానమున కనఁబడు నను సూత్రమున్నది గదా! మహాభారత వీరులు తండ్రిగుణములతోఁ బుట్టిన వారు గాని తద్విరుద్ధగుణములతోఁ బుట్టినవారుగారు. సంభవపర్వ మట్లనే చెప్పుచున్నది. మఱి ధర్మజుని శీలము విదురుని శీలము పరికింపుఁడు. వారి శీలములు అపరాధనివారణైక పరములగు సత్సంకల్ప ప్రబోధన సత్కర్మ నిర్వాహకములుగాని, అపరాధ శిక్షారూపదండనశీలములు గావు. వారి స్వభావములు ధర్మదేవతా స్వభావములే గాని, దండధారియగు యమస్వభావములు గాకుండుటయే వారియమజన్యత్వమును పరిహరించుచున్నది.

గ్రంథస్వీకారము; సమీక్ష

(శ్రీ బండారు తమ్మయ్య)

1. ఆంధ్ర సేవకులు :- క్రౌను పుటలు 86+4 వెల రు 1-0-0 కర్త :- ఉభయభాషాప్రవీణ శ్రీ శాస్త్రి వేంకట నరసయ్యగారు ప్రధానాంధ్రోపధ్యాయులు చిలకలూరుపేట, ఉన్నత పాఠశాల-ప్రకాశకులు-భారతీసమితి పామర్రు కృష్ణాజిల్లా.

దేశసేవకులు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు, మాగంటి అన్నపూర్ణాదేవి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కోడి రామమూర్తినాయఁడు కట్టమంచి రామలింగారెడ్డి యనువారి జీవితచరిత్రము లిందు వర్ణితములయినవి. ఇందు మొదటి నలువుర చరిత్రముల నింతకుమున్న "ఆంధ్రసేవా కథలు" అను పేరిటో సంగ్రహముగ రచించి వీరే ప్రకటించియున్నారు. ఆ గ్రంథసమీక్ష యిందు వెనుకటి సంచికలలోఁ గావింపఁబడినది. మహామేధావి, విద్యానిధియగు శ్రీరామలింగారెడ్డిగారి జీవితము గూడ నిప్పుడధికముగా నిందు వర్ణితమయినది. ఇందలి మహాపురుషుల జీవితము లాంధ్రావనికిఁ జిరవిశ్రుతములయినవి. అవి విద్యార్థుల కుత్తేజకరములుగ నిందుఁ జిత్రితములయినవి. విద్యార్థులకిది యవశ్య పఠనీయము. గ్రంథారంభమున బంకించంద్రరవీంద్రులజాతీయ గీతములు, నరసయ్యగారు రచించిన కొన్ని ప్రార్థనాశ్లోకములు, కోగంటి దుర్గా మల్లికార్జునరావుగారు రచించిన కవి జీవిత సంగ్రహము కూడ నిందుఁ గలవు.

2. సాహిత్య చంద్రిక :- క్రౌను పుటలు 20 వెల 0-4-0

3. వ్యుత్పత్త్యర్థ రత్నాకరము ... 20 వెల 0-4-0

4. అభినవ పోతన మంగిపూడి వేంకటశర్మగారి జీవితచరిత్రము మొదటి భాగము క్రౌను పుటలు 84+4 వెల 1-0-0

డిటో రెండవ భాగము క్రౌను పుటలు 86+4 వెల 1-0-0

కర్త :- శ్రీ విద్వాన్ కోగంటి దుర్గా మల్లికార్జునరావుగారు

నివృత్త ప్రధానాంధ్రోపాధ్యాయులు, పామఱ్ఱు ఉన్నత పాఠశాల, కృష్ణాజిల్లా గ్రంథకర్త భాషాసేవకులుగా నాంధ్రదేశమునఁ జిరప్రశస్తి గన్నవారు మల్లికార్జునకవి నామకద్వయములోఁ బ్రథములు ప్రస్తుతము గుడివాడ పట్టణ మాధ్యమిక పాఠశాలలోఁ బండితులుగాఁ బని చేయుచున్నారు 2, 3 పాఠశాలా విద్యార్థుల యుపయోగమునకయి రచితములయిన చిన్న పొత్తములు. మొదటి దానిలో నొకపదమునకు సమానార్థకములగు భిన్నరూపక పర్యాయ శబ్దములొకచోఁ జూపఁబడినవి. ఉదాహరణము, పద్మమునకు నీరజాతము: తోయ జాతము వారి జాతము, అంబుజాతము, జలజాతము, అంభోజాతము, తొలిపలుకులో గుంటూరు హిందూకాలేజీ. ప్రధానాంధ్రోపన్యాసకులు శ్రీ మందలపాటి ఉపేంద్రశర్మగారు విద్యార్థులకు దీనివలనఁగలుగు లాభమునువివరించిరి. రెండవదానిలో అకారాదిగఁ గొన్ని శబ్దములుగూర్చి వానికి వ్యుత్పత్త్యర్థములుదాహృతములయినవి. ఉదాహరణము: అంపకాఁడు=అమ్ముగలవాఁడు=విలుకాఁడు, అంబుజము=నీటియందుఁబుట్టినది=పద్మము. శ్రీ వెంపటి పురుషోత్తముగారి తొలిపలుకిందుఁగలదు కవిగారు కొన్ని భాగములుగాఁ బ్రకటించుచున్న శబ్దోత్పత్తి శతకములకిది ప్రాతిపదికగాఁ గాననగును. ఉన్నతపాఠశాలా విద్యార్థులకివి యుపయోగకరములని చెప్పనవసరము లేదు.

4. 5:-మంగిపూడి వేంకటశర్మగారు ఆంధ్రులకుఁ జిరపరిచితుఁడయిన సంఘసంస్కార ప్రియుఁడయిన జాతీయకవి. గాంధియుద్యమము భారతదేశమునఁ బ్రారంభమగుటకుముందే పెక్కువత్సరములుగ మేలుకొలుపుపాటలు, జోలపాటలు, లాలిపాటలు, తుమ్మెదపదములు, పంచమవిలాపము, బాలవితంతు విలాపము, వందేమాతరశ్లోకములు, గోవిలాపము, నిరుద్ధభారతము, సరసరసాయనము, చమత్కారచంద్రిక మున్నగు గేయపద్యకృతుల నేకములు రచించి యాంధ్రులను దేశ

భక్తిని, సంఘసంస్కరణ, హరిజనోద్ధరణోద్యమములను కీర్తించిన ప్రచారకవి. 1923 సంవత్సరములోఁ బ్రారంభించిన భారతి మాసపత్రిక శర్మగారి గాంధిశతకములోనే ప్రారంభమయినది. స్వాతంత్ర్యప్రియత్వము, ఆత్మగౌరవాభినివేశము, అపరిగ్రహము, శర్మగారి కుగ్గుఁబాలతో నలవడిన సహజగుణములు. పేదఱికమును సహనముతో ననుభవించుటయే వారికిఁ బరిపాటి. పరాశ్రయమునగాని, పాఠశాలోపధ్యాయత్వమునగాని జీవన మొనరించుట వారికిష్టము లేదు. ఈవిషయముననే యభినవపోతనబిరుదము వారియెడ సార్థకమయినది. దుర్గా మల్లికార్జునరావుగారు శర్మగారి మిత్రకోటిలోనివారు. పెక్కువిషయములు శర్మగారివలన స్వయముగాఁ దెలిసికొని వారిజీవితకాలముననే 1948, 1949 సంవత్సరములలో నీగ్రంథముల రచించి ప్రకటించిరి. శర్మగారి శీలమును దృష్టాంతపూర్వకముగ నిరూపించు ఘట్టములెన్నియో యిందుదాహృతములయినవి. వారి గేయపద్యరచనములనుండికొన్ని భాగములుగూడ నందందుఁగూర్పఁబడినవి. ఆంధ్రదేశాభిమానులు, భాషాభిమానులు నవశ్యము పఠింపఁదగినది శర్మగారిజీవితచరిత్రము. ఇది పునర్ముద్రణమంది విశేషప్రచారమందుఁగావుతమని యభిలషింతుము.

6. అప్సరస-(గేయనాటికల సంపుటి):-క్రౌను పుటలు 72+8 వెల 1-0-0

7. ఉపనిషత్తు:-వివిధ విషయక గేయములు క్రౌను పుటలు 64 వెల 1-0-0

కర్త:-డాక్టరు యస్వీ జోగారావుగారు ఎం. ఏ., పి. హెచ్. డి. ఆంధ్రవిశ్వవిద్యాలయ కళాశాలాంధ్రభాషోపన్యాసకులు. ప్రకాశకులు విశ్వసాహిత్యమాల రాజమండ్రి. శ్రీ జోగారావుగారు ఆంధ్రమండలి యక్షగాన వాఙ్మయమునుగూర్చి విశేషపరిశోధన మొనర్చి ఆంధ్రవిశ్వవిద్యాలయమువారివలన డాక్టరేటు పదవినొందినవారు. తత్సంబంధిక

మయిన వారి Thesis విశ్వవిద్యాలయ పక్షమున గ్రంథరూపకముగఁ బ్రకటితమయినది. ప్రకృతకృతులు వీరి గేయ రచనాభినివేశమునకు దర్శకములు. "అప్సరస"లో అప్సరస, సుమబాణము, సాక్షాత్కారము అవిముక్తము అను నాలుగు గేయనాటికలు గలవు. ఇవి వరుసగా సంగీతకళాప్రియులగు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, డాక్టరు పి. వి. రాజమన్నారు, రాజా మేకా రంగయ్యప్పారావు, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారలకు గౌరవపూర్వకముగ సంకేతమొనర్పఁబడినవి. మాణిభద్రుఁడను మహారాజు వాహ్యాళి కేఁగినపుడు కామినియను జక్కుల పురంధ్రిపుర బాహ్యప్రదేశమున మురళీధరుఁడను నాస్థానకవి రచించిన యక్షగానకృతిని గవినామమును నెఱుంగకయే పదకేళికపద్ధతిగా నభినయింప నభ్యాసము గావించుచుండుటగాంచి సంతసించి యామెఁ దనయాస్థానమునఁ జేర్చికొనుట, రాజున కామెయెడ మోహ మంకురించుట, తానభినయించిన కృతి రచించినది యాస్థానకవిమురళీధరుఁడేయని యెఱింగియా జక్కులపురంధ్రి యాతనియెడ నామె యొక నక్కఱయు ననురాగబద్ధులగుట, ముసలాయుధుఁడ మఱొక యాస్థానకవి కుతంత్రమువలన నీవిషయ మెఱింగి మోహావేశుఁడయిన రాజీర్ష్యాసూయలకు వశ్యుఁడయి మురళీధరునకు మరణదండనము విధించుట, కామినిప్రార్థనమువలనఁ బశ్చాత్తాపమొంది రాజు తనయవివేకమును గ్రహించి మురళీధరునకు విధించిన మరణదండనమును రద్దుగావించిన వార్త తెలియకమున్నే రాజభటులు మురళీధరుని వధించి యాతని కనులుగొనివచ్చి రాజునెదుట నుంచఁగా రాజును గామినియు దుఃఖాక్రాంతులయి నిలువునఁ గూలిపోవుట యను విషాదవృత్తముతో అప్సరస రచితమయినది. సుమబాణమునందలి యితివృత్తము విప్రనారాయణుఁడు (తొండరిప్పొడియాళ్వారు) దేవదేవియను వేశ్యకు మన్మథుని సుమబాణ ప్రహారమున వశ్యుఁడగుట. ఒకకవికి శిల్పికి వేర్వేఱులక్ష్య

ములతో వారుపాసించు నూహాసుందరి, శిల్పసుందరి యేకమూర్తియై వారి యున్మాదావస్థలో సాక్షాత్కరించుట సాక్షాత్కారకృతియం దలివృత్తము. తనయూహాగానములు కార్యరూపముగ ఫలోన్ముఖము లుగాకమున్నే యకాలమరణము నొందిన యొకకవియొక్క కంకాళ మొకరేయినాతని సమాధికడ వివిధభావములతో వికటతాండవ మొనర్చుట ప్రధానవృత్తముగాఁగలది "అవిముక్తము". మనఃశాంతి, సంధ్యాదేవి, భగ్నమైన కవిమనస్సునుండి వెడలినయూహావిహంగము, ఈహామృగము, స్వప్నాశ్వము, ప్రణయదేవత, కవితాధ్వజమునందలి యితర పాత్రములు, ఇవి యెల్లఁగంకాళముయొక్క కృత్యములను, నృత్యములను గేలిచేసినట్టులు దానిచుట్టు గెంతుచు, పాటలుపాడుచు నంతర్ధానమొందఁగానది యాకసమువంక చూపు నిగిడ్చి సమాధివైపు సాష్టాంగ మెరగును. నేపథ్యమున సంధ్యాదేవి "మరణము వచనములుగా కాదు కాదు జీవితచరమావధి మనోలయము. మరణముకాదు కాదపవర్గపరమావధి మనోలయము, మనోలయము" అనువాక్యము వినఁబడగా జాలిగా తెరపడును, అనుటతో నాటిక సమాప్తమయినది. ఈనాటికలు నాల్గుగూడ నపూర్వవిధానమున మృదుమధురభావములతో చాలవఱకు సరసమయిన గ్రాంథికశైలిలో రచింపఁబడినవి. కవి యీనూతనోద్యమము నభినందించుచున్నాము. ఆంధ్రవిశ్వవిద్యాలయము రిజస్ట్రారు, ఆచార్య కూర్మా వేణుగోపాలస్వామిగారు తాము గ్రంథమున కవతారికగా రచించిన భూమికలో పాశ్చాత్యదేశములందలి యక్షగానపుఁబెన్నులుగూర్చి ప్రసంగించుచు పాశ్చాత్యులలో Opera ప్రభావము నెల్లెడల వ్యాపించినదని చెప్పి, ఆంధ్రమున ఉన్నతస్థాయిలో గేయరచనలు సాగి ప్రదర్శితములు కావలసిన యావశ్యకతను హెచ్చరించినారు.

మచ్చునకు కొన్ని గేయములు.

అప్సరసనుండి:-మురళీధరుడు "స్వామి తావకజన్మమిది. మదుపజ్ఞమిది మధురకావ్యము అప్సరసయను యక్షగానము అంకితంబిది స్వామికిన్.

రాజు:-మహాప్రసాద మహామహాకవీంద్ర మురళీధర ! మను మనేకవసంతములు మధురకావ్య కలస్వనము లాలపించు కోయిలవై

సుమబాణమునుండి:-విప్రనారాయణుడు ప్రకృతి సర్వస్వమ్మె భగవత్ప్రసాదమ్మె, అందులో ప్రత్యణువు నతని ప్రసాదమ్మె పూవులేకాదు, కాయలేకాదు. మొగ్గలేకాదు, మొలకలేకాదు, పూవులో తావి, కాయలో చవియు మొగ్గలోపలిముద్దు, మొలకక్రిందటిదుంప, సర్వమూ స్వామిసంతానమ్మె సర్వమూస్వామి సంసారమ్మె.

7. ఉపనిషత్తు; నివేదన, అద్యావధి, చూపు, ప్రతీక :- అంతర్యామి, జగద్గీత సముద్రము మున్నగు సాభిప్రాయనామకములగు 27 శీర్షికలతో నిందలి రచనములు కూర్పఁబడినవి "భావితాంతః కరణసేవాత్మను పరమాత్మనుచేసే విశ్వవ్యాప్తమైన కవితాత్మకు" అంకితము గావింపఁబడినది. అద్యావధి,నిశ్వాసము సీసపద్యములలోను, చూపు, ఉత్పలమాలికావృత్తములలోను, అంతర్యామి మాత్రాగణబద్ధమగు రగడలోను, అవిముక్తముపద్యములలోను రచితమైనవి. తక్కినవన్ని గేయములు. అప్సరసయందలి సుమబాణములోని గేయములలో కొన్ని యిందు సుమసూక్తములు అనుశీర్షికక్రిందను, అవిముక్తమునందలి గేయములుకొన్ని "అంతర్వాణి"యను శీర్షికక్రిందను జేరినవి. "ప్రయాగ"అనుశీర్షికక్రింద వాల్మీకిరామాయణము, వ్యాసకృత భారత భాగవతములు, భారతీయ వాఙ్మయమందలి త్రివేణిసంగమములుగా మనోహరముగ నిరూపితములయినవి. పెక్కు విషయములు ఉపనిషత్ప్రతిపాదితములగు నాధ్యాత్మిక సత్యములతోఁ బ్రతిపాదితములవుటచే దీనికి ఉపనిషత్తు అని నామకరణము గావింపఁబడినట్లు తోఁచుచున్నది.

రచనమంతటను హృదయంగమముగా నలరారుచున్నది. వినూత్న విధానమున నీకృతిని వెలయించినందుకుఁ గవినభినందించుచున్నాము.

8. శ్రీమదాంధ్ర భాగవతము (చతుర్థసంపుటము) దశమ స్కంధము రాయలుసైజు పుటలు 355 పద్యసంఖ్య 3125 వెల 5-0-0

9. శ్రీరామ నృసింహమూర్తి కవుల చాటువులు డెమ్మీ పుటలు 20 వెల 0-8-0

10. శ్రీ వేమగీతా ప్రథమసహస్రము ప్రథమభాగము క్రౌను పుటలు 168, 18 వెల రు 3-0-0

11. తేటగీత-భగవద్గీత:-పోకెట్టుసైజు పుటలు 292+8 వెల రు 2-0-0

ప్రకాశకులు : శ్రీరామ నృసింహ గ్రంథరత్నమాల ఉప్పులూరు, పశ్చిమగోదావరిజిల్లా.

కృతికర్తలు:-శతావధానులు, ఉభయభాషాప్రవీణులు,గద్వాల సంస్థానాస్థానకవులు శ్రీరామ నృసింహమూర్తి కవులు అను శ్రీ గంధము శ్రీరామమూర్తి, ఇట్టింక నరసింహమూర్తిగారలు.

12. సంస్కృతమున వ్యాసమహర్షి రచించిన భాగవతపురాణము కావ్యముగ గాక తత్త్వశాస్త్రగ్రంథముగ నెక్కువగఁ బ్రసిద్ధిగాంచియున్నది. దానికి భక్తాగ్రేసరుఁడు బమ్మెరపోతనామాత్యుని యనువాదమయిన యాంధ్రమహాభాగవత మాంధ్రదేశమున సుప్రసిద్ధమయియుండుట సర్వవిదితము. ఆంధ్రమహాజనులకుఁ బోతనగ్రంథము నెడలఁ గల గౌరవమపారమయినది. అయినను భాగవతము నితరులుకూడ నాంధ్రీకరింపమాన లేదు. భారతాంధ్రీకరణము గావించిన కీ॥ శే॥ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు రామాయణ, భాగవతాంధ్రీ కరణములు గూడఁ గావించియున్నారు.ప్రకృతగ్రంథకర్తలు శ్రీరామనృసింహమూర్తి కవులుగూడ మరల నీభాగవతాంధ్రీకరణమునకుఁ బూనుకొని సమర్థ

తతో నిర్వహించి 1. 2. 3 స్కంధములు ప్రథమసంపుటముగను,
4,5,6 స్కంధములు ద్వితీయ సంపుటముగను,6, 8, 9 స్కంధములు
తృతీయసంపుటముగను, దశమ స్కంధము చతుర్థ సంపుటముగను, 11
12 స్కంధములు పంచమ సంపుటముగను వెలువరించిరి. ప్రస్తుతము
మా సమీక్షకయి వచ్చినది చతుర్థ సంపుటమగు దశమస్కంధము
ఈ కవుల భాగవతానువాదోద్యమమునకుఁ గారణము వీరికిఁ బోత
నామాత్యుని గ్రంథము నెడ గౌరవము లేకుండుటగాదు. పోతనయను
వాదము న్యూనాతిరిక్తములుగలిగియథామూలముగ లేదనువిషయమే
తమయుద్యమమునకుఁ బ్రధానోపపత్తిగ వీరు పేర్కొను చున్నారు.
పోతనభక్త్యావేశముతోఁ బెక్కుఘట్టములను బెంచి వ్రాయుటచే నాంధ్ర
మహాభాగవత పద్యములసంఖ్య శ్లోకసంఖ్యకన్న హెచ్చుగాఁ బెరిగి
యున్నదనుట పలువురకు విశదమే. మూలశ్లోకములుపూర్తిగా ననూదిత
ములు కాని తావులుగూడఁ గొన్నియెడల లేకపోలేదు మఱియుఁ
తత్త్వవిషయక శ్లోకముల ననువదించుటలో పోతన శ్రీధరీయవ్యాఖ్యా
నుసారముగ వానిని గేవలాద్వైత పరములుగానే యనువదించినాఁడు
అట్లుగాక కేవలము మూలశ్లోకానుగుణముగనే యాతఁడు వాని నాం
గ్రీకరించినచో నితరమతముల వారికిఁగూడ నిజమతానుకూలముగ
వానినన్వయించుకొనెడి యవకాశముండెడిది, కనుక నీలోపములు నివా
రించుటకై యాకృతికర్తలు తమయనువాదమును గేవలము మూలశ్లో
కానుగుణముగనే రచించిచరితార్థులయిరి ఇదియేవీరియనువాద మందలి
ప్రత్యేకవిశిష్టత. ఇట్టి యుత్తమోద్దేశముతో రచితమయి సమగ్రముగ
వెలువడిన వీరి భాగవతానువాద మాంధ్రుల కెల్లముదావహమగుటకు
సందియము లేదు. ఆ విషయమును వీరియనువాదమును సావధానముగ
మూలముతోఁ బోల్చి చూచిన విద్వద్వరేణ్యులు పలువురు ప్రశంసించి
యున్నారు. ప్రతిస్కంధమునకు ముందుగా నందలి కథాసంగ్రహము

మూలశ్లోకానుగుణముగ వచనమున వ్రాసియుండుట పాఠకులకుఁ జాల లాభకరముగ నున్నది. ఈదశమస్కంధములో నది మొదట 14 పుటలలో వివరింపఁబడినది. మహామహోపాధ్యాయాదిక బహుబిరుదావళీవిరాజితులు. ఉభయ వేదాంతప్రవర్తకులు శ్రీమాన్ ముడుంబై కృష్ణమాచార్యులుగారు గ్రంథారంభమున 8 పుటలలోఁ బ్రకటించిన సమీక్షలో పోతన న్యూనాతిరిక్తములు నయ్యెడల నీకవివరుల మూలానుగుణానువాదములు స్థాలీపులాకన్యాయముగఁ బ్రదర్శితమయియున్నవి. "ఉపజ్ఞతోఁ గూడిన పాండిత్యము, ప్రతిభ, భాష, భావము, సహజ సంస్కరణము వీరియందుగల్గుటచే నిట్టి మహత్తరోద్గ్రంథరచనకుఁ బూనుకొని వీరు చరితార్థులు కాఁగలిగిరి." అను శ్రీమాచార్యులుగారి యభిప్రాయముతో మేము నేకీభవించుచున్నాము. శైలి ధారాళమయి, మృదుమధుర పదబంధురమయి మనోజ్ఞముగ వెలయుచున్నదని గ్రంథ మేపట్టునఁ జదివినను వ్యక్తమగుచున్నది. మచ్చునకుఁ గొన్ని పద్యములు (భ్రమరగీతలనుండి)

శా. ఏలానీవు పురాణు నయ్యదుపతిన్ హేరాళవాఙ్భంగి మా
మ్రోలన్ గానముఁ జేయుచుంటివిఁ కఁజాల్ రూపింప విన్పింపుగా
నాలాపంబు ముకుందు ప్రేయసులకున్ వారిత్తురి నీకిష్టముల్
రోలంబా! పరికింపవారు క్షుపితోరోజవ్యథల్ కావునన్.(ప 1552)

ఉ. వాలినిద్రుంచెఁ గ్రౌర్యమున వ్యాధునిభంగివిరూపఁజేసె శ్రీ
లాలసుఁడై స్మరార్తనబలన్ బలిఁగట్టిబలిన్ భుజించి కా
కోలమురీతిఁ దోఁపగ ముకుందునితోడి సఖిత్వవైఖరుల్
జాలునకైననున్ విడువఁజాలనివయ్యెడుఁ దత్కథాసుధల్ (ప1555)

చ. కెలనను వ్యాధగీతివిని కృష్ణవధూటులు, లేఁడిబోటు లి
మ్ములనిజమంచునెంచి వ్యథఁ బొందెడురీతిగఁ గృష్ణుఛద్మవా
క్కులు బుతమంచు నమ్మి మరుకోలలకున్ గుఱియైతిమింక న
న్పలుకులు చెప్పఁబోకు మధుపా! తగవాకొను మన్యవార్తలన్
(ప 1557)

అన్నిపద్యములముందునవి యెవరి వాక్యములో శ్రీశుకుఁడు, రాజు, ఉద్ధవుఁడు గోపికలు, ఇత్యాదిగాఁ బేర్కొనుట యొకవిశేషము. ఆంధ్రలోకము వీరి భాగవతమునకు సుస్వాగత మొసంగుఁగావుతమని యభిలషింతుము.

9. ఈకవులన్యాపదేశములుగను బ్రాస్తావికములుగను నప్పుడప్పుడు చెప్పినచాటువులు సుమారు 1000 వఱకుఁగలవని తెలియుచున్నది. వానిలో 100 పద్యములు మాత్రి మొకభాగముగా నిదుఁ బ్రకటితమయినవి. ఇవికూడ వీరి మధురశైలికి, గుణబంధురతకు నాదర్శములుగనున్నవి. మచ్చునకొండు రెండు.

సముద్రము (ఆర్భాటము)

చ॥ అకట ! మహాంబురాశివి గదాయని భ్రాంతిని బూనికప్పిదీఁ
ర్చికొనుతలంపు తోదరికిఁ జేరఁ బిపాసితుఁడైనఅందువా !
నికిఁ గొనుమంచు నీవొసఁగ నేరవు గ్రుక్కెడుమంచినీరువీ !
చికల సమార్భటిన్ జెవరఁజేసి వెలార్తువుగాని సాగరా! (ప32)

శ్మశానము (సమైక్యము)

ఉ॥ ఎందఱిఁ బండితోత్తముల నెందఱ సత్కవి రాజకోటినిం
కెందఱ రాజచంద్రముల నెందఱనన్యుల గర్భగోళకం !
బందునిముద్దు కొంటివహహా: మసనంబ: ధరిత్రిలోనివా
రందఱు నెన్నఁడేనవశులై నినుఁ జేరుట తథ్యమేకదా: (క.76)

10. ఆంధ్రులలో వేమనపద్యములు కొన్నియైనఁ గంఠస్థములు కానివారుండఁజాలరు అట్టిజాతీయకవి శేఖరుఁడు వేమనయోగి. ఇతని పద్యములలోఁ గొన్నిటికిఁ బాశ్చాత్య పండిత ప్రకాండుడు శ్రీ బ్రౌనుదొరగారు తమయాంగ్లానువాదమును జిరకాలముక్రిందటనే ప్రకటించియుండుట పలువురకెఱుకపడిన విషయమే. వేమనకవితకు ఖండఖండాంతరవ్యాప్తిగలిగించునుద్దేశముతో నీకవిద్వయము వేమన పద్యములను గీర్వాణభాషానువాదముతోను, ఆంగ్లానువాదముతోడను గూడఁగలిపి ప్రకటించుటకుద్యమించినారు. వీరియుద్దేశము శ్లాఘ

నీయమనుట నిర్వివాదము. ప్రథమ సహస్రములో 500 పద్యముల యనువాదముతో నీ ప్రథమభాగము వెలువడినది. నైతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక, సాంసారిక, ఆధ్యాత్మికవిభాగములని యిందలిపద్యములు 6 భాగములుగా విభక్తమయినవి. తెలుగుపద్యములు, సంస్కృత శ్లోకములుగూడ దేవనాగరిలో ముద్రితమయినవి, మచ్చునకుఁగొన్ని యుదాహరింతుము.

1. గీ॥ ఇంటిసూలివిడిచి యిలజారకాంతల । వెంటఁదిరుగువాఁడు వెఱ్ఱివాఁడు పంటచేనువిడిచి పరిగెయేఱినయట్లు । విశ్వదాభిరామ వినురవేమ (ప 35)

శ్లో॥ విహాయగృహిణీంవేమః జారకాంతాసు యోరతః ।
సస్యాత్ సస్యంపరిత్యజ్య । ఉంఛగ్రాహీవ భగ్నధీః ।

2. గీ॥ కలిగి ధర్మమీయఁగా ననివారును । కలిగి తినకచాలఁగ్రాగువారు కలిమి నెచటఁజూడఁగానక చెడెదరు।విశ్వదాభిరామ వినురవేమ (514)

శ్లో॥ గీ. సదాస్యంతిన భుంజంతి పైశున్యాద్ధనినోయది ।
అపశ్యన్నశ్రియంవేమ ! నశ్యన్త్యుత్తరజన్మసు.

గీ॥ శివుఁడు గలడటంచు శిలలఁ మ్రొక్కలనువేఁడు । వెఱ్ఱిజీవులార వెతల విడుఁడి జీవులందె కాక శిలలనేమున్నది । విశ్వదాభిరామ వినురవేమ. (ప 176)

శ్లో॥ శివోస్తీతి శిలాంవేమ! । నమస్యన్తేజనాజనాః
శివోజీవేషు చైవాస్తి నశిలాసుకనాచన.

బ్రౌనుదొరగారి యాంగ్లానువాదము లేని పద్యములకు శ్రీయుత కె.నరసింహరాజుగారి యనువాదము చేర్చఁబడినది.విజ్ఞప్తిఃవేమనజీవితసంగ్రహః । సాహితీ తద్వ్యాప్తిశ్చ అనిగ్రంథకర్తలు సంస్కృతమున వ్రాసినలేఖలు వానికి An appeal Vemana's Life, Teachings and Literature అని శ్రీ నరసింహరాజుగారు వానికి గావిం

చిన యాంగ్లానువాదములు. ఆదరోక్తిః అని శ్రీ విజయనగరము మహారాజా సంస్కృత కళాశాలోపన్యాసకులు శ్రీ ఐ. నారాయణ స్వామి B. A. గారు సంస్కృతమున నొసంగిన యభిప్రాయము గ్రంథారంభమునఁ గలవు.

11. శ్రీమద్భగవద్గీత కాంధ్రీకరణము లసంఖ్యాకములుగ నిదివఱకే వెలువడియున్నవి. ఈకవి వర్యులు గూడఁ దమ యభినివేశముతో బూర్వ గీత 18 అధ్యాయములను, ఉత్తర గీత 3 అధ్యాయములను గూడఁ దేటగీతులలో ననువదించి ప్రకటించినారు. పేరికను గుణముగ వీరి గీత తేట తెల్లముగ మూలశ్లోకములు పాఠకులకు సులభముగ బోధపడునట్లున్నది. అడుగున మూలశ్లోకములు చిన్న యచ్చున ముద్రితమయి మీఁదను బద్యములు పెద్ద యచ్చున ముద్రితమయినవి. ఆంధ్రులకెల్ల వీరి యనువాదమాదరణీయము కాఁగలదని యాశించుచున్నాము. కృతికర్తల విజ్ఞప్తి, శ్రీ కె. శ్రీరామమూర్తి B. A. గారి సమీక్ష గ్రంథారంభమునఁ గలవు. మచ్చునకుఁ గొన్ని పద్యములు.

గీ॥ తాన్మతలిస్వనుష్ఠిత పరధర్మమ్ము కంటె నవగుణంబయ్యును స్వధర్మ
మదియె మేలు, నెమ్మెయి స్వధర్మమున నిధనమ్ము శ్రేయ మన్య
ధర్మము మిగుల భయావహంబు (కర్మయోగము ప. 35)

గీ॥ ఏజను లనన్యులై స్మరియించుచు నను బర్యుపాసన మొనరించు
వారగుదురో అర్జునా నిత్యమభియుక్తులైన వారి యోగమున్!
క్షేమము వహించుచుందు నేను (అధ్యాయము ప. 22)

గీ॥ నేను బ్రహ్మము ననుచు ధ్యానింపవలెనో కష్టుఁడేనియు నన్ను
నేకాగ్రబుద్ధి కల్పకోటి శతార్జితాఘంబులెల్ల నాతఁడు క్షణంబు
లోనఁ బాయంగలండు (ఉ॥ గీ॥ అ 2. ప. 35)

పయి 4 గ్రంథములు వలయువారు మేనేజరు, శ్రీరామ నృసింహా గ్రంథరత్నమాల, తోలేరు వీరవాసరము పోస్టు పశ్చిమగోదావరి జిల్లా అని వ్రాసినఁ బడయఁగలరు.

12. హర్షవర్ధనుఁడు :- క్రౌను పుటలు 158+20 కర్త :-

శ్రీకిడాంబి రాఘవాచార్యులుగారు B. A. B.L. అడ్వొకేటు కాకినాడ ప్రకాశకులు శాస్త్రవిజ్ఞానము చరిత్ర తెలుఁగు ఉర్దు అకాడమి హైదరాబాదు. వెల రు 3-0-0

హర్షవర్ధనుఁడు కనోజీపట్టణము (కన్యాకుబ్జనగరము) రాజధానిగా ఉత్తరాపథస్వామి యను బిరుదము వడసి క్రీ. శ. 603–647 వఱకు దక్షిణమున వింధ్యపర్వతము ఉత్తరమున హిమాలయపర్వతము సరిహద్దులుగా సింధునదికి బంగాళాఖాతమునకు నడుమ నున్న భారతదేశమును బరిపాలించి విఖ్యాతిగన్న సార్వభౌముఁడు ఇతఁడు రాజనీతి విశారదుఁడు, పరాక్రమశాలియు నగు భూపాలుఁడే గాక స్వయముగఁ గవియుఁ(రత్నావళి, ప్రియదర్శిక నాగానంద నాటకకర్త) గవిపోషకుఁడునయి వన్నెకెక్కినవాఁడు. సంస్కృత కవులలో సుప్రసిద్ధులగు బాణమయూరాదు లీతని యాస్థానకవులు. బాణుఁడు గద్యకావ్యము గగణన కెక్కిన కాదంబరినే గాక హర్షచరిత్రమను పేర నీ రాజచంద్రుని చరిత్రమును గూడ గద్యమున రచించియున్నాఁడు. శ్రీ రాఘవాచార్యులుగారు బహుముఖ ప్రజ్ఞగల విద్వద్వరేణ్యులు. చిరకాలము ఆంధ్రసాహిత్య పరిషత్కార్యదర్శిగా, పరిషత్పత్రికా సంపాదకులుగా భాషాసేవ గావించి విశ్రుతి కెక్కినవారు. చీనాదేశ యాత్రికుఁడు హియోనుసాంగు హర్షవర్ధనుని కాలముననే మనదేశమును దర్శించి పదియేనువత్సరము లిటఁ బరిభ్రమించి యప్పటి మతసాంఘిక చరిత్రమును గ్రంథస్థ మొనరించిన విద్వాంసుఁడు. అతని గ్రంథమును, బాణుని హర్షచరిత్రమును, ప్రాచ్యపాశ్చాత్యపండితులు రచించిన చారిత్రక గ్రంథములను లెస్సగఁ బరిశీలించి శ్రీ రాఘవాచార్యులుగారు హర్షవర్ధన చరిత్రమును నాంధ్రమున సంతరించి, మాతాపితరుల కంకిత మొనరించి, విద్వల్లోకమున కధిక హర్ష మొనఁ గూర్చినారు. హర్షుని బాల్యము, రాజ్యాభిషేకము, దిగ్విజయములు, ఆనాఁటి రాజకీయ పరిస్థితులు, హర్షుని రాజ్యపాలనము, మతము మత

సభలు, విద్యాపోషణము;నాటక రచనము, ఆర్థిక సాంఘిక పరిస్థితులు, ఉపసంహారము అను నెనిమిది ప్రకరణములుగా బహు పరిశోధన పూర్వకముగ నీ గ్రంథము రచింపఁబడినది నాలందా విద్యాలయము, మధువనబన్స్ఖేరాశాసనములు, క్రీ. శ. 6. 7 శతాబ్దములనాటి రాజ వంశములు, ఉదాహృత గ్రంథముల శాసనములు అను నాలుగను బంధములు మిక్కిలి యుపయుక్తములయినవి. గూడఁ గ్రంథాంత మునఁ జేర్పఁబడినవి. చరిత్రజ్ఞులు అయ్యదేవర కాళేశ్వరరావుగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు రచించిన తొలిపలుకు, ఉపోద్ఘాతము గ్రంథమునకు ముఖాలంకరణములుగ నున్నవి. హర్షవర్ధనుని చరిత్రము నామూలాగ్రముగ నాంధ్రమునఁ దెలుపు గ్రంథములలో నిది యగ్రగణ్యమని చెప్పనవసరము లేదు. చరిత్రాభిమానుల కిది యవశ్య మాదరణీయము కృతికర్త పరిశ్రమ నెంతయు నభినందించు చున్నాము, గ్రంథరచనమున నెడ నెడ, ద్రుతములు, అచ్చులు నుండ వలసిన తావులలో యడాగమములు, ప్రీతి తెగ మున్నగు సమాసశబ్దములు ప్రమాదవశమున దొరలినవి. కొన్ని యెడల బూర్వప్రకరణములలోఁ జేర్పఁబడిన విషయములు తర్వాతి ప్రకరణములలోఁ బునరుక్తములయినవి. పునర్ముద్రణమున నిట్టివి సంస్కరింపఁ దగునని మనవి.

19. సిద్ధేశ్వరశతకము :- క్రౌను పుటలు 24 కర్త :- కీ॥ శే॥ శ్రీ వల్లూరి పల్లి నరసయ్య చౌదరిగారు, గుడ్లవల్లేరు.

కృతికర్త శ్రీ నరసయ్య చౌదరిగారు కీ॥ శే॥ చిల్లరిగె యోగానందకవి గారి ఛాత్రులై యాయన యొద్ద విద్యారంభ మొనర్చిన మూఁడవ వత్సరముననే మేధావియై కవితా రచనమునకుఁ దొడఁగి యీ శతకమును రచించినట్లు లిందు ముద్రితమయిన యోగానందకవి గారి తొలిపలుకు వలనఁ దెలియుచున్నవి. తరువాత నచిరకాలమున నిరువదేడవయేటనే కాలధర్మమొందుటచే నిది యాయన ప్రథమ కృతియుఁ జరమకృతియుఁ గూడ నైయుండునని తోఁచుచున్నవి. కవి

కిది ప్రథమ ప్రయత్నమయినను శతకశైలి ధారాళమైన నడక గలిగి భక్తిభావములతో నలరారుచున్నది. స్వల్పదోషము లందందుఁ గలవు. ఇది యింతకుమున్ను చిత్రాడలో శ్రీ చెలికాని లచ్చారావు గారిచేఁ బ్రకటింపఁబడిన శతక సంపుటము ద్వితీయ భాగములలో ముద్రితమయి మరలఁ గవిగారి మిత్రులు శ్రీ సూర్యనారాయణగారిచేఁ బునర్ముద్రణమందినది. మచ్చునకొకపద్యము.

మ. కరములోఁ మ్రొక్కి మదీయశక్తికొలఁదిన్ గంగాధిపా! యెప్పుడున్
వరభక్తింబదముల్ మదిన్నిలిపి నిన్వర్ణింపఁ బద్యావళిన్
నిరయంబాదు మునుంగుటల్దొరగినే నీపాద సేవారతిన్
వెర వేదీయిలఁకనాకుఁగాన కరుణన్ వీక్షింపుసిద్ధేశ్వరా!

మ. కలనైనన్ మఱవంగరానియొకడం కన్మ్రగ్గియున్మాఁడఁజం
చలమాయాపరివేష్టితుండనగుటన్ శంభో! నిను న్నిశ్చలున్
గొలువంగనేదరమేసికొనొ యనుచున్ గారాజ దివ్యార్చనన్
విలసస్థాతునిగానొనర్పుమజగ ద్విఖ్యాత! సిద్దేశ్వరా!

లలితస్మృతి :—క్రౌను పుటలు 182×8 వెల రు 2-0-0 ప్రకాశకులు శ్రీరాజయోగ సాధనాశ్రమము. ఆలమూరు తూర్పుగోదావరిజిల్లా ఇది లలితయను పేరుగలిగిన యొక జీవన్ముక్త యొక జీవిత గాథను వివరించుకృతి. ఈమె ప్రస్తుతము కాకినాడ మునిసిపలు ప్లానింగు ఆఫీసరుగానున్న మోరడక సత్యనారాయణగారికివారి సతి సరోజినీదేవికి లలితాదేవి యంశమున విరోధినామసంవత్సరఆశ్వయుజ శుద్ధాష్టమీ గురువారమున (29-9-49) విజయవాడలో నవరాత్రి దినములలోఁ బుత్రికయైజనించి యోగసాధనానుభవము లనేకములు గఁ చిన్నవయస్సునందే ప్రకటించి 29-1-60 తేదీని పదునొకండవయేటనే భౌతికశరీరమును విడనాడి జీవన్ముక్తయైనది. పాలుకాగుచున్న బొగ్గులకుంపటినుండి వెలువడిన మంటల వలన శరీరము దగ్ధమయి దక్షయజ్ఞ వాటిక జ్ఞానాగ్నిచే దగ్ధమైనను సతీదేవివలె నామె యవతారము చాలించినది. ఈమె జీవితవిధానమువలెనే నిర్యాణ విధానము గూడ నద్భుతావహము.

ఉత్తర హిందూస్థానమున హిమాలయ ప్రాంతమందలి రాజయోగుల గురుపరంపరకు జెందిన యొక మహావ్యక్తి శ్రీరామలాల్ ప్రభుజిగారు. వీరు స్వీయమునకు దామను గ్రహించిన రాజయోగదీక్షకు బడసిన శిష్యుల మూలమునను భరతఖండము నందంతట శక్తిపాతవిధానమునఁ బలువురను రాజయోగదీక్షితుల గావించి చరితార్థులఁ జేసిన మహాయోగి పుంగవులు. ఈ సంప్రదాయము బందు భౌతిక శరీరమును విడనాడిన తరువాతఁ గూడ శిష్యుల శరీరముల పయి నావహించి యనేకాద్భుత కృత్యములఁ బ్రకటించు చుందురు లలిత జనకులు శ్రీ సత్యనారాయణగారీ రామలాల్ ప్రభుజీ శిష్య ప్రశిష్యకోటికిఁ జెందినవారు ఆంధ్రదేశమున శ్రీ సత్యనారాయణ గారి తోపాటు శ్రీ వేదుల సత్యానందరావు, ఓరుగంటి నరసింహయోగి మున్నగు వారీ సంప్రదాయ ప్రచారమునకుఁ గృషి చేయుచున్నారు సత్యనారాయణ గారి పుత్రిక లలిత తండ్రి గారినుండియే యీ దీక్ష నొంది పూర్వజన్మవాసనా విశేషము ననేకశక్తులను బడసిన యొక యపూర్వవ్యక్తి విస్మయావహములగు నామె జీవిత గాథలనేకములీ చిన్నిపొత్తమున 48 అధ్యాయములలో వివరింపఁబడినవి. ప్రపంచ శాంతి స్థాపన ప్రయోజనమునకయి యవసరముండియే ప్రభుజీవారు లలితను జిన్నతనముననే దమసన్నిధానమునకుఁ దీసికొనిపోయినట్లు గ్రంథమందును దాహృతమయినది. అట్లైనచోఁ జిన్నారి పొన్నారి చిఱుతప్రాయముననే తల్లిదండ్రులను సోదరులను మిత్రులను విడనాడి గతజీవరై లోకకల్యాణార్థముగురు సన్నిధి కేఁగిన లలిత జీవనము బహుధా చరితార్థమైనదనియే చెప్పఁదగును ఇట్టి యుత్తమ యోగినుల భౌతిక జీవితము క్షణికమయినను నజరామరముగనే గణింపఁదగును. ఈమె జీవితకాలములో శీర్షాసనాదులతో శివాస్వరూపముతో ధ్యాన నిష్ఠా గరిష్ఠయైయుండిన చిత్రరూపములు పెక్కులు గ్రంథమునఁ జక్కఁగా ముద్రింపఁబడినవి. అందఱు నాసక్తితో జదువదగిన యీ గ్రంథమును సుందరముగఁ బ్రకటించిన రాజయోగసాధనాశ్రమ సభ్యులను మిక్కిలి యభినందించుచున్నాము.

వ్యక్తివివేకము

భాగవతుల కుటుంబరాయశాస్త్రి.

(గతసంచిక తరువాయి)

వివరణము :- సురభి శబ్దము పుమ్లింగముననున్నది. దీని నుండి రమణుండను నర్థము స్ఫురించును స్త్రీలింగముననున్న వనమాలా శబ్దమునుండి, కామిని స్ఫురించును. నఖక్షతమనునది యవశ్యము రమణదత్తమేయగును. అందుచే "రమణదత్తమ్" అను విశేషణము వ్యర్థము. అటులే, "మదయాపితలజ్జయా" అనుప్రమదా విశేషణమును వ్యర్థమే "రమణదత్తమ్" "ప్రమదయా," "మదయాపితలజ్జయా" అను పదములు లేకున్నను "నఖక్షతమివ" యను నుపమానమువలనను మిగిలిన శబ్దములలోని స్త్రీత్వ పుంస్త్వముల వలననే, ప్రస్తుత నాయికా నాయక వ్యవహారము స్ఫురించును. వాని వలననే. ఒక స్త్రీచే నేవిధముగా, కాముక సంగమము వలనఁ గలిగినట్టియు, ఎఱ్ఱగను, వంకరగను నున్నట్టియు నఖక్షతము ధరింపఁబడునో, యటులే, వనమాలచే వసన్త సమాగమజనితమైన నవము, భంగురమునగు పలాశము ధరింపఁబడినదను నర్థము సహృదయులకు ప్రతీతమగుచునే యుండును. అర్ధ్రి నఖక్షతమివ అను నుపమానముచే నుపకృతమైన స్త్రీ పులింగ నిర్దేశ మహిమచే స్త్రీత్వము పుంస్త్వము, అనునవి అనుమితికి విషయములగుననుట, మహాకవుల కందఱకును సమ్మతమైన విషయమే. అందుచే నిట, "రమణదత్తమ్" "ప్రమదయా "మదయాపితలజ్జయా" అను పదములు పునరుక్తములే లింగవిశేష నిర్దేశము వలన, నర్థములలో స్త్రీత్వ, పుంస్త్వములు మితికి విషయములగు ననుటకు.

ఉదాహరణములు :-

విద్ధ్రిం ధనుః పాండు పయోధరేణ
శరద్దధా నార్ద్రనఖక్షతాభమ్

ప్రసాదయన్తీ సకలంక మిన్దుమ్
తాపం రవే రభ్యధికం చకార

అర్థము :- పాండుపయోధరేణ=తెల్లని మేఘముతో (పయోధరేణ=స్తనముతో) ఆర్ద్ర నఖక్షతాభమ్=క్రొత్త నఖక్షతమును పోలియున్న, ఐంద్రమ్ ధనుః=ఇంద్రధనుస్సును, దధానా=ధరించుచున్నదై, సకలంకమ్=కళంకముతోఁగూడిన, ఇన్దుమ్, చంద్రుని (కోపముతో నున్న-ప్రియుననియు నర్థము ధ్వనించును.) ప్రసాదయన్తీ=స్వచ్ఛమగునట్లు చేయుచున్నదై, (ప్రసన్నునిగాఁ జేసికొనుచున్నదై యనియు స్ఫురించును.) శరత్=శరదృతువు (స్త్రీలింగమువలన-నొక స్త్రీ ధ్వనించును) రవేః=సూర్యునకు (పులింగము వలన నొక కాముకుడుఁ ధ్వనించును)అభ్యధికమ్ తాపమ్=అధికమైన తాపమును కలుగఁ జేసెను.

ఇచట గూడ, స్త్రీ పుల్లింగముల నిర్దేశముచే శరత్ అను శబ్దమునుండి నాయికయు, ఇన్దు రవి శబ్దములనుండి నాయక ప్రతినాయకులును అనుమితి ప్రతీతులగుచునేయున్నారు.

వేఱొక యుదాహరణము :-

"అత్యన్త పరిణాహిత్వాత్, అత్యన్త శ్లక్ష్ణతావశాత్
నకాచిదుపమారోఢు, మూరూశక్నోతి సుభ్రువః"

అత్యన్త పరిణాహిత్వాత్=ఎక్కువ విశాలమగుట వలనను, అత్యన్త ఎక్కువమృదుత్వము కలిగియుండుట వలనను, సుభ్రువః=స్త్రీయొక్క శ్లక్ష్ణతావశాత్=ఊరూ=తొడలను, ఆరోఢుం=ఎక్కుటకు, కాచిత్ ఉపమా,= ఏసాదృశ్యమును, నశక్నోతి=సమర్థము కాదు.

కాచిత్ అను పదముననున్న స్త్రీలింగవశమున నొక యంగనయు ఊరూ-అను పదములోని ద్వివచనము వలనను, దానికిఁ గల విశేషణముల వలనను, రెండు మణిస్తంభములును అనుమితములగును.

ఉదాహరణాన్తరము

ఆభోగి నేత్ర పరివర్తన విభ్రమేణ
మూర్త్యా నితంబవలనాకులతామ్ వహన్త్యా
యస్యాశ్శనై రవిరలోత్కలికా కలాప
పర్యాకులమ్ హృదయమంబునిధేర్మమన్థే

అర్థము :- ఆభోగి=వాసుకి యనెడు నేత్ర=కవ్వపుత్రాటి యొక్క, పరివర్తన=త్రిప్పుడు అనెడు; విభ్రమేణ=విశేషమైన భ్రమణముచే, నితంబవలనాకులతామ్ = మధ్యభాగమునందు త్రిప్పుటచే క్షోభను వహన్త్యా=కలిగిన, మూర్త్యా=స్వరూపముతో (మన్దరపర్వత శరీరముతోనని భావము) యస్య, అంబునిధేః=ఏ సముద్రము యొక్క అవిరలోత్కలికా...పర్యాకులమ్. పెద్ద తరంగములయొక్క సమూహముచే పర్యాకులత నొందిన, హృదయమ్ హృదయము (మధ్య భాగము అశనైః=తీవ్రముగా, మమన్థే=మథింపఁబడెనో.

రెండవ యర్థము

ఆభోగి .. విభ్రమేణ=పెద్ద, కంటి, యొక్క కటాక్షమనెడు విలాసముతో, నితంబవలనా కులతామ్=పిరుదుల యొక్క సంచలనముచే, క్షోభము, వహన్త్యా, మూర్త్యా=కలిగిన శరీరముతో. (నాయిక యొక్క స్వరూపముతో) యస్య=ఏ నాయకుని యొక్క అవిరలో .. పర్యాకులమ్ = అధికమైన ఉత్కంఠాసమూహముచే కలతనొందిన హృదయము=మనస్సు (హృదయము)అశనైః=తీవ్రముగా, మమన్థే= మథింపఁబడెనో.

ఇచట శ్లేష మహిమవలన, నాయికా నాయకుల వ్యవహార మను మితి విషయమగుచున్నది. "అత్యన్త పరిణాహిత్వాత్" అను పద్యములో ఆరోఢుమ్ (ఎక్కుటకు) అను శబ్దార్థము జీవ వ్యాపారమును, ఒక ప్రాణియొక్క చేష్టను తెలుపును-కాన 'ఉపమ' యను

జడమునకు సంబంధింపదు. అందుచే ఆరోహాశబ్దము యొక్క ముఖ్యార్థము, అచట సమన్వయింపదు. అందుచే లక్షణా వ్యాపారము నాశ్రయించి ఆరోఢుమ్ శబ్దమునకు, సరితూగుట లేక పోలియుండుట యను నర్థమును చెప్పుకొనవలయును. అటులే "ఆభోగి" అను పద్యమునందు "హృదయ" మనునదిజీవుని కార్యములో నొక భాగ విశేషము అందుచే జడమగు జలనిధికి హృదయమున్నదనుటయు కుదురదు. కావున లక్షణ నాశ్రయించి, మధ్యభాగమను నర్థమును చెప్పుకొనవలయును. ఈ "లక్షణ"యనునది ఒకయలంకార మేయని ప్రతిపాదించియే యున్నాము. మఱియు

"యద ద్వైకా శ్రయోధర్మో యత్రస్యా దధిరోపితః
ఉపమానోప మేయత్వమ్ నతయో శ్శాబ్దమిష్యతే" (42)

భావము :- ఉపమానగత ధర్మము నుపమేయము నందారోపించునపుడు, ఉపమానోపమేయ భావము శాబ్దముగ భాసించుట యుచితముగాదు. పై పద్యమున, నాయకధర్మమగు హృదయమును ఉపమేయమగు జలనిధి యందారోపించు చున్నాము. అట్టి తావులలో నుపమానోపమేయ భావము గమ్యమగు చుండుటయే మంచిది. వాచ్యము కాఁగూడదని భావము.

ఉదాహరణము :-

"అపరాగ సమీరణేరితః క్రమశీర్ణాకుల మూలసన్తతిః
తరువత్ సుకరః సహిష్ణునా రిపురున్మూలయితుమ్ మహానపి"

అర్థము :- అపరాగ సమీరణేరితః=గాలివంటి ద్వేషముతో కదల్పఁబడినట్టియు, క్రమ . మూలసన్తతిః=క్రమముగ నశించి, చలించిన, మంత్రులు మొలదలగు స్వీయజనము గలిగినట్టియు, (వేళ్లు గలట్టియు) రిపుః=శత్రువు, మహానపి=గొప్పవాఁడైనను తరువత్=చెట్టు

వలె, సహిష్ణునా=సహనము గలవానిచే, ఉన్మూలయితుం=నశింపఁ జేయుటకు (పెకలించుటకు) సుకరః=సుసాధ్యుఁడగును.

ఇచట ఉన్మూలనమను తమ ధర్మము, శత్రువునందారోపిత మైనది. ఈ యారోపసామర్థ్యము వలననే, శత్రువునకు, వృక్షమున కును, సాదృశ్యము గోచరించుచునేయుండును. అందువలన, తరువత్ అని యుపమాలంకారమును వాచ్యముగఁ జెప్పుట దోషమేయగును.

రూపక విషయమున నొక యుదాహరణము.

అను రాగవన్తమపి లోచనయోః
దధతమ్ వపుః సుఖమతాపకరమ్
నిరకాసయత్ రవిమపేత వసుమ్
వియదాలయా దపరదిగ్గణికా.

అర్థము :- అపరదిగ్గణికా= పడమటిదిశ యనెడు, వేశ్య అను రాగవన్తమపి= (1) ఎఱ్ఱనిరంగును కలిగియున్నను. (2) ప్రేమకల వాఁడైనను, లోచనయోః=నేత్రములకు సుఖకరమ్=సుఖమునుకలుగఁ జేయు, వపుః శరీరమును దధతమపి=ధరించుచున్నవాఁడైనను.

(1) సూర్యుని పక్షమున, కమలతోఁ జూచుటకు వీలుగ నున్నప్పటికిని (2) విటుని పక్షమున-చూచుట కందముగ నున్నప్పటి కిని అని భావము.అతాపకరమపి= (1) ఔష్ణ్యము తగ్గుటచే తాపమును జేయకున్నను (2)శఠుఁడు కాకుండుటచే బాధను కలుగఁజేయకున్నను అపేత వసుమ్=(1) పోయినకిరణములుగల (2) నిర్ధనుఁడైన, రవిమ్= సూర్యుని, వియదాలయాత్=ఆకాశమనెడు ఇంటి నుండి, నిరకాస యత్=వెళ్ళఁగొట్టెను.

ఇచట "వియదాలయాత్" "అపరదిగ్గణికా" అనురూపక ముల వలన, రవియందు విటత్వారోపము గమ్యమగును. ఏకదేశ వివర్తి రూపకమలంకారము. శ్లేష, రూపకోత్థాపితమే. అందుచే

రూపకమున కంగమేయగును. అందువలననే శ్లేష, "వసవ ఏవవసూని, అనురాగ ఏవ అనురాగః" కిరణములనెడు ధనము ఎఱుపనెడు ప్రేమ అనురూపకము అందు పర్యవసానము నొందును.

ఈ పద్యమున-దిక్ పదము స్త్రీలింగమున నుండుటచే, స్త్రీ, గమ్యమగును-వెడలఁగొట్టుట యనెడు, కార్యము వలన స్త్రీ విశేషము అనఁగా వేశ్య గమ్యయగును. నిర్ధనికుఁడగు విటుని వెడలఁగొట్టుట వేశ్యాస్వభావమగుటచే, వేశ్య గమ్యయగును. ఈ విధముగ, లింగ విశేష, కార్యవిశేషముల వలననే దిశయందు గణికాత్వము ఆకాశము నందాలయత్వము గమ్యమగుచుండ, దిగ్గణికాయనియు, వియదాల యాత్తనియు రూపకములను వాచ్యముగఁ జెప్పుట పునరుక్తమగు చున్నది. ఆ రూపకములను వాచ్యములుగఁ జెప్పినపుడు, రవియందు విటత్వారోపమును వాచ్యముగఁ జెప్పకయే వదలనేల ? పై రూపక ములకును, దీనికిని భేదము లేదుగదా. ఈ సందర్భమున నీ విషయ మును తెలిసికొనవలయును.

"ఉభయార్థపదని బన్ధో,
లింగవిశేషః పదంచ గుణావృత్తి
ఉపమాన విశేషాశ్రయ మర్థం
గమయతి స సహిపున ర్వాచ్యః"

భావము : 1. రెండర్థములుగల పదముల నుపయోగించుట, 2. లింగవిశేష నిర్దేశము. 3. లక్షణనాధారముగఁ జేసికొనినపదము అను నీమూఁడును ఉపమాన విశేషమున నుండు నర్థమును భాసింపఁ జేయును. అందుచే నాయర్థమును తిరిగి చెప్పనక్కఱలేదు. (ఉదాహర ములు, 1. పాండుపయోధరపదము 2. శరత్, రవేః 3. ఆరోధుమ్-హృదయమ్. ఆర్ద్రనఖక్షతము-అనునవి క్రమముగ ఉపమానవిశేషము నకుదాహరణములు)

ఎట్లన,

"రాహుస్త్రీ స్తనయోరకారి సహసాయే నాశ్లథాలింగన
వ్యాపారైక వినోదదుర్లలితయోః కార్కశ్య లక్ష్మీర్వృథా
తేనాక్రోశిత ఏవ తస్యమురజిత్ తత్కాలలోలానల
జ్వాలాపల్లవి తేన మూర్ధవికలం చక్రేణ చక్రే వపుః.

అర్థము : మురజిత్=కృష్ణుఁడు, అశ్లథాలింగ దుర్లలితయోః= గట్టిగా కౌఁగిలించు కొనుటయనెడు వ్యాపారమాత్ర వినోదమునందు చాల సమర్థములైన, రాహుస్త్రీ స్తనయోః=రాహు భార్యా స్తనములయొక్క, కార్కశ్యలక్ష్మీః=కఠినతయనెడు సంపద, సహసా=ఆకస్మికముగా, యేనచక్రేణ=ఏచక్రముతో వృథా అకారి=వ్యర్థముచేయఁబడినదో, తేన=ఆచక్రములో తత్కాల పల్లవి తేన=ఆకాలమునందు చంచలమైన అగ్నిజ్వాలలచే పల్లవములు కలుగునట్లుగాఁ జేయఁబడిన (అగ్నిజ్వాలలతో వ్యాప్తమైన యనిభావము) చక్రేణ=చక్రములో, ఆక్రోశితఏవ—నిందించుచుండగనే, తస్య—అతనియొక్క, వపుః—శరీరమును, మూర్ధవికలమ్, చక్రే=శిరోరహితముగాఁ జేసెను.

రాహుస్త్రీ స్తనములు వ్యర్థములుగఁ జేయఁబడినవనుటవలననే, రాహువధగమ్యమగును. అందుచే పర్యాయోక్త్యలంకారమిందున్నది. రాహువధ చక్రాయుధముతోనే జరుగుటచే, పర్యాయోక్త్యలంకారమునుండియే చక్రాయుధమను మితమగుచున్నది. అయినను"చక్రేణ" యని చక్రశబ్దమును ప్రయోగించుట పునరుక్తమగును. చక్రేణ చక్రే అనునపుడు అనుప్రాసమున్నది. ఈ యనుప్రాసమునం దాసక్తిచే కవి, పౌనరుక్త్యదోషమును గుర్తింపలేకపోయినాఁడు. "మూర్ధవికలామస్త్రేణ తేనేతనుమ్" అని మార్చుచో పునరుక్తిదోషము కలుగదు. తేనేత నుమ్మని యనుప్రాసమును నుండును అనుప్రాసము కావ్యమునకు పరిపోషమునే యిచ్చును. ఎలన,

సమాసే చాసమాసే చానుప్రాసేష్వఖిలేష్వపి
పదాదివర్ణానుప్రాసః కవీనామధికప్రియః.

భావము : సమాసము సంధైనను, అసమాసము సంధైనను, అన్నియనుప్రాసలలోను, పదాదులయందున్న వర్ణానుప్రాసము కవులకు ప్రియతమమైనది.

సమాసగతప్రాస కుదాహరణము :—

త్వత్కీర్తి కేతకీ క్లప్తకాన్త కర్ణావతంసకః
దిగంగనాగణో రాజన్ రాజత్యామోదనిర్భరః

భావము : ఓరాజా, నీకీర్తియనెడు కేతకీపుష్పమును కర్ణాభరణముగా ధరించిన, దిగంగనా సమూహము పరిమళముతో నిండియున్నది.

ఇచట, మొదటిపాదమంతయు నొకసమాసముగనున్నది. అందు కకార, తకార, ములయావృత్తివలన ననుప్రాస సిద్ధించినది.

అసమాసమునందు ప్రాసకుదాహరణము

"కుతఃకువలయం కర్ణే కరోషి కలభాషిణి
కిమపాంగమ పర్యాప్తమ్, అస్మిన్ కర్మణి మన్యసే"

భావము : మధురముగ మాటలాడు నో యింతీ, కువలయమును కర్ణములో ధరించుచున్నావేల ? చెవుల నలంకరించుటకు, నీ యపాంగముచాలదా ?-

పౌనరుక్త్యదోషమున కుదాహరణము

"తమ్ జిగీషురివ శాత్రవమ్, తతో
లోకలోచన పథోపరోధకమ్
రశ్మిభిః కనక సాయకోపమైః
అన్ధకారమరుణో స్త మానయత్"

అర్థము :- జిగీషుః = జయేచ్ఛకలవాడు, శాత్రవమివ=శత్రువును వలె, అరుణః=అరుణుఁడు, లమ్ లోకలోచనపథోపరోధకమ్=జనుల చూపునడ్డగించు, అన్ధకారమ్=చీకటిని, కనకసాయకోపమైః, రశ్మిభిః=బంగారు బాణములను పోలిన కిరణములతో అస్తమ్, అనయత్ =నశింపఁజేసెను.

అన్ధకారము లోకము యొక్క లోచనముల నడ్డగించి అపరాధియైనది. దానిని బంగారు బాణములను పోలిన కిరణములతో వరుణుఁడు అణచివేసినాఁడు. అణచివేయుట యనునది, జిగీషువు యొక్క వ్యాపారమే యగును. అందుచే అరుణునకును, అన్ధకారమునకును జిగీషు శత్రుభావమను విశేషమగుచునే యుండును. తిరిగి "జిగీషుః శాత్రవమివ" అని యుపమాలంకార నిబన్ధనము చేయుట పునరుక్తత కాకపోదు.

"పరిహాసరతి ర్యశ్చ యశః కర్పూర పాంసుభిః
దిక్కామినీ ముఖాన్యారాత్ పటవాసై రివాకిరత్"

అర్థము :- పరిహాసరతి ర్యశ్చ=పరిహాసప్రియుఁడైన ఎవఁడైతే, దిక్కామినీ ముఖాని ఆరాత్=దిక్కాంతల ముఖముల సమీపమున పటవాసై రివ=వస్త్రములకు పరిమళము నిచ్చు, సుగంధ చూర్ణము చేతను వలె, యశః కర్పూరపాంసుభిః=కీర్తియనెడు కర్పూరపు చూర్ణముచే, అవాకిరత్=చల్లెనో. పరిహాసప్రియుఁడైన కాముకుఁడు కర్పూర చూర్ణమును, ముఖములపై చల్లుట యనునది సామాన్యముగ కామినీ విషయముననే ప్రసిద్ధము తదన్య విషయమున గాదు. దిక్కులకు, ముఖములతో సంబంధమును వర్ణించుటవలనను, దిక్ శబ్దము స్త్రీలింగమునందుండుట వలనను వానికి కామినీ రూపత్వమవగతమగుచునే యున్నను "దిక్కామిని" యనుపదమున, దిక్కు

లకు, కామినీత్వ రూపణము పునరుక్తము (2) అందువలననే, కర్పూర పాంసువులకును, పటవాసరూపత్వము అవగతమగుచునేయుండ, వానికి పటవాసరూపణము గూడ కర్పూర పాంసువులకును, పటవాసమునకును ఐక్యారోపము చేయుటయే పునరుక్తమగును. సామర్థ్యము వలననే సిద్ధించు నుపమానోపమేయ భావమును వాచ్యముగ నిబంధము చేయుట (పటవాసైరివ యని యుపమాలంకారమును కూర్చుట) పునరుక్తమని వేఱుగఁ జెప్పవలయునా? సత్కవులైనవారు సామర్థ్యసిద్ధమైన యర్థమును తెలుపుటకు శబ్దప్రయోగమును ఆదరింపరుగదా!
ఉదా:-

మహాదపి పరదుఃఖమ్ శీతలం సమ్యగాహుః
ప్రణయ మగణయిత్వా యన్మమాపద్గతస్య
అధరమివ మదాన్ధా పాతు మేషా ప్రవృత్తా
ఫల మభినవపాకం రాజజమ్బూద్రుమస్య.

అర్థము :- పరదుఃఖమ్=ఇతరుల యొక్క దుఃఖము మహదపి గొప్పదైనను, శీతలమ్=చల్లనిదే (ఇతి=అని) సమ్యక్ ఆహుః= బాగుగాఁ జెప్పినారు.

ఇచట శీతలమ్=చల్లనిది, భవతి అగును, ఇతి=అని సమ్యగాహుః- అని వాక్యరీతియుండును. ఇతి అనుపదము సందర్భమువలననే సిద్ధించుచున్నది అందుచే కవి యాశబ్దమును ప్రయోగింపలేదు.

"చన్దనాసక్తభుజగ నిశ్శ్వాసానిలమూర్ఛితః
మూర్ఛయత్యేష పథికాన్ మధౌమలయమారుతః"

అర్థము :- చన్దనా ...మూర్ఛితః = చన్దనవృక్షముల పైనున్న పాముల నిశ్శ్వాసములలోని యగ్నిచే మూర్ఛనొందిన, మలయమారుతము, వసన్తర్తువున, పథికులను మూర్ఛనొందించుచున్నది.

ఇచట 'నిశ్శ్వాసాగ్నిచే మూర్ఛనొందినదో యన్నట్లున్న-అని యుత్ప్రేక్షాలంకారమున్నది. అది గమ్యమగుచుండుటచే, కవి,ఉత్ప్రేక్షను తెలియఁజేయు, "ఇవ" (మూర్ఛిత, ఇవ) శబ్దమును ప్రయోగింపలేదు.

"అయం మన్దద్యుతిర్భాస్వాన్ అస్తం ప్రతియియాసతి
ఉదయః పతనాయేతి శ్రీమతో బోధయన్ నరాన్"

అర్థము :- మన్దద్యుతిః, అయం, భాస్వాన్=తగ్గిన కాన్తిగల ఈ సూర్యుఁడు,ఉదయః=ఉదయము, పతనాయ=పడిపోవుటకే,ఇతి= అని, శ్రీమతః నరాన్ = శ్రీమన్తులగు వారిని, బోధయన్ = బోధించుచు, అస్తం, ప్రతి, యియాసతి= అస్తమించుచున్నాఁడు.

ఇచట నిదర్శనాలంకారమున్నది. పై పద్యమున-నా యొక్క-వలె = అనఁగా సూర్యుఁడనగు నాయొక్క- యుదయమువలె-అను భావము ప్రతీతమగుచున్నది. ఆభావ ప్రకటనకు, మమ "ఇవ" అను పదము లావశ్యకములు. అయినను,అవి గమ్యములగు చుండుటచే కవి వానిని ప్రయోగింపలేదు.

"స్వాభావికమ్ వినీతత్వమ్, తేషాం, వినయకర్మణామ్
ముమూర్ఛ సహజం తేజో హవిషేవ హవిర్భుజామ్"

అర్థము :- హవిర్భుజామ్ = అగ్నులకు, సహజమ్,= సహజమైన తేజః ఇవ= తేజస్సువలె, వినయకర్మణామ్ , వినీతులైన, తేషాం= వారికి, స్వాభావికమ్ సహజమైన, వినీతత్వమ్= వినయము, ముమూర్ఛ= అధికమయ్యెను.

ఇచట, వినీతత్వమునకు, స్వాభావిక మనునది విశేషణము, అది, బాధకము లేకుండుటచేతను, నపుంసకలింగమునందే యుండుటచేతను, తేజస్సునకు కూడ అన్వయించును. అయ్యును, తిరిగి "సహజమ్" అను విశేషణమును ప్రయోగించుట పునరుక్తమగుచున్నది.

"ధర్మస్తుల్య విభక్తీనామ్ ఏకస్యాప్యుదితో౽ఖిలాన్
తాపనన్వేతీతి పర్యాయైస్తదుక్తిః పౌనరుక్త్యకృత్"
సంగ్రహశ్లోకము (44)

భావము :- తుల్యవిభక్తులలో నున్నపదములలో నొకపదమున కన్వయించు విశేషణము.

తుల్య విభక్తులగు నాపదముల కన్నిటికిని నన్వయించును. అందుచే పర్యాయపదములచే తిరిగి యా విశేషణార్థమును బోధించుట పౌనరుక్త్యమును కలుగఁజేయును.

"కైరవేన్దీవరచ్ఛాయౌ, నౌమ్యుమా మాధవ మాధవౌ
బ్రహ్మార్చిత బ్రహ్మనుతౌ, నిహతాన్ధక కాలియౌ"

అర్థము :-కైరవ...చ్ఛాయౌ = తెల్లనల్లకలువలఛాయలు గలిగినట్టియు, బ్రహ్మార్చిత బ్రహ్మనుతౌ= బ్రహ్మచే అర్చింపఁబడి, బ్రహ్మచే స్తుతింపఁబడినట్టియు, నిహతాన్ధక కాలియౌ= చంపఁబడిన, అన్ధకాసురుఁడు, కాలియుఁడు కలిగినట్టియు, ఉమాధవమాధవౌ = శివమాధవులను, నౌమి= నమస్కరించుచున్నాను.

ఇచట, ఉమాధవమాధవశబ్దములకు అర్థమును తెలిసికొనవలయును.

ఉమాయాః = పార్వతియొక్క- ధవః= లక్ష్మియొక్క, భర్త ఇచట ధవశబ్దము రెండు పర్యాయములు కనఁబడుచున్నది. ఉమాధవమాధవౌ అని చెప్పుటకు బదులు, ఉమాచ, మాచ-ఉమామే, తయోః ధవౌ, ఉమామాధవౌ-అను విగ్రహవాక్యము నాశ్రయించి, "ఉమా మాధవౌ" అను సమాసమును చేయవచ్చును. అట్లగుచో, ధవ శబ్దమొక పర్యాయమే వచ్చును. ద్విరుక్తి పోవును. అటులే బ్రహ్మశబ్దము గూడ పునరుక్తమైనది. బ్రహ్మార్చితనుతౌ అని చూర్పును చేసినచో నాపునరుక్తి తొలఁగును. "ధవ, బ్రహ్మ" శబ్దముల నిట్లొకే

పర్యాయము ప్రయోగించినను, వివక్షితార్థము భాసించుచునే యుండును.

ఇందుకు ప్రత్యుదాహరణము, పద్యము యొక్క, మొదటి నాల్గవపాదములు. ధవ, ఛాయాశబ్దములు, ద్విరుపాత్తములు కానిచో, వివక్షితార్థ ప్రతీతి కలుగదని వాదింతురేని, "కైరవేన్దీవరచ్ఛాయా" అనునపుడు ఛాయాశబ్దము "నిహతాన్ధక కాలిమా" అనునపుడు, నిహతశబ్దము కూడ ద్విరుపాత్తము కావలసి వచ్చును.

ఆక్షేపము :- కానిమ్ము దోషమేమి? నిహత, ఛాయాశబ్దములు, ఒక పర్యాయము మాత్రమే ప్రయుక్తములైనను, రెండు పర్యాయములు ప్రయుక్తములైనను, ఆ సమాసములు వ్యాకరణ శాస్త్రసమ్మతములే యగునుగదా!

సమాధానము :- సత్యమే అర్థప్రతీతి ప్రధానమైనది లక్షణానుగమము మాత్రమే కాదు. లక్షణమర్థప్రతీతి కొఱకేర్పడినదియే. అందుచే నర్థప్రతీతి కెన్నిపదములు కావలయునో అన్నిపదములను మాత్రమే ప్రయోగింపవలయును. అంతకంటె నధికములగు పదములను ప్రయోగింపరాదు.

అర్థప్రతీతికొఱకే పదమును ప్రయోగింపవలెను. పదాధిక్యమర్థాధిక్యమునకు హేతువగును. అందుచే వ్యాకరణ శాస్త్రమంగీకరించును గదాయని, యర్థప్రతీతి నాదరింపక, యధికపదప్రయోగము సేయుట యుక్తము కాదు. ఈ విషయమే "తదర్థావగత్యర్థోహి శబ్దప్రయోగః, అర్థశ్చేదవగతః కిం శబ్దప్రయోగేణ?" అను వాక్యమునందు ప్రతిపాదితమైనది. దాని భావమిది "అర్థప్రతీతి కొఱకే గదా శబ్దప్రయోగము. అర్థమవగతమగుచున్నపుడు శబ్దప్రయోగమేల?" అందుచే రెండు ప్రయోగములును, వ్యాకరణ లక్షణమున కనుకూలములే యైనపుడు, ఏలఘూపాయముచే ప్రధానమగు నర్థము

భాసించునో, ఆ లక్షణమునే యాశ్రయించుట మంచిది. ప్రస్తుతము, ఉమా, చ, మా చ= ఉమామే, తయోః ధవః ఉమామాధవః యని ద్వంద్వపూర్వక తత్పురుష సమాసము నాశ్రయించుటయే మంచిది. ఉమాయాః ధవః, ఉమాధవః, మాయాః ధవః మాధవః, ఉమా ధవశ్చ మాధవశ్చ, ఉమాధవమాధవౌ అని తత్పురుషపూర్వకమగు ద్వంద్వము నాశ్రయించుట మంచిదిగాదు.

ఆక్షేపము :- అగుచో ద్వంద్వసమాసమునకు తావే లేకపోవునేమో !

సమాధానము :- "జగతః పితరౌ వన్దే పార్వతీ పరమేశ్వరౌ" మొదలగు వాక్యములలో ద్వంద్వసమాసమునకు తావు లభించును. ఎచట తత్పురుష సమాస శంక కలుగదో అచట ద్వంద్వమున కవకాశముండును. "పార్వతీ పరమేశ్వరౌ" అనునపుడు తత్పురుష ప్రసక్తి లేదు. (కర్మధారయ పూర్వక ద్వంద్వసమాస ప్రసక్తియేయున్నది) అవాన్తర విచారమునిక చాలింతము.

"ద్విషద్వధూలోచన చన్ద్రికాన్త
నిష్యన్దనేన్దూదయ సన్నిభోయమ్"

తా॥ శత్రుస్త్రీల నేత్రములనెడు చన్ద్రికాన్తమణులను ద్రవింపఁజేయు చన్ద్రోదయము యొక్క కాన్తివంటి కాన్తిగలవాఁడు.

చన్ద్రోదయ సమయమున చన్ద్రికాన్తమణులు ద్రవించు నను విషయము లోకప్రసిద్ధము "ద్విషద్వధూలోచన చన్ద్రికాన్త చన్ద్రోదయ సన్నిభోయమ్" అనియున్నను పై వాక్యార్థము భాసించుచునే యుండును. అందుచే నిచట "నిష్యన్దన" పదము పునరుక్తమగుచున్నది.

"రజనీ పురన్ధ్రిలోధ్ర తిలకః తిమిరద్విపయూథ కేసరీ"

అర్థము:— రాత్రియనెడు స్త్రీకి లోధ్రతిలకము చీకటియనెడు

ఏనుగుల సమూహమునకు సింహము. ఇచట "రజనీ పురంధ్రీ ప్రసాధన లోధ్రతిలక" రాత్రియను స్త్రీ యలంకరించుకొను లోధ్ర తిలకము, "తిమిర ద్విపయూథ నిర్మథన కేసరీ" చీకటి యనెడు నేనుఁగుల సమూహమును చంపు సింహము - అని ప్రయోగించియున్నచో, ప్రసాధన, నిర్మథన శబ్దములు పునరుక్తములయ్యెడివి. ఆ యా వ్యాపారము లప్రసిద్ధములైనపుడు వానిని దెలుపు పదముల నుప యోగించుట దోషముకాదు.

ఉదా॥ "సంసార సంభవ నిరాకరణైక రేఖా"

అర్థము :- సంసారమునందు పుట్టుకను నిరాకరించు ముఖ్య మైన అవధి-(గీఁత)-అవధి, లేక హద్దనునది హేయ వస్తువులకును, ఉపాదేయవస్తువులకును విభాగమును తెలియఁజేయుననుట లోక ప్రసిద్ధము. ఇష్టములేని వస్తువును నిరాకరించుట-ఇష్టములైన వస్తువులను పరిగ్రహించుట-యను వ్యాపారములు హద్దు, లేక పొలిమేరకు సంబంధించి యుండునను విషయము లంతగ లోకప్రసిద్ధములు కావు. అందుచే పై వాక్యమున "నిరాకరణ" శబ్ద ముపాదేయమేయగును. అయినచో

"త్వష్టుః సదాభ్యాస గృహీత శిల్ప
విజ్ఞాన సంపత్ప్రసరస్య సీమా"

తా॥ "బ్రహ్మయొక్క శిల్ప విజ్ఞాన సంపదయొక్క ప్రసారమునకు పొలిమేర" ఇచట శిల్ప విజ్ఞాన మభీష్టమైనది. దానిని పరిగ్రహించుటలో లేక విస్తరింపఁజేయుటలో మేటియను నర్థమున నిచట సీమాశబ్ద ముపయుక్తము. సీమా శబ్దమునకీవ్యాపారములో సంబంధ మంతగా ప్రసిద్ధముకాదు. అందుచే నిచట "ప్రసరస్య" అను పదము పాదేయమే.

ఇటనింకొక విషయమును గూడ గుర్తింపవలయును "ఇన్దూ

దయస్యేవ సన్నిభాయస్య "చంద్రోదయము యొక్క కాన్తివంటి కాన్తికలవాఁడు" అని వ్యాఖ్యానించుటచే, రాజునకును చన్ద్రోదయమునకును సామ్యమును సన్నిభాశబ్దము తెలుపుచున్నది. అందుచే నిచట సామ్యము శాబ్దము. సన్నిభా శబ్దమును తీసివేసి కేవలము "చంద్రోకాన్తేన్దూదయోయమ్" "ఆ చంద్రకాన్తములకు చంద్రోదయము" అని మాత్రమే ప్రయోగించినచో, రాజునందు చంద్రోదయసమారోపితమై రూపకాలంకారమగును. అపుడు రాజునకును చన్ద్రోదయమునకును గల సామ్యము సన్నిభాశబ్దమునుండి కాక, వాక్యార్థము వలననే స్ఫురించుటచే ఆర్థమగును. అట్లు భాసించుటయే మంచిది. అపుడు సన్నిభాశబ్ద ప్రయోగము వ్యర్థమగుచు పునరుక్తమను దోషమును కల్గించుచున్నది.

"అయథార్థ క్రియారంభైః పతిభిః కిం తవేక్షితైః
అరుధ్యేతా మతీవాస్యా నయనే బాష్పవారిణా"

తా॥ అయథార్థములైన క్రియలను చేయు నీ పతులను చూచుట వలననేమి ప్రయోజనము ? అనియనుచున్నవా యనునట్లు ఆమె నేత్రములు బాష్పవారితో (కన్నీటితో) అడ్డగింపఁబడినవి (నిండినవి)

ఇచట "బాష్పము" అనునది "నీరే" యగును. ఆయర్థమే స్ఫురించును. అయినను తిరిగి "వారి (నీరు) శబ్దమును ప్రయోగించుట పునరుక్తమేయగును. ఆ శబ్దము వలన నేదైన ప్రయోజనమున్నచో నీ దోషము రాదు. కాని ప్రస్తుతము ప్రయోజనము శూన్యము. అందుచే "బాష్పసమ్పదా" అని పాఠమును సవరించుట మంచిది. అపుడు పౌనరుక్త్యము పరిహృతమగును. సంపచ్ఛబ్దము స్త్రీలింగము. అందుచే నా శబ్దమువలన నొక "సఖి" (చెలియ) వ్యక్తమగును. దానివలన నొకచెలి యామెను తన భర్తలపై నాస నుంచు

కొనవలదని వారించుచున్నదను నర్థముకూడ లేశముగ భాసించును. ప్రయోజనమున్నచో పునరుక్తదోషము భాసింపదు. ఉదా:-

"పృథ్వీపాల ప్రతాపస్తే వైద్యుతేనాగ్నినా సమః
యో వైరివనితాబాష్పవారిణా వర్ధతేఽధికమ్"

తా॥ "ఓరాజ, నీప్రతాపము, వైద్యుతాగ్నితో సమానమైనది. అది శత్రుస్త్రీల బాష్పవారితో వృద్ధినొందును" వైద్యుతాగ్ని నీటితో నధికముగ వృద్ధినందుననుట ప్రసిద్ధము. "వారి" శబ్దము ప్రయోగించినపుడు "నీరు"ను నర్థము స్ఫుటముగ భాసించును. కేవల బాష్పశబ్దముచే నంత స్ఫుటముగ భాసింపదు. అందుచే నిట "వారి" శబ్దము దోషావహము కాదు. వైద్యుతాగ్నివృద్ధి వారికార్యముగనే ప్రసిద్ధము. బాష్పకార్యముగఁ గాదు. కావున "వారి"శబ్దము సప్రయోజనము.

శ్లో॥ "సాహాయకార్థమివ ఫూత్కృతమారుతేన
సంధుక్షితః సపది యస్య పృషత్కవహ్నిః"

తా॥ "ఎవని బాణాగ్ని, ఫూత్కారములయొక్క గాలిచేత హెచ్చుచేయఁబడినదో"- ఇచటగూడ నగ్నివృద్ధి, ఫూత్కారకార్యముగ ప్రసిద్ధముకాదు. మారుతకార్యముగనే ప్రసిద్ధము, అందుచే మారుతశబ్ద ముండుట సప్రయోజనమే.

"అవహితచేతసః పథి జనస్య కుతః స్ఖలితమ్"

అర్థము:- అవహితమైనమనసుగల మనుష్యునకు మార్గమునందు తొట్రుపాటు ఎందుకుఁ గలుగును ? అవహితత్వ మనునది మనోధర్మమేగాని తదితర ధర్మము గాదు. అందుచే నది ముఖ్యముగ మనసునందే యుండును. పురుషాదులయం దవహితత్వ మున్నట్లును వర్ణితమైనను, అదియును చేతస్సంబంధమువలననే పొసగుచున్నది. అవహితుఁడైన మనుష్యుఁడన్నను, అవహితమైన మనస్సుగలవాఁడనియే యర్థమ

గును. అందుచే "అవహితచేతసః జనస్య" యనునపుడు "చేతసః"అను శబ్దము పునరుక్తమగుచున్నది.

"అవగచ్ఛతి మూఢచేతనఃప్రియనాశం హృది శల్యమర్పితమ్"

అర్థము:- "మూఢచేతనుఁడైనవాఁడు, ప్రియనాశమును హృదయశల్యముగా భావించును"

"వ్రజన్తి తే మూఢధియః పరాభవం
భవన్తి మాయావిషు యే న మాయినః"

అర్థము: మాయావుల విషయమున నెవరు మాయావులు గారో ఆ మూఢమనుష్యులు పరాభవము నొందుదురు. మూఢత్వమనునది మనోధర్మమే. అందుచే, మూఢధియః, మూఢచేతనః అను ప్రయోగములలో, "ధియః చేతనః" అను పదములు పునరుక్తములు- కేవల చేతనసంబంధము వలననే చేతస్సంబంధముగూడ భాసించుచునే యుండును.

ఉదా: "తం కృపా మృదురవేక్ష్య భార్గవం
రాఘవః స్ఖలితవీర్య మాత్మని"

అర్థము: "కృపామృదువగు రాఘవుఁడు, పరశురాముఁ డోడినట్లు చూచి"-

"శరీరకస్యాపికృతే మూఢాః పాపాని కుర్వతే"

తుచ్ఛశరీరము కొఱకుఁగూడ మూఢులు పాపమును జేయుచున్నారు.

"మూఢోఽనాత్మమయః క్వచిత్"ఒకప్పుడు మూఢుఁడనాత్మమయుఁడుగ నుండును-పై వాక్యములలో కృపా, మూఢ పదములు మాత్రమే ప్రయుక్తములైనవి. మనసును తెలుపు పదములులేవు-అయినను కృపగల మనసుగలవాఁడు-మూఢమైన మనసుగలవాఁడు అను నర్థము భాసించుచునేయుండును.

"ఉదిత వపుషి దిననాథే, ప్రవికసితాత్మసు కులేషు కమలానామ్
జగతిప్రముదిత మనసిచ కోఽన్యోవిమనాయతే ఘూకాత్"

అర్థము: సూర్యుఁ డుదయించిన శరీరముగలవాఁడును, కమల సమూహములు వికసించిన యాత్మ (స్వరూపము) గలవిగను, జగత్తు సంతోషించిన మనసు గలదియు నగుచుండఁగ గుడ్లగూబకంటె నితరు లెవరు దుఃఖింతురు?

ఇచట-ఉదితవపుషి దిననాథే అనునపుడు "వపు" శ్శబ్దము, ప్రవికసితాత్మసు, అనునపు "డాత్మ" శబ్దము "స్వరూపము" అను నర్థమును తెలుపును. ప్రతిపదార్థమునకును నొకస్వరూపము తప్పక యుండును. అందుచే సూర్యుఁడుదయించినపు డని యన్నను, సూర్య బింబము లేక స్వరూప ముదయించినపుడను నర్థ మవశ్యము స్ఫురించును. ఇఁక ప్రమోదమనునది మనోధర్మమే-అందుచే పైశ్లోకములో "వపుషి" "ఆత్మ", "ప్రముదిత" శబ్దములు పునరుక్తములేయగును.

"కింపున రీదృశే దుర్జాతే జాతామర్ష నిర్భరేచ
మనసి నాస్త్యేవావకాశః శోకక్రియాకరణస్య"

"కోపముతో నిండిన యీ చెడుమనసున, శోకక్రియాకరణమున కవకాశమః లేనేలేదు"-ఇచట శోకమున కవకాశము లేనేలేదనినఁ జాలును. కావున క్రియాకరణ శబ్దములు పునరుక్తములు.

"పాతువ స్తారకా కాన్తకలా కలితశేఖరః
జగత్త్రియపరిత్రాణ క్రియావిధి విచక్షణః"

అర్థము: మూఁడులోకములను రక్షించుట యనెడు క్రియావిధి యందు విచక్షణుఁడగు, చంద్రకళాశేఖరుఁడు మిమ్ము రక్షించుఁగాత. ఇచట పరిత్రాణము (రక్షించుట) విశేషక్రియను "క్రియ" యను పదము సామాన్యక్రియను తెలుపును. విశేషక్రియను చెప్పినపుడు క్రియాసామాన్యము తప్పక భాసించును. అందుచే క్రియాశబ్దము

వ్యర్థమై పునరుక్తమగుచున్నది. "విధి" యను శబ్దముకూడ నిచట క్రియనే తెల్పును. అందుచే నదియును పునరుక్తమే యగును.

"సంకల్పకల్పితామ్ కాన్తామ్ సర్వతో౽పశ్యతో౽నిశమ్
వియోగదుఃఖానుభవక్లేశో ఽత కథాపి మే"

అర్థము : సంకల్పముచే కల్పితమైన కాన్తను,అంతటను చూచుచున్నను వియోగదుఃఖము యొక్క అనుభవము యొక్క క్లేశము నాకు తప్పలేదే. అయ్యో!

ఇందు, కల్పనయనునది ఎప్పుడును సంకల్పముచేతనే జరుగును, అనఁగా, కల్పనయందు సంకల్పము సాధనముగ నుండియేతీరును.కావున కేవలము "కల్పితామ్" అనియున్నను "సంకల్పకల్పితామ్" అను సమాసపదము యొక్క యర్థము స్ఫురించుచునే యుండును.

(2) దుఃఖానుభవము: ఇచట దుఃఖముయొక్క అనుభవము అని షష్ఠీసమాసమును చెప్పవలయును. షష్ఠీసమాసము విభిన్నములైన రెండువస్తువులకే కుదురును-ప్రస్తుతము అనుభవము అనునది అనుభవ సామాన్యవాచకము. దుఃఖ మనునది అనుభవ విశేషము. సామాన్యవిశేషములకు భేదములేదు. భేదములేనివానికి షష్ఠీసమాసములేదు. సామాన్యవిశేష వాచకపదములకును సమాసము చేయుట సంప్రదాయము కాదు. "శాబలేయస్య గౌః"అని విగ్రహవాక్యముతో షష్ఠీసమాసము చేయముగదా ! ఇఁక విశేషణ సమాసము చేయవచ్చునా యని ఆలోచింతము-

"శాబలేయము"-అని విశేషవాచక పదమును చెప్పినతోడనే, ఆవు అను సామాన్యమగు నర్థము భాసించుచునే యుండును. కావున విశేషసామాన్య వాచకములకు, విశేషణవిశేష్యభావము పొసగదు. అందుచే నిట విశేషణ సమాసమనుటయు పొసగదు. శాబలేయగవి అనిసమాసమును చేయముగదా! ఈవిధముగ విచారించుకో, దుఃఖ

పదమొక్కటియే చాలుననియు, అనుభవపదము పునరుక్తమనియు తేలును. క్లేశము, దుఃఖము పర్యాయపదములే. అందుచే క్లేశపదము కూడ పునరుక్తమే. ఇట్లిచట సంకల్పానుభవ క్లేశపదములు మూడును గతార్థములై పునరుక్తములగుచున్నవి.

"అగాధాపార సంసారసాగరోత్తారసేతవే
దేహార్ధధృతకాంతాయ కందర్పద్వేషిణే నమః"

అర్థము: అగాధమును, అపారము నగు సంసారమనెడు సాగరమును తరించుటకు సేతువైనట్టియు, శరీరార్ధభాగమున కాన్తను ధరించినట్టియు, మన్మథద్వేషియునగు శివునకు నమస్కారము.

ఇచట అగాధము, అపారము-అనుపదములు అగాధత్వము అపారత్వము అను ధర్మములను తెలుపును. ఈధర్మములు సముద్రమునకే అసాధారణధర్మములు-సేతుపద సంబంధముగూడ సముద్రమునకే ప్రసిద్ధము-ఈమూఁడుపదముల యర్థము వలనను, సంసారమునకు సాగరముతో నైక్యారోపము స్ఫురించుచునే యుండును. అనఁగా ననుమేయ మగుచునేయుండును. అందుచే "సాగర" శబ్దమును ప్రయోగించి సంసారమునందు సాగరత్వారోపమును శబ్దముఖమునఁ జెప్పుటకంటె అర్థముగనే యుంచిన బాగుండెడిది. సేతుపదము నెప్పుడు ప్రయోగించితిమో అప్పుడే-"దాటుటకు" అను నర్థము ప్రతీతమగుచునేయుండును. అందుచే, పై శ్లోకమున సాగర-ఉత్తార పదములను రెంటిని తీసివేసి, "అగాధాపార సంసారసేతవే" అని ప్రయోగించిన బాగుండెడిది. సాగరోత్తార శబ్దముల ప్రయోగము పునరుక్తమగుచున్నది.

రూపణము (ఆరోపము) అర్థశక్తివలన భాసించినపుడది యనుమేయ మగును. శాబ్దరూపణముకంటె అర్థరూపణమే యుక్తమనుట కుదాహరణము:

"చుంబనే విపరివర్తితాధరం హస్తరోధి రశనావిఘట్టనే
విఘ్నితేచ్ఛమపి తస్య సర్వతో మన్మథేన్ధనమభూత్ వధూరతమ్"

అర్థము: ముద్దిడుకొనుటకు యత్నింపఁగా, నాయిక, అధరమును త్రిప్పివేసినది. ఒడ్డాణముకూడ దీయఁబోవ, చేతితో నడ్డగించినది. ఇట్లు కోరికలకు విఘ్నము కలిగినను, ఆ నాయికయొక్క రతి, మన్మథున కింధనమే యైనది. ఇచట ఇంధనశబ్ద సాహచర్యమువలన, మన్మథునియం దగ్నిత్వ మారోపితమగుచున్నది. అగ్నిశబ్దమును కవి ప్రయోగింపలేదు. ఇట్లు రూపణ మిచట ననుమేయ లభ్యమై సుందరముగ నున్నది.

"సకలకలాకనక నికషపాషాణ"

'సర్వకళలనెడు బంగారమునకు నికషపాషాణము' (ఒరపిడి రాయి) ఇచట నికషమను పదమొకటియే ఒరపిడిరాయి అనునర్థమును చెప్పెను. అందుచే పాషాణ శబ్దము పునరుక్తము.

"కరకలిత నిశాతోత్ఖాత ఖడ్గాగ్రధారా
దృఢతరవినిపాత చ్ఛిన్నదుష్టారికంఠః"

అర్థము:-చేతియందు ధరింపఁబడి, పదునై, పైకెఁదీయఁబడిన ఖడ్గముయొక్క అగ్రధార (చివరఅంచు) యొక్క దృఢతరమైన పతనముచే ఛిన్నమైన దుష్టశత్రువుయొక్క కంఠము కలవాఁడు.

ఒకనిని చంపుటకు తీసిన కత్తి, చేతియందే పట్టుకొందురు. అది పదునుగలిగియే యుండును. పైకెఁదీసియే శత్రువుపై వేయుదురు. ఖడ్గము నుపయోగించినాఁడని చెప్పినతోడనే యీ యర్థము లవశ్యము భాసించితీరును. ఒకనిని నరకుటలో ఖడ్గము సాధనమైనపుడు, దాని అగ్రధార (వాయి) యే ఛేదనక్రియయం దుపయోగించుననని, చెప్పకున్నను తెలియుచునే యుండును. ఖడ్గము, శత్రువును చంపవలెనన్నచో నది దృఢతరముగనే శత్రువుపైపడి తీరవలయును. లేకున్న

శత్రువును చంపదు-శత్రువనునత డెప్పుడును, దుష్టు డయియే యుండును. ఇట్లు ఖడ్గపద మొకటియే కరకలిత నిశాతోత్ఖాత పదములయర్థములను, భిన్నయను పద మొకటియే అగ్రధారా, దృఢతర వినిపాత పదముల యర్థములను, అరి శబ్దము దుష్టశబ్దార్థమును భాసింపఁజేయుచునేయుండును. "ఖడ్గచ్ఛిన్నారికంఠః" అనినాల్గు పదములను ప్రయోగించుచో పై శ్లోక పాదముల యర్థము సమగ్రముగ ననుమేయమగుచునేయుండును. ఈవిధముగ కర, కలిత, నిశాత, ఉత్ఖాత, అగ్ర, ధారా, దృఢతర, వినిపాత, దుష్టపదములు గతార్థములై పునరుక్తములగుచు, నిరుపయోగము లగుచున్నవి. పై శ్లోకమున "ఖడ్గ భిన్నారికంఠ" అను నాల్గుపదములే సారము. మిగిలినవి చెత్తయే. అవి పాదపూరణముకొఱకే యుపయోగించును కాని, అర్థవిశేష ప్రతీతి కేమాత్రము నుపకరించవు.

"శీధురసవిషయపాన క్రియావశావాప్త జన్మమదవివశా
గలదంశుక దృశ్యముఖీ సుఖాయతే కిమపి కమితురచిరోఢా"

"చెఱకు కల్లుయొక్క, రసమనెడు విషయముయొక్క పానమనెడు క్రియయొక్క వశమువలనఁ బొందఁబడిన పుట్టుకగల మదమునకు వివశయై, జారిపోవుచున్న ముసుగునుండి చూడఁబడుచున్న ముఖముగలదై, నూత్నవధువు, ప్రియునకు వర్ణనాతీతమైన సుఖమును కలిగించును.

ఇందు "రసమనెడు -- పుట్టుకగల" యను నర్థమును తెలుపు "రస[1] విష[2]య పాన క్రియా వశా వాప్త జన్మ" అను నేడుపదముల యర్థమును "శీధు మదవివశా" అను పదముల యర్థముతో గతార్థములే యగుటచే నవి యేడును పునరుక్తములే.

"మదిరాద్రవ పానవ శావాప్తోదయ మదవిఘూర్ణితాత్మైవ
తవ తరుణి మదనదీపన మిద మక్షియుగం సమాభాతి"

అర్థము: కల్లునీళ్ళు త్రాగుటవలన కలిగిన పుట్టుకగల మదముతో తిరుగుచున్న నీ కనుల జంట, ఓ తరుణీ, మన్మథున కుద్దీపనముగ భాసించుచున్నది.

ఇందు "మదిరాక్షి" అను రెండు పదములే సారభూతములైనవి. మిగిలిన పదునాఱు పదములును అవకర ప్రాయములే. (ద్రవ, పాన, వశా, వాప్తో, దయ, మద, విఘూర్ణితా, త్వైవ, తవ, తరుణి, మదన, దీపన, మిదమ్, యుగం, సమాభాతి అనునవి పదునాఱు)

"మదిరాక్షి" యను సంబోధనపదములు రెండుమాత్రమే మిగిలిన పదముల యర్థమును చెప్పఁగలవు. ఈయర్థమును భరతుఁడిట్లు చెప్పినాడు:

"ఆఘూర్ణమానమధ్యా, యా, క్షామా చాంచిత తారకా
దృష్టి ర్వికసితాపాంగా మదిరా తరుణే మదే"

"మత్తు క్రొత్తగా కలిగినపుడు, నడుము తిరుగుచుండును. కనుగ్రుడ్లు అందముగ నుండును. కనుకొలఁకులు వికసించి యుండును. ఈ స్థితిగల, సన్నని స్త్రీ (క్షామ) మదిర యనఁబడును.

ఇటువంటి దుష్ట పదప్రయోగములు, లోష్టసంచార క్రమమున ననేకవిధములుఁగ నుండును. అవి ప్రయోగించినను ప్రయోగింపకున్నను అర్థములో నేమియును భేదము కలుగదు. అందుచే కావ్యమున శల్యములవంటివి. వానిని శాబ్దికులుమాత్రమే యాదరింతురు. అవి ప్రస్తుత రసాభివ్యక్తికి వ్యవధానమును గలిగించును. అందుచే కవులుమాత్రము వీని నాదరింపరాదు

"యద్వా కిం బహునో క్తేన క్రియాకారకయోరపి
యదా చిత్యాదనగతిః తత్రాన్యేషాం కథైవ కా"

(సంగ్రహ శ్లోకము 45)

(సశేషము

ఆంధ్రసాహిత్యపరిషత్తు

శాశ్వతాధ్యక్షులు

విమర్శకాగ్రేసర ఐతిహాసిక సమ్రాట్టు

శ్రీ బండారు తమ్మయ్య

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి

శ్రీ దంటు భాస్కరరావు

సహాయ కార్యదర్శి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

కార్యనిర్వాహక సభ్యులు

1. శ్రీ కోశా శివనాథశాస్త్రి
2. శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి (బాలవ్యాస)
3. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (వ్యాకరణ విద్యా, భాషాప్రవీణ)
4. శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, పౌరాణికకవిచంద్ర)
5. శ్రీ యండమూరి వేంకటరమణ (మధురకవితావిశారద)
6. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు
7. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ
8. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు, (యం. బి. బి. యస్.,)
9. శ్రీ చిరువోలు కోటీశ్వరరావు
10. శ్రీ దామెర రాజగోపాలరావు, బి. ఏ.
11. శ్రీ వేదుల రామచంద్రకీర్తి, బి. ఏ. (ఆనర్సు)
12. శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి (ఉభయభాషాప్రవీణ)
13. శ్రీ కావలి శ్రీరామమూర్తి, బి. ఎ., బి. ఎల్.

పత్రికా సంపాదకుడు

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఆంధ్రసాహిత్యపరిషత్ప్రచురణములు

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు

1వ సంపుటము	...	రు 6—0—0
2వ సంపుటము	....	6—0—0
3వ సంపుటము	....	6—0—0
4వ సంపుటము	....	6—0—0
5వ సంపుటము	....	10—0—0
6వ సంపుటము	....	10—0—0
7వ సంపుటము	....	[ముద్రణములో నున్నది]

కవిజనాశ్రయము

వేములవాడ భీమకవి విరచితము.

పెక్కు పాఠభేదములతోఁ గూడిన వెనుకటివిషయ మంతయు కలిసి తిరిగి తృతీయముద్రణపీఠికతో ముద్రితమైనది వెల రు 1—5

మాధ్యమికకారికలు

బౌద్ధాచార్య నాగార్జున ప్రణీతము. కొల్లూరు సోమశేఖర శాస్త్రి విరచిత సుబోధినీవ్యాఖ్యాసహితము. మూల్యము. రు 2—5

ఆంధ్రసాహిత్యపరిషత్తు,

కాకినాడ.

Printed by J. Gopalam, B.A, L.T., at Republic Press, Kakina
Edited by **C. PAPAIAHSASTRY**
Published by Andhra Sahitya Parishat, Kakinada.